


మార్కాపురం చెన్నకేశవుడి కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

కల్యాణ వైభోగమే...

మార్కాపురం లక్ష్మీ చెన్నకేశవస్వామి, నెమలిగుండ్ల రంగనాయకస్వామి బ్రహ్మోత్సవాలు వైభవోపేతంగా సాగుతున్నాయి. అందులో భాగంగా మార్కాపురంలో ఆదివారం ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై శ్రీదేవి, భూదేవి సమేత చెన్నయ్య కల్యాణోత్సవం... చూసిన కనులదే భాగ్యం అన్నట్టు సాగింది. ఆలయ ప్రాంగణం గోవింద నామస్మరణతో మార్మోగింది. రాచర్ల మండలం జెల్లివారి పుల్లలచెరువు సమీపాన నెమలిగుండ్ల రంగనాయకస్వామి కల్యాణం కనులపండువగా నిర్వహించారు. వేల సంఖ్యలో భక్తులు తిలకించి తరించారు.



నెమలిగుండ్ల రంగనాయకస్వామి కల్యాణం

సిట్ కేసులు సెట్ అయ్యేనా?

వైసీపీ హయాంలో జిల్లాలో కొనసాగిన భూదోపిడీలో బాధితులకు న్యాయం జరుగుతుందా? అసలు హక్కుదారులకు వారి స్థలాలు దక్కుతాయా? అన్నది చర్చనీయాంశమైంది. ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విచారణను పునఃప్రారంభించడంతో బాధితుల్లో ఆశలు చిగురించాయి. కేసును నిగ్గు తేల్చి త్వరితగతిన న్యాయం చేయాలని వారు కోరుతున్నారు.

- గత వైసీపీ హయాంలో జిల్లాలో భారీగా భూదోపిడీ
- విచారణకు సిట్ ఏర్పాటు
- అనంతరం సైలెంట్
- బాధితుల్లో ఆందోళన
- శాసనసభలో చర్చించిన ఎమ్మెల్యే దామచర్ల
- కలెక్టర్, ఎస్పీలతో సమీక్షించిన రెవెన్యూశాఖ ముఖ్య కమిషనర్
- పునఃప్రారంభమైన విచారణ

ఒంగోలు క్రైం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ ప్రభుత్వ హయాంలో ఒంగోలులో నకిలీ పత్రాలు సృష్టించి భూములను కాజేసే ముఠా పోలీసులకు పట్టుబడింది. విచారణలో అవాక్కయ్యే అనేక నిజాలు బయటపడ్డాయి. నగరంలో మరికొంత మంది కూడా భూదందాలకు పాల్పడ్డట్లు ఆరోపణలు వచ్చాయి. జిల్లావ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి ఉన్నట్లు ఫిర్యాదులు రావడంతో అప్పటి ఎస్పీ విచారణకు ఆదేశించారు. సిట్‌ను ఏర్పాటు చేశారు. తొలుత వేగంగా విచారణ చేసిన సిట్ అనంతరం సైలెంట్ అయ్యింది. అందుకు రాజకీయ ఒత్తిళ్లే కారణమన్న ఆరోపణలు ఉన్నాయి. రెండేళ్లుగా అతీగతీలేకపోవడంతో బాధితులు ఆందోళన చెందుతున్నారు.

● కూటమి ప్రభుత్వం రాకతో కదలిక

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత భూముల కుంభకోణం విషయాన్ని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, సీఎం చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లారు. ఉన్నతాధికారులను కూడా అనేక పర్యాయాలు కలిశారు. ఈ నేపథ్యంలో రెవెన్యూశాఖ ముఖ్య కమిషనర్ కొద్దినెలల క్రితం ఒంగోలు వచ్చారు. ఈ సందర్భంగా గత సిట్ కేసుల గురించి ప్రత్యేకంగా కలెక్టర్, ఎస్పీల సమక్షంలో అధికారులతో సమీక్షించారు. అన్ని శాఖల సమన్వయంతో దర్యాప్తు చేయాలని ఆదేశించారు. అనంతరం కలెక్టర్ అన్సారియా ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి అధికారులకు పలు ఆదేశాలిచ్చారు. ఎస్పీ దామోదర్ పోలీసు అధికారులతో మరో సమావేశాన్ని ఏర్పాటు చేసి సిట్ దర్యాప్తులో ఉన్న 109 కేసులను ప్రాంతాల వారీగా నలుగురు డీఎస్పీలు, 11 మంది సీఐలకు అప్పగించారు. నకిలీపత్రాల తయారీదారులను గుర్తించాలని ఆదేశించారు. దీంతో వారు రంగంలోకి దిగి విచారణను పునఃప్రారంభించారు.

బాధితుల్లో ఆందోళన

నకిలీ పత్రాలు సృష్టించి ఇతరుల ఆస్తులను కబ్జా చేసి అమ్ముకున్న భూబకాసురులు కోట్లకు పడగలెత్తారు. అలాంటి వారంతా బయట తిరుగుతున్నారు. పైసాపైసా కూడబెట్టుకొని స్థలం కొన్న యజమానులు మాత్రం ఆందోళన చెందుతున్నారు. ఆస్తుల రిజిస్ట్రేషన్ సమయంలో సదరు అధికారులు జాగ్రత్తలు తీసుకొని ఉంటే ఇలాంటి కష్టాలు హక్కుదారులకు వచ్చేవి కావు. గతంలో భూదోపిడీకి సంబంధించి సిట్ నమోదు చేసిన వాటిలో 50 కేసుల్లో రిజిస్ట్రేషన్ తప్పిదాలు ఉన్నట్లు గుర్తించారు. వీటికి సంబంధించిన రిజిస్ట్రేషన్‌లను రద్దు చేసి అసలైన యజమానులకు తిరిగి హక్కులు కల్పించాలని రెవెన్యూ ముఖ్య కార్యదర్శి సమీక్ష సందర్భంగా రిజిస్ట్రేషన్ అధికారులకు సూచించారు. అయితే అలా వీలుపడదని వారు చెప్పారు. న్యాయపరంగా హక్కులు సాధించుకోవాల్సిందేనని స్పష్టం చేశారు.

ఈనేపథ్యంలో విచారణను పునఃప్రారంభించిన సిట్ దాన్ని పూర్తి చేసి కోర్టులో చార్జిషీట్లు దాఖలు చేయాల్సి ఉంది. అందుకు సరైన సాక్ష్యాలు సేకరిస్తేనే కోర్టు పరిధిలో చిక్కులు వీడే అవకాశం ఉంది. అయితే రెండేళ్ల క్రితం కేసులు నమోదు చేసిన సిట్ అధికారులు ఇప్పుడు లేరు. కొత్తగా వచ్చినవారు దర్యాప్తు పూర్తి చేసేందుకు సమయం పట్టే అవకాశం ఉంది. అలాకాకుండా వీలైనంత వేగంగా విచారణను పూర్తి చేసి తమకు న్యాయం జరిగేలా చూడాలని బాధితులు కోరుతున్నారు.

జిల్లాలో గాలివాన ఆదివారం బీభత్సం సృష్టించింది. తూర్పు, మధ్యపశ్చిమ ప్రాంతంలో భారీ నష్టాన్ని చేకూర్చింది. దర్శి నియోజక వర్గంలో బొప్పాయి తోటలు ధ్వంసమ వడంతో రైతులకు కోలుకో లేని దెబ్బ తగిలింది. ఇతర చోట్ల కల్లాల్లోని మిర్చి, ధాన్యాన్ని కాపాడుకు నేందుకు కర్షకులు పరుగులు తీశారు. అయినప్పటికీ పలుచోట్ల తడిసిపో యాయి. ముండ్లమూరు, కనిగిరి ప్రాంతాల్లో వడగండ్ల వాన కురిసింది. ఒంగోలు నగరంతోపాటు కొన్ని పట్టణాలు, అనేక గ్రామాల్లో గాలుల తీవ్రతకు చెట్లు విరిగి పడ్డాయి. వీటితోపాటు హోర్డింగ్‌లు కూలి విద్యుత్ తీగలపై పడటంతో అవి తెగిపోయాయి. అక్కడక్కడా కరెంటు స్తంభాలు నేలకొరిగాయి. చాలా గ్రామాల్లో రాత్రి పొద్దుపోయే వరకు అంధకారం నెలకొంది. దీంతో జనం అల్లాడిపోయారు.



దర్శిలో గాలి వానకు విరిగిపడిన బొప్పాయిచెట్లు

భీకర గాలులు

వణికిపోయిన జిల్లా
పలుచోట్ల వర్షం

బీభత్సం

తూర్పు, మధ్యపశ్చిమ ప్రాంతంలో భారీ నష్టం

- ముండ్లమూరు, కనిగిరిలో వడగండ్లు
- దర్శిలో బొప్పాయి తోటలు ధ్వంసం
- తడిసిపోయిన కల్లాల్లోని మిర్చి, ధాన్యం.. రైతుల పాట్లు
- విరిగిన చెట్లు,కూలిన హోర్డింగ్‌లు
- తెగిపోయిన కరెంటు తీగలు
- విద్యుత్‌కు తీవ్ర అంతరాయం



ఉన్నగురవాయిపాలెంలో ట్రాక్టర్‌పై విరిగి పడిన విద్యుత్ స్తంభం



ఒంగోలులో విరిగి పడిన చెట్టు



ఒంగోలులో పడిపోయిన బారికేడ్లను నిలుపుతున్న ట్రాఫిక్ పోలీసులు

ఒంగోలు/క్రైం ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లావాసులను గాలివాన వణికించింది. ఆదివారం సాయంత్రం వరకూ ఎండ తీవ్రత కొనసాగగా ఆతర్వాత వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. సాయంత్రం ఐదు గంటల ప్రాంతంలో ఉరుములు, మెరుపులు, గాలులతో కూడిన వర్షం కురిసింది. దాదాపు గంటపాటు కొనసాగింది. సాయంత్రం ఆరు గంటల సమయానికి జిల్లాలోనే అత్యధికంగా కనిగిరిలో 43.0 మి.మీ వర్షపాతం నమోదైంది. దొనకొండ మండలం రుద్ర సముద్రంలో 25.50, పొదిలిలో 21.50, ముండ్లమూరు మండలం శంకరాపురంలో 21.0, పెద్దారవీడు మండలం బి.చెర్లోపల్లిలో 13.25, దర్శిలో 13.25 మి.మీ వర్షం కురిసింది. ఒంగోలు, కొనకనమిట్ల, మర్రిపూడి, చీమకుర్తి, సంతనూతలపాడు, జరుగుమల్లి, దోర్నాల తదితర మండలాల్లో ఓ మోస్తరు జల్లులు పడ్డాయి.

నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు

గాలుల తీవ్రతతో అనేక ప్రాంతాల్లో చెట్లు, హోర్డింగ్‌లు విరిగి విద్యుత్ వైర్లపై పడటంతో అవి తెగిపోయాయి. అక్కడక్కడా స్తంభాలు నేలకొరిగాయి. దీంతో చాలా గ్రామాల్లో రాత్రి పొద్దుపోయే వరకు విద్యుత్ సరఫరా పునరుద్ధరణ జరగలేదు. కనిగిరిలో పెనుగాలులతో కురిసిన వడగండ్ల వాన భీతావహ వాతావరణాన్ని సృష్టించింది. ప్రభుత్వ బాలికల హైస్కూల్ వద్ద విద్యుత్ స్తంభం నేలకొరిగింది. స్తంభానికి ఉన్న విద్యుత్ తీగలు తెగిపోయి నేలను తాకడంతో సరఫరా నిలిచిపోయింది. పట్టణ సమీపంలోని సూరాపాపిరెడ్డి కాలనీలోని ఓ కారు డ్రైవర్ నివాసంపై రేకుల కప్పుతోపాటు మరో రెండు ఇళ్లపై రేకులు పూర్తిగా ఎగిరిపోయాయి.

ఒంగోలులో అంధకారం

ఒంగోలులోని పలు ప్రాంతాల్లో చెట్లు, హోర్డింగ్‌లు విరిగి తీగలపై పడటంతో కరెంటు సరఫరా నిలిచిపోయింది. విద్యుత్ సిబ్బంది కొన్నిచోట్ల రాత్రి 8 గంటలకు సరఫరా పునరుద్ధరించగలిగారు. రంగారాయుడు చెరువు సమీపంలో విద్యుత్ తీగలపై ఫ్లెక్సీలు పడ్డాయి. పులి వెంకటరెడ్డి కాలనీ నుంచి కొప్పోలు వరకు ఉన్న కాలనీలన్నీ అంధకారంలో ఉండిపోయాయి.



ముండ్లమూరు మండలం ఉమామహేశ్వరపుర అగ్రహారంలో మిర్చి పట్టలపై నీటిని తొలగిస్తున్న రైతులు

పంటలకు తీవ్ర నష్టం

- దర్శి, ముండ్లమూరు ప్రాంతంలో బొప్పాయి తోటలు ధ్వంసమయ్యాయి. ఎకరాకు రైతులు సుమారు రూ.2 లక్షల వరకూ పెట్టుబడులు పెట్టారు. ప్రస్తుతం కాపు దశలో ఉంది. ఈ సమయంలో చెట్లు విరిగిపోవడంతో రైతులు పూర్తిగా నష్టపోయారు. కోత దశలో ఉన్న మిరపకాయలు గాలులకు రాలిపోయాయి.
- పీసీపల్లి మండలంలోని పలు గ్రామాల్లో మిర్చిపై కప్పిన పట్టలు గాలికి లేచిపోవడంతో పంట తడిసిపోయింది. పెద్దన్నపల్లిలో సింగిల్ ఫేస్ ట్రాన్స్‌ఫార్మర్ అమర్చి ఉన్న స్తంభం గాలి తీవ్రతకు విరిగి పడింది. పలుచోట్ల చెట్లు పడటంతో తీగలు తెగిపోయాయి. దీంతో ఆ మండలంలోని అన్ని గ్రామాలకు సరఫరా నిలిచిపోయింది.
- ముండ్లమూరు మండలంలోని పలు గ్రామాల్లో వడగండ్ల వాన కురిసింది. కల్లాల్లో ఉన్న మిర్చి తడిచిపోయింది. మినుము, నువ్వు గాలివాన దాటికి ఒరిగిపోయింది. రేకల్లోని వైట్ బర్లీ తడిసిపోయింది.
- పొదిలి-దర్శి మార్గంలోని కుంచేపల్లి, గురువాయపాలెం ప్రాంతంలో చెట్లు విరిగి రోడ్డుపై పడ్డాయి. కొద్ది వర్షానికే ఒంగోలు, పొదిలి, కనిగిరి పట్టణాల్లో నీరు రోడ్లపై పారి ప్రజలు అవస్థ పడ్డారు.



ఉన్నగురవాయిపాలెం వద్ద విరిగిపడిన వేపచెట్టు

ఇంటి గోడ కూలి మహిళ మృతి

కనిగిరి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : నిర్మాణంలో ఉన్న ఇంటి గోడ కూలిపడటంతో మహిళ మృతి చెందిన ఘటన కనిగిరిలోని కనకపట్టణంలో ఆదివారం చోటుచేసుకుంది. పట్టణంలోని శంఖవరం గ్రామానికి చెందిన డబ్బుగొట్టు వెంకట లక్ష్మమ్మ (55) గేదెలకు గడ్డి కోసేందుకు తమ పొలానికి బయల్దేరింది. మార్గమధ్యంలో ఈదురుగాలులతో కూడిన వర్షం ప్రారంభమైంది. దీంతో లక్ష్మమ్మ నిర్మాణంలో ఉన్న గోడ పక్కకు వెళ్లి కూర్చుంది. ఈ సమయంలో సిమెంటు బ్రిక్స్‌తో కట్టిన గోడ కూలి ఆమెపై పడింది. తలకు, ముఖానికి బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందింది.



చనిపోయి ఉన్న లక్ష్మమ్మ వివరాలను సేకరిస్తున్న ఎస్ఐ శ్రీరాం



ఎస్సీ హాస్టల్‌ను పరిశీలిస్తున్న మంత్రి స్వామి

రూ.143 కోట్లతో వసతి గృహాలకు మరమ్మతులు

- సంస్కరణలతో ఇంటర్‌లో పెరిగిన ఉత్తీర్ణత శాతం
- మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి

కొండపి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా కూటమి ప్రభుత్వం రాష్ట్రంలోని సాంఘిక సంక్షేమశాఖ వసతి గృహాలకు రూ.143 కోట్లతో మరమ్మతులు చేయిస్తున్నదని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. కొండపిలోని జాళ్లపాలెం రోడ్డులో ఉన్న ఎస్సీ బాలుర హాస్టల్‌ను మంత్రి ఆదివారం సందర్శించారు. అక్కడి వసతులతోపాటు, మరమ్మతులు ఎక్కడెక్కడ అవసరమో పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చాక సంక్షేమ వసతి గృహాలు, గురుకులాల్లో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించామన్నారు. నాణ్యమైన భోజనం, విద్య అందిస్తున్నామన్నారు. ఈ విషయంలో వెనుకడుగు వేసే ప్రసక్తే లేదన్నారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తెచ్చిన సంస్కరణల ఫలితంగా ఇంటర్‌లో ఉత్తీర్ణత శాతం పెరిగిందన్నారు. రాష్ట్రంలోని విద్యార్థుల భవిష్యత్ లోకేష్ ఆధ్వర్యంలో ఉజ్వలంగా మారనున్నదని మంత్రి స్వామి అన్నారు. ఆయన వెంట కొండపి ఏఎంసీ మాజీ ఛైర్మన్ గొర్రెపాటి రామయ్యచౌదరి, పార్టీ నాయకుడు కొర్రపాటి వీరభోగవసంతరావు, సీఐ సోమశేఖర్ ఉన్నారు.

వెబ్‌సైట్‌లో హెచ్‌ఎం ఉద్యోగోన్నతుల సీనియారిటీ జాబితా

ఒంగోలు (విద్య), ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : పాఠశాల విద్య జోన్-3 పరిధిలోని ఉమ్మడి ప్రకాశం, గుంటూరు, నెల్లూరు జిల్లాల్లోని ప్రభుత్వ స్కూళ్లలో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్‌లకు గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయులుగా ఉద్యోగోన్నతులు కల్పించేందుకు తాత్కాలిక సీనియారిటీ జాబితాను వెబ్‌సైట్‌లో ఉంచినట్లు డీఈవో ఎ.కిరణ్ కుమార్ తెలిపారు. దీనిపై అభ్యంతరాలు ఉంటే తగు ఆధారాలతో ఈనెల 16లోపు తన కార్యాలయంలో సమర్పించాలన్నారు. గడువు ముగిసిన తరువాత వచ్చే అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోబోమని డీఈవో స్పష్టం చేశారు.

నేడు 'మీ కోసం' రద్దు

ఒంగోలు క్రైం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : పోలీసు శాఖ ప్రతి సోమవారం నిర్వహించే మీకోసం (ప్రజా సమస్యల పరిష్కార వేదిక)ను ఈసారి తాత్కాలికంగా రద్దు చేసినట్లు ఎస్పీ దామోదర్ తెలిపారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా సెలవు కావడంతో ఆమేరకు నిర్ణయం తీసుకున్నామన్నారు. ఈ విషయాన్ని గమనించి సుదూర ప్రాంతాల నుంచి ఎవ్వరూ ఒంగోలులోని జిల్లా పోలీసు కార్యాలయానికి రావద్దని ఆయన కోరారు.

రైల్వే వినియోగదారుల కమిటీ సభ్యురాలిగా సూర్యకుమారి


శిద్దా సూర్యకుమారి

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ గ్రానైట్ పారిశ్రామికవేత్త, రైజ్ కృష్ణసాయి ఇంజనీరింగ్ కళాశాల నిర్వాహకులు శిద్దా వెంకటేశ్వరరావు సతీమణి శిద్దా సూర్యకుమారి రైల్వే వినియోగదారుల కమిటి సభ్యురాలిగా నియమతులయ్యారు. ఈమేరకు దక్షిణమధ్య రైల్వే సికింద్రాబాద్ నుంచి నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ కమిటీలో పార్లమెంట్ సభ్యులు, కేంద్రమంత్రులు, వివిధ రాష్ట్రాల నుంచి సభ్యులు ఉంటారు. ప్రత్యేక హోదాతో బుకింగ్, క్యాటరింగ్, వెయింటింగ్‌రూములు వంటి ప్రయాణికుల సంబంధిత యూనిట్లను, టిక్కెట్లు లేకుండా ప్రయాణిస్తున్నారని అనుమానం ఉంటే ఈ కమిటి సభ్యులు కంపార్ట్‌మెంట్లు, క్యారేజీలను తనిఖీ చేసే అవకాశం ఈ కమిటీ సభ్యులకు ఉంటుంది. సూర్యకుమారి నియామకం పట్ల పలువురు అభినందించారు.

అంబేడ్కర్ జాతీయ అవార్డు ప్రదానం


వెంకట్రావును అభినందిస్తున్న లక్ష్మణరావు

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ జాతీయ అవార్డును ఒంగోలుకు చెందిన ఎం. వెంకటేశ్వర్లు అందుకున్నారు. గుంటూరులోని ఏసీ కాలేజీలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు చేతుల మీదుగా వెంకటేశ్వర్లుకు అవార్డు అందజేయడంతో పాటు సన్మానించారు. గత 24 ఏళ్ల నుంచి సాంఘిక శాస్త్ర అధ్యాపకునిగా, వివిధ కోచింగ్ సెంటర్లలో జీకే, కరెంట్ అఫైర్స్ బోధన, ఎంవీఆర్ ఎడ్యుకేషనల్ సర్వీసు ద్వారా పలు కోర్సుల గైడెన్స్, మోటివేషన్ శిక్షణకులుగా పనిచేయడంతో ఈ అవార్డు లభించింది. వెంకటేశ్వర్లు అవార్డును అందుకోవడం పట్ల పలువురు అభినందనలు తెలిపారు.

పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి

● సీపీఎం నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించి జిల్లా రైతులను ఆదుకోవాలని సీపీఎం డిమాండ్ చేసింది. ఆదివారం ఒంగోలులోని సుందరయ్య భవన్‌లో జరిగిన సీపీఎం ప్లీనరీ సమావేశానికి పూనాటి ఆంజనేయులు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా చేసిన తీర్మానాలను పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్‌కే.మాబు విడుదల చేశారు. కరువు మండలాలుగా ప్రకటించిన 21 మండలాల్లో కరువు సహాయక చర్యలు చేపట్టాలని, నల్లబర్లీ, బర్లీ, పొగాకు, మిర్చి, వరి తదితర పంటలకు మద్దతు ధర కల్పించాలన్నారు. నీటి ఎద్దడి నివారణ చర్యలు తీసుకోవాలని, తాగునీటి కొరత ఉన్న గ్రామాలు, పట్టణాలకు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయాలని పేర్కొన్నారు. అలాగే ఒంగోలు, కనిగిరి, దర్శి, గిద్దలూరు చీమకుర్తి, పొదిలి పట్టణాల్లో మంచినీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని వారు కోరారు.

మోటార్‌సైక్లిస్టుకు గాయాలు

మద్దిపాడు, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): మోటార్‌సైకిల్ అదుపుతప్పి యువకునికి గాయలైన సంఘటన గుండ్లపల్లి పరిశ్రమలకేంద్రంలో ఆదివారం జరిగింది. స్థానికుల సమాచారం ప్రకారం, ఒంగోలు నగరం గోపాల్‌నగర్‌కు చెందిన ఆవుల అరవింద్‌బాబు తన మోటార్‌సైకిల్‌పై చిలకలూరిపేటకు బయలుదేరారు. అయితే అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో తలకు, మోకాలిపై తీవ్ర గాయాలు కాగా అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. కాగా మెరుగైన వైద్యం కోసం గుంటూరు తరలించాలని వైద్యులు సూచించారు.

418 మందికి వైద్య పరీక్షలు


వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యుడు

మద్దిపాడు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతంలో కార్పొరేట్ స్థాయిలో వైద్యసేవలు అందించడం అభినందనీయమని కాకుమాను అయ్యన్న మెమోరియల్ అధ్యక్షుడు కాకుమాను శశికిరణ్ పేర్కొన్నారు. ఆదివారం మద్దిపాడులోని నటరాజ కళాకేంద్రంలో ఎయిమ్స్ వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ రామలింగేశ్వరరావు మాట్లాడుతూ పేదలకు వైద్యశిబిరం ఏర్పాటు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. 418 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు కార్తీక్, హర్షకుమార్, వి.నీరజ, బి.వి.రమణారెడ్డి, రోహిత్‌కుమార్‌రెడ్డి, అచ్యుత్ కుమార్‌శ్రీవర్మ, కాకుమాను శ్రీనివాసరావు, చల్లపల్లి సుధాకర్‌బాబు, ఏలూరు లక్ష్మీనారాయణ, కృపానందం, చంద్రమౌళి, కాకుమాను నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

హైందవ శంఖారావం నగరోత్సవం


నినాదాలు చేస్తున్న హిందూ సంఘాల నాయకులు

మద్దిపాడు, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): ఆర్‌ఎస్‌ఎస్, వివిధ హిందూ సంఘాల ఆధ్వర్యంలో హైందవ శంఖారావం నగరోత్సవం ఆదివారం మద్దిపాడులో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా సంఘ నేతలు మాట్లాడుతూ హిందువులు ఐక్యంగా ఉండాలని, సనాతన ధర్మ రక్షణ కోసం కలిసి రావాలని పిలుపునిచ్చారు. సనాతన ధర్మాన్ని కాపాడటమే లక్ష్యంగా హైందవ శంఖారావం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సనాతన ధర్మంతోనే హిందువుల అభివృద్ధి సాధ్యమన్నారు. కార్యక్రమంలో సాతులూరి నాగేశ్వరరావు, వావిలాల రమేష్‌పంతులు, పర్వతరెడ్డి శ్రీనివాసరావు, ఉండవల్లి వాసు, పురాలశెట్టి పద్మ, నూనె పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

కురిచేడు, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని అలవలపాడు గ్రామం వద్ద ఓ మహిళ అనుమానాస్పదంగా మృతి చెందారు. దర్శి ఎస్సెస్సీ కాలనీకి దగ్గరలో నివాసం ఉంటున్న అన్నెబోయిన లక్ష్మి(45) రెండు రోజుల నుంచి కనబడటం లేదని కుటుంబసభ్యులు వెతుకుతున్నారు. ఈక్రమంలో ఓవ్యక్తి అలవలపాడు సమీపంలో మహిళ మృతదేహం ఉందని పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్‌ఐ శివ మృతదేహాన్ని పరిశీలించి విచారణ చేపట్టగా ఆమెను దర్శికి చెందిన లక్ష్మిగా గుర్తించారు. ఆమెను గుర్తు తెలియని వ్యక్తి హత్య చేసి ఉండవచ్చుననే అనుమానాలు సంఘటనా స్థలంలో ఎక్కువ మంది వ్యక్తం చేశారు. సంఘటనా స్థలాన్ని త్రిపురాంతకం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అసన్ పరిశీలించారు. ఎస్‌ఐ శివ శవ పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం దర్శి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతురాలు లక్ష్మికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

ఆ దుండగులెవరు?

సచివాలయ ఉద్యోగిపై దాడితో ఉలికిపాటు ● పోలీసులకు సవాల్‌గా మారిన కేసు


దుండగుల దాడిలో గాయపడిన చినబాబు(ఫైల్)

మర్రిపూడి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అంకేపల్లిలో పనిచేస్తున్న సచివాలయ ఉద్యోగిపై గత బుధవారం జరిగిన దాడికేసు పోలీసులకు సవాలుగా మారింది. గతంలో ఎన్నడు లేని విధంగా బైక్‌పై విధులకు హాజరౌతున్న వ్యవసాయ సహాయకులు చినబాబుపై మాస్కులు ధరించి వచ్చిన ముగ్గురు యువకులు దాడికి పాల్పడటం మండలంలో భయాందోళనలు రేకెత్తించింది. కూచిపూడికి చెందిన ఈర్ల చినబాబు బైక్‌పై విధినిర్వహణకు అంకేపల్లికి వస్తుండగా గంగమ్మ దేవాలయం సమీపంలోకి వచ్చే సరికి వెనుకవైపు నుంచి ముగ్గురు దుండగులు బైక్‌పై వెంబడించారు. హలోబ్రో అని పలకరించడంతో పక్కకు తిరిగి చూసిన చినబాబుపై మధ్యలో కూర్చున్న వ్యక్తి కళ్లల్లో పెప్పర్‌స్రే చేశారు. దీంతో అదుపు తప్పి మోటార్‌సైకిల్‌పై నుంచి కింద పడ్డాడు. వెనుక కూర్చున్న వ్యక్తితోపాటు మిగి లిన ఇద్దరు ఇనుప రాడ్లతో విచక్షణారహితంగా దాడి చేశారు. అదే సమయంలో అటువైపు నుంచి వస్తున్న మోటార్ సైకిల్ హారన్ వినపడటంతో ముగ్గురు దుండగులు పరారయ్యారు. తీవ్రంగా గాయపడిన చినబాబును స్వగ్రామమైన కూచిపూడికి మోటార్‌సైకిల్‌పై తరలించారు. అక్కడ నుంచి ఒంగోలు రిమ్స్‌లో చేర్పించారు. మెరుగైన చికిత్సకోసం గుంటూరులో ప్రైవేటు వైద్యశాలలో చేర్పించారు. మండలంలోని పలుగ్రామాలలో సీసీకెమేరాలు ఏర్పాటు చేశారు. దుండగులు ప్రయాణించే ద్విచక్రవాహనం ఏ గ్రామంలోనైనా సీసీ కెమెరాల్లో నిక్షిప్తమై ఉంటుంది. దుండగులు మర్రిపూడి మండల నుంచి కనిగిరి, పొదిలి, కొండపి, చీమకుర్తి, జరుగుమల్లి మండలాల వైపు పారిపోయి ఉంటారని భావిస్తున్నారు. ఆయా మండలాల్లోని పలు గ్రామాలు మర్రిపూడి మండలానికి అనుసంధానమై ఉన్నాయి. అక్కడ కూడా సీసీకెమెరాలను పరిశీలిస్తే దుండగుల వాహన కదలికలు తెలుసుకునే అవకాశం ఉందని చెబుతున్నారు. మరోవైపు పోలీసులు సైతం ఈ కేసును సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో ఛేదించాలని భావిస్తున్నారు. దాడి చేసిన సమయంలో ఆ ప్రదేశంలో సెల్‌ఫోన్ టవర్ల ఆధారంగా దుండగుల ఫోన్‌లను గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నారు. దాడికి గల కారణాలు స్పష్టంగా తెలియడం లేదు. గతంలో చినబాబుతో ఎవరికైనా విబేధాలు ఉన్నాయా లేక వ్యక్తిగత కక్షలు ఉన్నాయా అనే నేపథ్యంలో సైతం పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం. దుండగులు మాస్కులు ధరించడంతో ఆ ముగ్గురు క్షతగాత్రుడికి ముఖపరిచయం ఉన్నవారై ఉంటాయని భావిస్తున్నారు. మొత్తంగా ఈ కేసు పోలీసులకు సవాలుగా మారిందనడంలో ఎలాంటి సందేహం లేదు.

టీడీపీని మరింత బలోపేతం చేయాలి

● ఎమ్మెల్యే దామచర్ల


డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్

ఒంగోలు కార్పొరేషన్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): గ్రామస్థాయి నుంచి డివిజన్, నియోజకవర్గ స్థాయి వరకు తెలుగుదేశం పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ కోరారు. ఆదివారం నగరంలోని 9,11,12 డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులతోపాటు డివిజన్ కార్యకర్తలతో స్థానిక టీడీపీ కార్యాలయలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ టీడీపీ బలోపేతం చేసేందుకు కమిటీల నిర్మాణం అత్యవసరమని చెప్పారు. ప్రతి డివిజన్‌లోనూ బూత్ స్థాయి నుంచి వ్యూహాత్మకంగా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే అసలైన బలం అన్నారు. ప్రతి కార్యకర్త పార్టీ కోసం కష్టపడి పనిచేయాలని, బాధ్యతో అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగాలని కోరారు. ప్రతి ఒక్కరూ సమర్థవంతంగా పనిచేయాలని, కుటుంబ సాధికార సారథుల నియామకం ద్వారా డివిజన్ స్థాయిలో మరింత బలమైన నేతలను సమకూర్చుకోవాలన్నారు. ప్రభుత్వ ఫలాలను ప్రజల్లోకి తీసుకెళ్ళే బాధ్యత మనపై ఉందని, ప్రతి కార్యకర్త ప్రజల సమస్యలపై అధ్యయనం చేసి వాటి పరిష్కారం కోసం కృషి చేయాలన్నారు. డివిజన్‌లలో ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే దామచర్ల కోరారు. సమావేశంలో డివిజన్ కార్యకర్తలు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఉదయం ఎండ.. సాయంత్రం గాలివాన

● విద్యుత్ సరఫరాలో అంతరాయం
● చల్లబడిన వాతావరణం
● ఊపిరిపీల్చుకున్న ప్రజలు


ఒంగోలులో కురుస్తున్న వర్షంలో ప్రయాణిస్తున్న కారు


కొండపిలోని శివాలయం వీధిలో టెలిఫోన్ స్తంభంపై వేలాడుతున్న టూ వీలర్ సీట్ కవర్

ఒంగోలు కార్పొరేషన్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): గత నెలన్నర నుంచి ఉక్కపోతలు. ఎండ తాపానికి అల్లాడిన ఒంగోలు నగర ప్రజలకు కొంత ఉపశమనం లభించింది. ఆదివారం సాయంత్రం కురిసిన వానకు నగరం కొంతమేర చల్లబడగా, వేడి సెగలు తగ్గాయి. అయితే ఎండతాపం నుంచి కొంతమేర తప్పించుకున్నారు. రాబోయే రోజుల్లో పెరిగే ఎండలు గుర్తొస్తేనే జనం భయపడుతున్నారు. ఇదిలా ఉంచితే సాయంత్రం 5 గంటల నుంచి భారీగా ఈదురుగాలులు వీయగా, ఓ గంటసేపు ఓ మోస్తరు వర్షం కురిసింది. దీంతో వీచిన గాలులకు నగరంలోని పలు చోట్ల చెట్లు విరిగిపడిపోగా, మరికొన్ని ప్రాంతాల్లో కరెంటు సరఫరాకు అంతరాయం ఏర్పడింది. దీంతో విద్యుత్‌శాఖ అధికారులు రంగంలోకి దిగి విరిగిపడిన చెట్లును తొలగించారు. అలాగే కురిసిన కొద్ది వానకే నగరంలోని పలు రోడ్లన్నీ తడిసి ముద్దయ్యాయి. కొన్నిప్రాంతాల్లో రోడ్లపై నీరు నిలబడటంతో ప్రజలు కొంత ఇబ్బందులకు గురయ్యారు. నగరంలో ఉరుములు.. ఈదురుగాలులతో కూడిన ఓ మోస్తరు వర్షానికి చల్లబడటంతో జనం ఊపిరి పీల్చుకున్నారు.

పెనుగాలులు.. వర్షం

కొండపి: కొండపి ప్రాంతంలో ఆదివారం సాయంత్రం పెనుగాలులతో కూడిన వర్షం కురిసింది. పగటి వేళ తీవ్రంగా ఎండ కాచింది. సాయంత్రానికి మబ్బులు పట్టి పెనుగాలులు వీచాయి. ఈ కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. భారీ గాలుల కారణంగా పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు పడిపోయాయి. కొండపిలో దుకాణాల ముందు బోర్డులు రోడ్డు మీద పడ్డాయి. పలు రోడ్లలో చెట్ల కొమ్మలు విరిగిపోయాయి. పొగాకు గ్రేడింగ్ పందిళ్ల వద్ద వెలుపల ఉన్న పొగాకు వర్షం కారణంగా తడిచిపోయింది.

ఘనంగా మట్టల ఆదివారం


ఒంగోలులో జరిగిన వేడుకల్లో పాల్గొన్న క్రైస్తవులు

ఒంగోలు కార్పొరేషన్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులో మట్టల ఆదివారం వేడుకలు ఘనంగా జరిగాయి. ఏసుక్రీస్తు ప్రభువు శిలువపై మరణించి మృత్యుంజయుడుగా తిరిగి లేచిన ఈస్టర్ పండుగకు ముందు ఆదివారం ఈ వేడుకను నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చిలలో క్రీస్తు ప్రత్యేకంగా బోధనలు చేశారు. అలాగే ఆయా చర్చిలలోని చిన్నారులు కొబ్బరి మట్టలను పూలతో అలంకరించి, ప్రభువుకు జయ నినాదాలు చేశారు. క్లౌపేట, జెంబీ చర్చి, సంజయ్‌గాంధీ కాలనీలో లార్డ్ చర్చి, మామిడిపాలెం రిజరక్షన్ బాప్టిస్ట్ చర్చి, జక్రయ్య నగర్‌లోని ఇమ్మానుయేలు బాప్టిస్ట్ చర్చిలతోపాటు నగరంలోని పలు చర్చిలలో మట్టల ఆదివారం నిర్వహించారు.

నాగులుప్పలపాడు మండలంలో..

నాగులుప్పలపాడు: మట్ట ఆదివారం వేడుకలు మండలంలో పలు గ్రామాల్లో క్రైస్తవులు ఉత్సాహంగా జరుపుకున్నారు. ఉప్పుగుంటూరు. అమ్మనబ్రోలు, బి.నిడమానూరు గ్రామాల్లో సంఘకాపరుల ఆధ్వర్యంలో చర్చిల వద్ద నుంచి పలు రకాల పూలతో అలంకరించి ఈతమట్టలను చిన్నారులు, పెద్దలు చేతబట్టి ఏసు గీతాలు ఆలపించారు. గుడ్‌ఫ్రైడేకు ముందు వచ్చే ఆదివారంను మట్టల ఆదివారంగా క్రైస్తవులు జరుపుకుంటారు.

మద్దిపాడులో

మద్దిపాడు: స్థానిక తెలుగు బాప్టిస్ట్ చర్చ్ ఆధ్వర్యంలో మట్టల ఆదివారాన్ని క్రైస్తవులు ఘనంగా నిర్వహించారు. తేళ్ల నాగరాజు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.

అమరవీరుల స్ఫూర్తితో ఉద్యమించాలి

● జనసాహితీ జిల్లా అధ్యక్షుడు కృష్ణయ్య



సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణయ్య

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య ఉద్యమంలో అమరులైన భగత్‌సింగ్, ఉద్దంసింగ్‌ల స్ఫూర్తితో ఉద్యమించాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. జనసాహితి ఆధ్వర్యంలో ఆదివారం ఒంగోలులోని తరిమెల నాగిరెడ్డిభవన్‌లో జరిగిన జలియన్ వాలాబాగ్ సంస్మరణదినం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు డాక్టర్ జీవీ.కృష్ణయ్య మాట్లాడుతూ జలియన్‌వాలాబాగ్ ఘటనలో వేలమంది స్వాతంత్ర్య సమర యోధులు నేలకొరిగారని చెప్పారు. ఆ స్ఫూర్తితో ఉద్దంసింగ్, భగత్‌సింగ్ తదితరులు స్వాతంత్ర్య సమరకాంక్షతో ఉద్యమబాట పట్టారని చెప్పారు. ఉపాధ్యాయ పత్రిక సంపాదకుడు గురునాథశర్మ మాట్లాడుతూ సామ్రాజ్యవాదులు అప్పులివ్వడం పేరుతో షరతులు విధిస్తూ పేద దేశాలపై కొత్తరకం యుద్ధం చేస్తున్నారని ఆరోపించారు. మతం, కులంపేరుతో పాలకులు పన్నుతున్న ఉచ్చులో పడకుండా ప్రజలు సంఘటితం కావాల్సిన అవసరం ఉందన్నారు. జనసాహితి జిల్లా కార్యదర్శి ప్రసన్న అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఖాదర్‌బాష, శాంతికుమార్, సత్యనారాయణ, వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భార్యను హత్య చేసిన భర్త

పామూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మాటమాట పెరిగి భార్యను రాడ్‌తో భర్త కొట్టడంతో మృతి చెందిన ఘటన ఆదివారం పామూరులో చోటుచేసుకొంది. పట్టణంలోని సీఎస్‌పురం రోడ్‌లోగల ప్రశాంతి నగర్‌లో యాసరపు రమేష్ భార్య మార్తమ్మ, ముగ్గురు పిల్లలతో జీవిస్తున్నారు. మధ్యాహ్న భోజనం అనంతరం భార్యభర్తల మధ్య గొడవ తలెత్తింది. కోపోద్రిక్తుడైన రమేష్ సమీపంలో ఉన్న రాడ్‌తో మార్తమ్మ తల వెనుక భాగంలో కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం అందుకొన్న కనిగిరి డీఎస్పీ సాయిఈశ్వర్ యశ్వంత్, ఇన్‌చార్జ్ సీఐ షేక్ ఖాజావలి, ఎస్‌ఐ కిశోర్‌బాబులు మార్తమ్మ మృతదేహాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కనిగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రఘునందనుడికి గజ వాహన సేవ

నాగులుప్పలపాడు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధిగాంచిన చదలవాడ శ్రీరఘునాయకస్వామి వారి 240వ వార్షిక కల్యాణ ఉత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. ఆలయ ఈవో అనిల్ పర్యవేక్షణలో ఆదివారం ఉదయం స్వామి వార్లకు విశేష అలంకరణ, ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. అనంతరం సూర్యచంద్ర ప్రభోత్సవం నిర్వహించారు. రాత్రికి స్వామివారిని విశేషాలంకరణలో గజవాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. మద్దిరాలపాడు గ్రామానికి చెందిన పెనుబోతు రంగారావు, మల్లిఖార్జునరావు, భానుప్రసాద్, ప్రసాద్‌బాబు, నిర్మల్‌కుమార్, శంకరరావు, శ్రీనివాసరావు, శ్రీధర్‌బాబు, నాగేశ్వరరావు, వాసుబాబు, హైమావతి ఉభయదాతలుగా వ్యవహరించారు. గవండ్లపాలెం జాలయ్యమాస్టార్ బృందం కోలాట ప్రదర్శన, వెలిగండ్ల ముక్కు వెంకటరెడ్డి మాస్టార్ బృందం బృందావన కులుకు చెక్కభజన, నెల్లూరు వేంకటేశ్వర నాట్యమండలిచే సత్యహరిచ్చంద్ర నాటకం ప్రదర్శించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్న ప్రసాద వితరణ జరిగింది. కాగా సోమవారం శ్రీరఘునాయక స్వామి వార్ల కల్యాణోత్సవం, రథోత్సవం వైభవంగా నిర్వహించేందుకు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు.

కాపునాడు కార్యవర్గం ఏకగ్రీవం


నూతన కమిటీ సభ్యులు

ఒంగోలు(కలెక్టరేట్), ఏప్రిల్13(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ప్రకాశం జిల్లా కాపునాడు కార్యవర్గం ఎన్నిక ఆదివారం ఒంగోలులోని ఓ హోటల్‌లో జరిగింది. ఈ సందర్భంగా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ జిల్లా అధ్యక్షుడిగా పోగుల మల్లికార్జునరావు, ఉపాధ్యక్షుడుగా చెంగలశెట్టి సుధాకర్, ప్రధానకార్యదర్శిగా దాసరి పిచ్చియ్య, సంయుక్త కార్యదర్శిగా గారా నారాయణ, జిల్లా యువజన అధ్యక్షుడిగా బండారు సురుష్‌బాబు, గౌరవాధ్యక్షుడిగా కొప్పోలు శ్రీనివాసరావు, గౌరవ సలహాదారుడుగా కొల్లా హనుమంతరావు, జిల్లా కార్యవర్గసభ్యులుగా ఆకుల చలం, ఒంగోలు నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలుగా నల్లమోతు నిర్మలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కాపునాడు జాతీయ అధ్యక్షుడు గాళ్ల సుబ్రహ్మణ్యం, నాయకులు అయినాబత్తిన ఘనశ్యామ్, గొరైపాటి శ్రీనివాసరావు, చాకిరి ధనుంజయ్, ఈదుపల్లి గురనాథం, ఆరిగ ప్రతాప్, తోట నవీన్ సాయి, జిల్లిపల్లి పూర్ణచంద్రరావు, తోట శ్రీధర్, కుర్రా ప్రసాద్, పోతంశెట్టి దుర్గ, కొల్లా నారాయణ, కేవీఆర్, మలగా రమేష్ తదితరులు పాల్గొన్నారు

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు

ఒంగోలు(విద్య), ఏప్రిల్13(ఆంధ్రజ్యోతి) : ఒంగోలు ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక పాలిటెక్నిక్‌లో డిప్లమో పూర్తి చేసి వివిధ ఉద్యోగాలలో స్థిరపడిన సుమారు 500 మంది పూర్వవిద్యార్థులు సమ్మేళనానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా తమ మధుర స్మృతులను నెమరవేసుకున్నారు. ముఖ్య అతిథులుగా సాంకేతిక విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ శ్రీపద్మారావు, డిప్యూటీ డైరెక్టర్‌లు కె.విజయభాస్కర్, కె.నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ శివప్రసాద్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కళాశాల అభివృద్ధికి, మౌలిక వసతుల కల్పనకు ఆర్థిక సహాయం అందించేందుకు ముందుకు వచ్చారు. 1984-97 బ్యాచ్‌కు చెందిన అక్బర్‌బాబు రూ.2లక్షలు, 1989-93 బ్యాచ్‌కు చెందిన శంభారావు, ఆర్.వెంకటగిరిప్రసాద్ రూ.25వేల చొప్పున విరాళంప్రకటించారు. తమ గురువులును సన్మానించారు.

గుంటిగంగ తిరునాళ్లలో ట్రాఫిక్‌కు ఇబ్బందిలేకుండా చర్యలు

● దర్శి డీఎస్పీ లక్ష్మీనారాయణ


ప్రభల నిర్వాహకులతో మాట్లాడుతున్న డీఎస్పీ లక్ష్మీనారాయణ

తాళ్లూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన గుంటిగంగ అమ్మవారిని భక్తులు సుహృద్భావ వాతావరణంలో తిలకించేలా ప్రభల నిర్వాహకులు, ప్రజలు సహకరించాలని దర్శి డీఎస్పీ లక్ష్మీనారాయణ తెలిపారు. ఆదివారం సాయంత్రం ప్రభల నిర్వాహకులు, దేవదాయశాఖ, గ్రామపంచాయతీ అధికారులతో గుంటిగంగ సన్నిధిలో తిరునాళ్ల ఏర్పాట్ల గురించి మాట్లాడారు. తిరునాళ్లలో ట్రాఫిక్‌కు అవరోధం తలెత్తకుండా పోలీస్ శాఖ విధించిన నిబంధనలు పాటించాలన్నారు. వాహనదారులు తిరునాళ్ల ప్రాంగణంలోకి వాహనాలను తీసుకరావద్దని సూచించారు. పాటకచేరి నిర్వహించేవారు సంప్రదాయబద్ధమైన దుస్తులు వేసుకుని పాటలు పాడాలే తప్ప, ఎలాంటి డ్యాన్స్‌లు చేయటం నిషిద్ధమన్నారు. ప్రభలపై ఏర్పాటుచేసే స్టేజీలు కట్టుదిట్టంగా చేయాలన్నారు. స్టేజీ ముందు పది మీటర్ల దూరంలో వలయం ఏర్పాటు చేయాలన్నారు. ప్రభల నిర్వాహకులు కూడా పోలీస్‌శాఖకు సహకరించి ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ప్రశాంత వాతావరణంలో తిరునాళ్ల ముగిసేలా చూడాలన్నారు. పోలీస్‌శాఖ ఇచ్చిన సమయంలోపు కార్యక్రమాలు ముగించాలన్నారు. అనంతరం భక్తులకు దేవదాయ, పంచాయతీ అధికారులు చేపట్టిన ఏర్పాట్లను డీఎస్పీ పరిశీలించారు. కార్యక్రమంలో దేవస్థాన కమిటీ చైర్మన్ కొసనా గురుబ్రహ్మ, సీఐ వై.రామారావు, తాళ్లూరు, దర్శి, ముండ్లమూరు ఎస్‌లు ఎస్.మల్లికార్జునరావు, మురళి, కమలాకర్, టీవీ సుబ్బారెడ్డి, పోశం మధుసూదన్‌రెడ్డి, పులి ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మెగా వైద్యశిబిరం

స్వర్గీయ సోమా పుల్లయ్య జ్ఞాపకార్థం శ్రీ రామ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో సోమవారం జరిగే తిరునాళ్లలో మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు పుల్లయ్య కుమారులు తెలిపారు. సద్వినియోగం చేసుకోవాలన్నారు.

గుంటిగంగ భవానీ అమ్మవారికి అభిషేకాలు

తాళ్లూరు, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రసిద్ధిచెందిన గుంటి గంగ భవానీ అమ్మవారికి ఆర్యవైశ్య మహిళలు ఆదివారం ప్రత్యేకంగా అభిషేకం నిర్వహించారు. పూర్వం నుంచి ఆర్యవైశ్యులు అమ్మవారి తిరునాళ్ల సందర్భంగా అభిషేకాలు నిర్వహించటం ఆచారంగా వస్తుంది. ఈతరుణంలో కొంత కాలం ఆచారాన్ని మరచిన ఆర్యవైశ్యులు పెద్దల సూచనల మేరకు వంద సంవత్సరాల తిరునాళ్ల సందర్భంగా 151 మంది మహిళలు కలశ బిందెలతో తూర్పు గంగవరం నుంచి ప్రత్యేక బస్సులలో వచ్చి అమ్మవారికి అభిషేకం చేశారు.


కలశాలతో వస్తున్న ఆర్యవైశ్య మహిళా భక్తులు


ఆలయం

మహిమాన్వితం.. రఘునాయక క్షేత్రం


సిద్ధమైన రథం

నేడు స్వామి వారి 240వ కల్యాణం | ఎన్నో విశిష్టతలు చదలవాడ ఆలయం సొంతం


రఘునాయక స్వామి వారి మూలవిరాట్

● చదలవాడకు ఆ పేరుపై రెండు కథనాలు

చదలవాడకు చతుర్వాటిక అని మరో పేరు ఉన్నట్లు స్థలపురాణం చెబుతోంది. త్రేతాయుగంలో శ్రీరాముడు సీతను అన్వేషిస్తూ వానర సైన్యంతో చదలవాడ ప్రాంతానికి చేరుకున్నారు. ఇక్కడ్నుంచే వానర సైన్యాన్ని నాలుగు భాగాలుగా విభజించి నాలుగు దిక్కులకు పంపారు. అందువల్ల ఈ ప్రాంతానికి చతుర్వాటిక అనే పేరు కల్గింది.

చదలవాడకు ఆ పేరు రావడం వెనుక మరో కథనం కూడా ప్రచారంలో ఉంది. ఇక్కడ రఘునాయక స్వామి ఆలయంతోపాటు లింగోద్భవస్వామి ఆలయం కూడా ఉంది. పూర్వం పరమేశ్వరుడు శివలింగ రూపంలో భక్తులకు ఒక చెదలపుట్టలో దర్శనమిచ్చాడు. భక్తులు ఆ శివలింగాన్ని తీసుకొచ్చి ఆలయం నిర్మించారు. ఆలయంలోని శివలింగంపై శివుని ముఖాకృతితోపాటు, లింగోద్భవ ఘట్టాన్ని చాటిచెప్పేవిధంగా, వరాహ బొమ్మలను కూడా అద్భుతంగా చెక్కారు. పరమశివుడు లింగోద్భవస్వామిగా ఇక్కడ పూజలందుకుంటున్నారు. చెదలపుట్టలో శివలింగం లభించినందున చెదలవాడ అనే పేరు వచ్చింది. కాల క్రమంలో చదలవాడగా మారింది.


ముస్తాబైన కళ్యాణ మండపం

చదలవాడ రఘునాయకస్వామి ఆలయ విశిష్టతలు

- పురాతన ప్రసిద్ధ వైష్ణవ క్షేత్రం.. 1450 ఏళ్ల చరిత్ర సొంతం
- శ్రీరాముడు సీతాదేవి విగ్రహాలు పంచరాత్ర ఆగమశాస్త్రం ప్రకారం అగస్త్య మహాముని స్థాపించినట్లు శాసనాల ద్వారా తెలుస్తోంది.
- సీతాదేవి శ్రీరామునికి కుడివైపు ఉండటం మరో విశేషం.
- గుండ్లకమ్మ నది ఈ ఆలయానికి దక్షిణంగా ప్రవహిస్తోంది.
- సీతాదేవి జాడ కోసం వెళ్లిన హనుమంతుని రాక కోసం నిరీక్షిస్తున్నట్లు స్వామి దక్షిణాభిముఖంగా దర్శనమిస్తారు.
- ఏడాదికొక్కసారి జరిగే స్వామి కల్యాణోత్సవానికి ఠంచన్‌గా ఓ గరుడ పక్షి ముఖ్యఅతిథిగా హాజరవడం మరో ప్రత్యేకత.
- సోమవారం జరగనున్నది స్వామి వారికి 240వ కల్యాణం
- ఉత్సవాల సమయంలో భద్రాచలంలోని శ్రీరాముడు, చదలవాడ రఘునాయక స్వామిలోకి ప్రవేశిస్తాడని భక్తుల విశ్వాసం.
- రథోత్సవంనాడు స్వామి రథాన్ని లాగితే పునీతులవుతారని వేలాది మంది పోటీపడి మరీ లాగుతారు.
- ప్రముఖ గాయకుడు బొమ్మరాజు సీతారామదాసు 1942లో స్వామి కల్యాణోత్సవంలో కీర్తనలు ఆలపిస్తూ తనువు చాలించాడు. అప్పటి నుంచి ఆయన వంశీయులు ఈ ఉత్సవాల్లో తరంగ గానం చేయటం ఆనవాయితీగా మారింది.

-నాగులుప్పలపాడు, ఆంధ్రజ్యోతి

మహాకవి ఎర్రనతో అనుబంధం

చదలవాడ అనగానే మహాకవి ఎర్రన పేరు వెంటనే గుర్తుకు వస్తుంది. రెడ్డిరాజుల ఆస్థాన కవిగా వ్యవహరించిన ఎర్రన చదలవాడలో కొంత కాలం నివసించి స్వామిని సేవించారు. అక్కడి మహాభారతంలోని అరణ్యపర్వ శేషాన్ని పూర్తిచేసినట్లు పలువురు విశ్వసిస్తున్నారు.

● రాజుల పోషణలో తేజరిల్లిన ఆలయం

చదలవాడ ప్రాంతాన్ని ఏలిన పలువురు రాజులు ఈ ఆలయ అభివృద్ధికి విశేష కృషి చేశారు. అద్దంకిని పాలించిన రెడ్డి రాజులతో పాటు విజయనగర చక్రవర్తులు ఆలయ అభివృద్ధికి చర్యలు తీసుకున్నారు. ఇక్కడి శాసనాల ద్వారా ఈ విషయం తెలుస్తుంది.

● గరుడ పక్షి ప్రదక్షిణలు చేస్తేనే స్వామికి తలంబ్రాలు

స్వామి కల్యాణం అనంతరం తలంబ్రాలు పోసే సమయంలో ఎక్కడి నుంచో ఓ గరుడ పక్షి వచ్చి మూడుసార్లు ఆలయంపై ప్రదక్షిణలు చేసి వెళ్తుంటుంది. దానిని గరుత్మంతుని అంశంగా భక్తులు విశ్వసిస్తారు. గరుడ పక్షి వచ్చిన తర్వాతనే స్వామికి తలంబ్రాలు పోస్తారు. ఈ సుందరఘట్టాలను వీక్షించేందుకు వేల సంఖ్యలో భక్తులు వస్తారు.

నేడు స్వామి కల్యాణం

రఘునాయక స్వామికి ఏటా చైత్ర శుద్ధదశమి మొదలు కొని చైత్ర బహుళ పంచమి వరకు అగమానుసారం బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహిస్తారు. ఈ నెల 7న ప్రారంభమైన ఉత్సవాలు 16వ తేదీతో ముగుస్తాయి. సోమవారం స్వామికి కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. ఉభయదాతలుగా మద్దిరాలపాడుకు చెందిన పెనుబోతు వంశీయులు శతాబ్దకాలంగా కొనసాగుతున్నారు. అదేరోజు సాయంత్రం చదలవాడ తిరునాళ్ల, రఘునాయక స్వామి రథోత్సవం జరుగుతాయి. మద్దిరాలపాడుకు చెందిన తూమాటి రాంబొట్లు చౌదరి కుటుంబీకులు ఉభయదాతలుగా వ్యవహరించి రథోత్సవం నిర్వహిస్తారు. కల్యాణ మహోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి దొంత అనీల్ చెప్పారు.

● ఐదంతస్తుల రాజగోపుర నిర్మాణ పనులు

చదలవాడ గ్రామానికి చెందిన దాతలు, ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు చదలవాడ వెంకటకృష్ణయ్య, బుర్రం సుబ్బన్నలు సమకూర్చిన రూ.19.40 లక్షలతో పాటు సీజీఎఫ్ నిధులు రూ.77.60 లక్షలతో దేవాలయంలో ఐదంతస్తుల ఆలయ రాజగోపుర నిర్మాణ పనులు చకచకా సాగుతున్నాయి. దీంతోపాటుపలు అభివృద్ధి పనులు చేపట్టారు.

కనులపండువగా చెన్నయ్య కల్యాణం


స్వామి పూలమాలలతో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రాంబాబు

అంగరంగ వైభవంగా రంగనాయకస్వామి కల్యాణం

గరుడ, గజ వాహనాల్లో స్వామి వారు

రాచర్ల (గిద్దలూరు), ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): రాచర్ల మండలం జెల్లివారి పుల్లలచెరువు సమీప నల్లమల అడవిలో వెలసిన శ్రీనెమలి గుండ్ల రంగనాయకస్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా సాగుతున్నాయి. రెండో రోజైన ఆదివారం శ్రీరంగనాయక స్వామి కల్యాణ మహోత్సవాన్ని కన్నులపండువగా నిర్వహించారు. వేలసంఖ్యలో భక్తులు కల్యాణాన్ని తిలకించారు. ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు దంపతులు ఈ మహోత్సవంలో పూజలు చేశారు. వేల సంఖ్యలో వచ్చిన భక్తులకు మజ్జిగ ప్యాకెట్లను అందచేశారు. అలాగే స్వామి వారు విష్ణుమూర్తి అలంకారంలో గజవాహనం, గరుడ వాహనంలో ఆదివారం రాత్రి భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కోలాట ప్రదర్శన ఆకట్టుకొంది. పాడుతా తీయగా మహాసంగ్రామం విజేతలతో ఏర్పాటు చేసిన పాటకచేరి భక్తులను రంజిపజేసింది. వెంకటేశ్వర నాట్యమండలి వారితో చింతామణి పూర్తి నాటకం ప్రదర్శించారు. ఆదివారం సైతం బస్టాండ్ నుంచి దేవస్థానం వరకు భక్తులందరికీ ఉచిత ఆటో సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు. సీఐలు సురేష్, రామకోటయ్య, ఎస్సై కోటేశ్వరరావు, 150 మందికి పైగా పోలీసు, ఎన్‌సీసీ సిబ్బందితో బందోబస్తు ఏర్పాట్లు చేశారు. ఆయా పూజా కార్యక్రమాలలో దేవస్థాన పరిశీలకులు నాగమల్లేశ్వరరాజు, కార్యనిర్వహణాధికారి ఎం.నాగయ్య, స్వామి వారి కల్యాణం సందర్భంగా హయగ్రీవచార్యులు, మురళీకృష్ణ వ్యాఖ్యతలుగా వ్యవహరించారు. అర్చకులు పాండురంగాచార్యులు, సత్యనారాయణచార్యులు, రామానుజచార్యులు పూజలు నిర్వహించారు. ఆయా కులసంఘాల సత్రాలలో పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.


రంగనాయకస్వామి కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు


కల్యాణంలో శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవుడు


స్వామికి పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి

భక్తజనసందోహంతో పులకించిన మార్కాపురం

మార్కాపురం వన్‌టౌన్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మార్కాపురంలోని శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆదివారం కల్యాణ వేడుక కనులపండువగా నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై చెన్నుడు శ్రీదేవి భూదేవి సమేతుడై సర్వాలంకరణ భూషితుడై వేంచేశారు. వేద పండితుల మంత్రోచ్చరణలు, మంగళ వాయిద్యాలు నడుమ దాదాపు 2 గంటల పాటు ప్రధాన అర్చకులు శ్రీపతి అప్పనాచార్యుల ఆధ్వర్యంలో కళ్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, ఈవో గొలమారి శ్రీనివాసులరెడ్డి, వేములకోటకు చెందిన ఆమంచి వెంకటరమణ, ఉత్సవ కమిటీ చైర్మన్ యక్కలి కాశీవిశ్వనాథం, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు తదితరులు పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆలయ ప్రాంగణం గోవింద నామస్మరణలతో మార్మోగింది. పలువురు ఉభయదాతలు కల్యాణ సమయంలో పట్టువస్త్రాలు సమర్పించారు. ముత్యాల తలంబ్రాలను నాదెళ్ల సుబ్రహ్మణ్యం, అచ్యుత పెదవెంకటేశ్వర్లు, మేడా వెంకటసుబ్బారావు, గ్రంథే సురేష్ కుటుంబ సభ్యులు సమర్పించారు. నంద్యాలకు చెందిన సంస్కృత పండితులు దివి హయగ్రీవాచారి కల్యాణ ఘట్టాల గురించి చేసిన వ్యాఖ్యానం ఆద్యంతం ఆకట్టుకుంది. యాగ్నికులు సోమయాజుల మల్లికార్జున శర్మ, పలువురు వేద పండితులు పాల్గొన్నారు. బచ్చు సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో కల్యాణం అనంతరం ప్రసాదం పంపిణీ చేశారు.


మంగళ సూత్రాలు చూపుతున్న అర్చకులు

ఘనంగా వైకుంఠ రామాలయ ప్రతిష్ఠ మహోత్సవం

తాళ్లూరు, ఏప్రిల్13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విఠలాపురం కొత్తూరులో నూతనంగా నిర్మించిన వైకుంఠ రామాలయ పాంచాహ్నిక ప్రతిష్ఠ మహోత్సం కార్యక్రమాలు ఆదివారం వైభవంగా జరిగాయి. విరాళాలతో సమకూర్చిన స్థలంలో దాతల సహకారంతో దాదాపు రూ.2కోట్ల నిధులు సమకూర్చి రామాలయం నిర్మించారు. ఆలయ ప్రాంగణంలో సీతా,లక్షణ, హనుమత్ సమేత శ్రీరామచంద్రమూర్తి, నాభిశిల, ధ్వజస్తంభ, శిఖర ప్రతిష్ఠ కార్యక్రమాలు జరిగాయి. ఉదయం 8.34నిమిషాలకు ఏక కాలంలో 16 విగ్రహాలకు యంత్ర స్థాపన, ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. అనంతరం మహాపూర్ణాహుతి, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళలు అధిక సంఖ్యలో తరలిరావటంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. భక్తులకు అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో నర్సరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, దామచర్ల సత్య, జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే శివప్రసాద్‌రెడ్డి, చెవిరెడ్డి భాస్కరరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ మారం వెంకటరెడ్డి, ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, జడ్పీటీసీ మారం వెంకటరెడ్డి, వ్యాపారవేత్త మారం అంజిరెడ్డి, ఇంద్రసేనారెడ్డి, పోశం మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.


పూజలు చేస్తున్న ఎంపీ కృష్ణదేవరాయలు

శరవేగంగా భద్రకాళీ సమేత వీరభద్రుని ఆలయ నిర్మాణం

పంగులూరులో కోటి రూపాయలతో పనులు

పంగులూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): పంగులూరులో చిలుకూరి వారి వంశ దేవర భద్రకాళీ సమేత వీరభద్రుని నూతన ఆలయం శరవేగంగా నిర్మితమవుతోంది. చిలుకూరి వంశస్తులు తమ ఇంటి ఇలవేల్పుగా ఆరాధించే భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి కొలువు దీర్చేందుకు కోటి రూపాయల వ్యయ అంచనాతో నూతన ఆలయ నిర్మాణం చేపట్టారు. పంగులూరు గ్రామానికి తూర్పు వైపున పూర్వ బ్రహ్మంగారి మఠం సమీపంలో 16 సెంట్ల విస్తీర్ణంలో నూతన ఆలయంతో పాటు భోజనశాల, విశ్రాంతి గదులు నిర్మితమవుతున్నాయి. ఈ ఆలయ నిర్మాణానికి గ్రామానికి చెందిన ఎన్‌ఆర్‌ఐ కొణకంచి రాము 11 సెంట్లు, చిలుకూరి పెదబాబు ఐదు సెంట్ల స్థలాన్ని ఉచితంగా సమకూర్చారు. పంగులూరు పరిసర గ్రామాలు ఇతర ప్రాంతాలకు చెందిన చిలుకూరి వంశస్తులు ఈ నిర్మాణ కార్యక్రమంలో భాగస్వాములై నిధులు సమకూర్చుతున్నారు. అన్ని హంగులతో సుందరంగా ఆలయాన్ని పూర్తి చేసి తమ వంశ దేవర, ఇంటి ఇలవేల్పైన భద్రకాళీ సమేత వీరభద్రుని కొలువుదీర్చి శాస్త్రోక్తంగా కొలిచే పనిలో నిమగ్నమై నిర్మాణ పనులు కొనసాగిస్తున్నారు.


నిర్మితమవుతున్న చిలుకూరి వారి వంశ దేవరతల్లి భద్రకాళీ సమేత వీరభద్రుని ఆలయం

అవి.. ఇవి

కారు బోల్తా.. నలుగురికి తీవ్రగాయాలు


బోల్తాపడిన కారు

కంభం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): వేగంగా వెళుతున్న కారు అదుపుతప్పి బోల్తాపడిన ఘటనలో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన ఆదివారం కంభం సీఎల్ఆర్ కళాశాల సమీపంలో చోటుచేసుకొంది. ఏఎస్సై సుధాకర్‌రావు కథనం ప్రకారం కర్నాటక రాష్ట్రం చికమల్లాపూర్‌కు చెందిన పవన్ తన కుటుంబంతో కలిసి 10న కర్నాటక నుంచి బయలుదేరి శ్రీశైలం వెళ్లి దర్శనం అనంతరం ఆదివారం ఉదయం శ్రీశైలం నుంచి తిరిగి స్వగ్రామానికి వెళుతుండగా కారు అదుపుతప్పి పొలంలో బోల్తాపడింది. ఈ ఘటనలో కారు నడుపుతున్న పవన్‌కు, మరో ముగ్గురికి తీవ్రంగా గాయాలయ్యాయి. దీంతో తల్లి లక్ష్మి పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో కంభంలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో ప్రాథమిక చికిత్స అనంతరం ఒంగోలుకు తరలించినట్లు తెలిపారు.

జనసేన నాయకుడికి కాశీనాథ్ పరామర్శ

కంభం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ఇటీవల దాడికి గురై ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న జనసేన సంయుక్త కార్యదర్శి కాల్వ బాలరంగయ్యను మార్కాపురం నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి ఇమ్మడి కాశీనాథ్ ఆదివారం పరామర్శించారు. కార్యక్రమంలో గిద్దలూరు, మార్కాపురం నియోజకవర్గ జనసేన నాయకులు పాల్గొన్నారు.

దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి : బాలరంగయ్య

అర్థవీడు : అర్థవీడు మండలంలో జనసేనపార్టీ అభివృద్ధి కోసం పని చేస్తున్న తనపై దాడి చేసి గాయపరచిన వైసీపీ నాయకుడు కాసుల పాండు, ఆయన వర్గంపై ప్రభుత్వం, పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని కాల్వ బాలరంగయ్య ఒక ప్రకటనలో కోరారు. తాను జనసేన ఆవిర్భావం నుంచి జిల్లాస్థాయిలో పార్టీ అభివృద్ధికి కృషి చేశానన్నారు. గత ఎన్నికల్లో వైసీపీకి లోపాయికారిగా మద్దతు తెలిపి ఇప్పుడు జనసేన నాయకులమని చెప్పుకుని తిరుగుతున్న వారిని ప్రశ్నించి నందుకు దాడి చేశారన్నారు. కావున కాసుల పాండు, ఆయనకు సహకరించిన వారిపై చర్యలు తీసుకోవాలని బాలరంగయ్య కోరారు.

గురుకుల పాఠశాలలోని ప్రవేశానికి పరీక్ష


పరీక్ష రాస్తున్న 5వ తరగతి విద్యార్థులు

కంభం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలో 5వ తరగతి ప్రవేశ పరీక్షను ఆదివారం పకడ్బందీగా నిర్వహించారు. ఎంఈవో మాల్యాద్రి పరీక్షల నిర్వహణను పరిశీలించారు. ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఉచితంగా విద్య, వసతి, క్రీడాసౌకర్యాలు అందిస్తారు. కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ చాముండేశ్వరి పాల్గొన్నారు.

ప్రజలతో ఆర్ఎంపీలు మమేకమవ్వాలి



మాట్లాడుతున్న ఇమామ్‌సా

పొదిలి, ఏప్రిల్ (ఆంధ్రజ్యోతి) : ప్రజలపట్ల ఆర్ఎంపీలు మమేకమవ్వాలని జిల్లా ఆర్ఎంపీల సంఘం ఉపాధ్యక్షుడు ఇమామ్‌సా అన్నారు. ఆదివారం స్థానిక ఆస్టర్ రమేష్ ఆస్పత్రిలో పొదిలి, కొనకనమిట్ల, మర్రిపూడి మండలాల ఆర్ఎంపీ వైద్యులకు జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆర్ఎంపీల వద్దకు వచ్చే ప్రజలు, రోగులకు వ్యాధి తీవ్రతను బట్టి వైద్యం చేయాలన్నారు. ఆర్ఎంపీలు పరిధి మించిన వైద్యం చేసి సమస్యను కొనితెచ్చుకోవద్దన్నారు. రోగుల పరిస్థితిని పరిశీలించి గుర్తింపు ఉన్న వైద్యశాలకు తరలించేలా సూచించాలన్నారు. అనారోగ్యంతో వచ్చిన వారిని ఇబ్బందిపెట్టకుండా వైద్యం చేయాలని కోరారు. కార్యక్రమంలో పొదిలి, కొనకనమిట్ల, మర్రిపూడి మండలాల ఆర్ఎంపీలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి

పెద్దారవీడు, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతిచెందిన ఘటన ఆదివారం సాయంత్రం మండలంలో పుచ్చకాయలపల్లి వద్ద చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం పెద్దారవీడుకు చెందిన అల్లు మహేశ్వర్‌రెడ్డి(15) పుచ్చకాయలపల్లిలో ఉన్న తన మేనత్త పోతిరెడ్డి నారాయణమ్మను ఉరుసు ఉత్సవానికి తీసుకువచ్చేందుకు ద్విచక్రవాహనంపై తన బంధువు అల్లు ఈశ్వర్‌రెడ్డితో కలిసి వెళ్లాడు. ఆమెతో కలిసి ముగ్గురు ఒకే ద్విచక్ర వాహనంపై పెద్దారవీడు వస్తున్నారు. పెద్దారవీడు నుంచి తమ ఊరు వెళుతున్న సుంకేసుల గ్రామానికి చెందిన వ్యక్తి దిచక్ర వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో అల్లు మహేశ్వర్‌రెడ్డికి తీవ్రగాయాలయ్యాయి. మహేశ్వర్‌రెడ్డికి మార్కాపురం వైద్యశాలలో ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒంగోలు తీసుకెళుతుండగా పొదిలి సమీపంలో మృతి చెందాడు. మృతుడు మహేశ్వర్‌రెడ్డి ఇటీవల పదవ తరగతి పరీక్షలు రాశాడు. అల్లు ఈశ్వర్‌రెడ్డి, పోతిరెడ్డి నారాయణమ్మలకు స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సాయిచైతన్య విద్యార్థి ప్రతిభ



సింధును అభినందిస్తున్న నిర్వాహకులు

మార్కాపురం వన్‌టౌన్, ఏప్రిల్ 13 ఆంధ్రజ్యోతి: మార్కాపురం పట్టణంలోని శ్రీ సాయిచైతన్య పాఠశాల విద్యార్థినికి అపుస్మా నిర్వహించిన పోటీలలో మొదటి బహుమతి లభించింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాస్, చంద్రశేఖర్‌లు మాట్లాడుతూ..పట్టణంలోని అపుస్మా ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయిలో నిర్వహించిన ఐఐటీ పోటీల్లో సీనియర్ విభాగంలో 8వ తరగతి చదువుతున్న ఎ.సింధు మొదటి ర్యాంకు సాధించిందన్నారు. గుంటూరులో ఆదివారం జరిగిన అభినందన కార్యక్రమంలో సింధుకు ప్రశంసాపత్రం, పతకం, జ్ఞాపిక అందజేశారన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ ఎం.చంద్రశేఖర్, ఉపాధ్యాయులు సాయికృష్ణ చౌదరి పాల్గొన్నారు.

విద్యార్థుల విజయభేరి

గిద్దలూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ఫలితాలలో గిద్దలూరులోని సాహితి జూనియర్ కళాశాల విద్యార్థులు విజయభేరి మోగించారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీ మొదటి సంవత్సరంలో సాయిమోహిత 465 మార్కులు, షేక్ అంజుమ్ 463 మార్కులు సాధించారు. బైపీసీలో సాయిభార్గవి 433 మార్కులు, సీనియర్ ఇంటర్ ఎంపీసీలో ఏ.హారిక 981 మార్కులు, ఆసియా 980 మార్కులు సాధించినట్లు కళాశాల నిర్వాహకులు కొండారెడ్డి, స్వరూపారెడ్డి, శ్రీనివాసరెడ్డి తెలిపారు.

పెనుగాలుల బీభత్సం


వేమలపేట గ్రామ పరిధిలో ఈదురు గాలులకు నేలకొరిగిన స్తంభం

- రోడ్డుపై అడ్డంగా పడిపోయిన చెట్టు కొమ్మలు
- నేలకొరిగిన కరెంట్ స్తంభాలు
- నిలిచిన విద్యుత్ సరఫరా

మార్కాపురం రూరల్, ఏప్రిల్13 (ఆంధ్రజ్యోతి). మండలంలోని వేమలపేట, వేములకోట చింతగుంట్ల, తిప్పాయపాలెం, గజ్జలకొండలతో పాటు మరికొన్ని గ్రామాలలో ఆదివారం సాయత్రం వీచిన పెనుగాలులకు 20 స్తంభాలు నెలకొరిగాయి. అంతే కాకుండా మండలంలోని వేములకోట వద్ద మార్కాపురం- కంభం రహదారిలో చెట్టు కొమ్మ విరిగి రోడ్డుపై అడ్డంగా పడింది. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. విద్యుత్ స్తంభాలు పడిపోవ డంతో ఆయా గ్రామాలలో కొంత సమయం పాటు విద్యుత్ సరఫరా నిలిచి పోయింది. ఆయా గ్రామాలలో రైతులకు పంటపొలాలకు విద్యుత్ సరఫరా నిలిచి పోయింది. గజ్జలకొండ గ్రామ పరిధి లో రైతులు ఏర్పాటు చేసుకున్న పొగాకు పాకలు గాలికి లేచి పోయాయి. బొప్పాయి పంట నేలకు వాలి పోయింది.



వేములకోట వద్ద రోడ్డుపై పడిన చెట్టుకొమ్మ, ఉన్నగురవాయపాలెం వద్ద కారుపై పడిన భారీ వృక్షం

త్రుటిలో తప్పిన ప్రమాదం

పొదిలి : మండలంలో ఆదివారం బలమైన గాలులతో పాటు తేలికపాటి వర్షం కురిసింది. దీంతో దర్శి పొదిలి ప్రధాన రహదారి వెంబడి ఉన్న చెట్లు ఉన్నగురవాయపాలెం గ్రామం వద్ద చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. విద్యుత్‌స్తంభం విరిగి చెట్టుకింద నిలిపి ఉంచిన ట్రాక్టర్‌పై పడింది. గ్రామంలో రోడ్డు కూడలిలో ఉన్న వేపచెట్టు బలమైన గాలులకు కూకటివేళ్ళతోసహా విరిగిపడినట్లు గ్రామస్థులు చెబుతున్నారు. అంతే కాకుండా దర్శివైపు వెళుతున్న కారుపై చెట్టు విరిగిపడింది. అయితే కారులో డ్రైవర్ ఒక్కడే ఉండడం కారుకు వెనుకవైపు చెట్టు పడటంతో పెద్దప్రమాదమే తప్పిందని స్థానికులు చెబుతున్నారు. ఇంతటి బలమైన గాలులు ఎప్పుడు చూడలేదని గ్రామస్థులు పేర్కొంటున్నారు. కుంచేపల్లి, ఉన్నగురువాయపాలెం గ్రామాల్లో ఇళ్లముందు ఉన్న చెట్లు కూడా పడిపోయాయాని తెలిపారు. మబ్బుపట్టి వర్షం వస్తుందంటే వర్షం కంటే ముందు గాలులకు భయపడాల్సిన పరిస్థితి ఉందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రతిభ చూపిన విద్యార్థులకు ఎమ్మెల్యే అభినందన


ఆశిఫాను అభినందిస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఫలితాలలో రాష్ట్రస్థాయిలో గిద్దలూరు నియోజకవర్గ విద్యార్థులు ప్రతిభ కనపరచడంపై ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ఒక ప్రకటనలో అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. గిద్దలూరు పట్టణానికి చెందిన యశ్వంత్ నాయక్ అనే విద్యార్థి విజయవాడలోని ఓ కళాశాలలో విద్యను అభ్యసిస్తూ 467/470 మార్కులు అశ్రీష 466/470 మార్కులు, బి.సాయిమోహిత 465/470 మార్కులతో ఈ ప్రాంతానికి గుర్తింపు తేవడం అభినందనీయమన్నారు. వీరు రాష్ట్రస్థాయిలో ఉత్తమ మార్కులు సాధించడంతో ఈ ప్రాంతంలోని విద్యార్థుల్లో విద్యాప్రమాణాలు ఎంత ఉన్నతం గా ఉన్నాయనే విషయం స్పష్టమౌతోంద న్నారు. విద్యార్థుల కృషి, తల్లిదండ్రుల ప్రోత్సాహం, ఉపాధ్యాయుల మార్గదర్శకతతో వారు రాణించారన్నారు. దీంతోపాటు నియోజకవర్గానికి చెందిన విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో నిర్వహించే వివిధ పోటీ పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధిస్తూ నియోజకవర్గానికి మంచి పేరు తేవాలని కోరారు. అలాగే కంభం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని తమ్మినేని చాతుర్య ఇంటర్ హెచ్ఈసీ గ్రూపులో 980/1000 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరచడం అభినందనీయమన్నారు.

చంద్రప్రభ వాహనంపై చెన్నకేశవుడు



వెంకటాద్రిపాలెంలో స్వామివారి అలంకరణ, చంద్రప్రభ వాహనంపై చెన్నకేశవుడు

మార్కాపురం వన్‌టౌన్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మోత్సవాలలో భాగంగా మార్కాపురంలోని చెన్నకేశవస్వామి ఆదివారం రాత్రి నగరోత్సవంలో విహరించారు. శ్రీమన్నారాయణమూర్తి అలంకారణలో చంద్ర ప్రభ వాహనంపై చెన్నయ్యకు నాలుగు మాడవీధులలో నగరోత్సవం చేశారు. ఈవో గొలమారి శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు పర్యవేక్షించారు.

నేడు సింహవాహనంపై

బ్రహ్మోత్సవాలలో భాగంగా చెన్నకేశవ స్వామికి సోమవారం సింహవాహనంపై నగరోత్సవం నిర్వహించనున్నారు.

సింహవాహనంపై చెన్నకేశవుడు

ఎర్రగొండపాలెం రూరల్ : మండలంలోని వెంకటాద్రిపాలెంలో వేంచేసిన శ్రీ లక్ష్మీచెన్న కేశవ స్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. రెండవరోజు ఆదివారం స్వామివారికి ఆలయ అర్చకులు కారంపూడి వెంకటాచార్యులు ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వామివారు సింహ వాహనంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. ఉభయదాతలు దుగెంపూడి పెద్ద కోటిలింగారెడ్డి, శ్రీనివాసరెడ్డి, బ్రహ్మానందరెడ్డి, చిన్న బ్రహ్మానందరెడ్డి, రమణారెడ్డి, రంగారెడ్డి, వెంకటరెడ్డి, స్వామి కోటిరెడ్డి, గాలి నారాయణరెడ్డి, డి లక్ష్మీరెడ్డిలు కుటుంబ సభ్యులతో కలసి భక్తులకు తీర్ధ ప్రసాదాలు అందజేశారు.

నేడు విగ్రహ ప్రతిష్ఠ

గిద్దలూరు : మండలంలోని సంజీవరాయునిపేట గ్రామంలో మరకతలింగ కాశీ విశ్వేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం విగ్రహప్రతిష్ఠ మహోత్సవం వైభవంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆదివారం గ్రామోత్సవంతో పాటు విశేష పూజలు చేశారు. గణపతి, నవగ్రహ, చండీ హోమా లను, స్వామి వారికి ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. కుంకుమార్చనలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. సామూహికంగా విష్ణు సహస్రనామ పారాయణం నిర్వహించారు. ధర్మకర్త సూరె చిన్నపీరయ్య, గ్రామపెద్దలు అయా పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ వెంకట రంగయ్య విగ్రహం ఆవిష్కరణ


వెంకట రంగయ్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

తర్లుపాడు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సూరెపల్లె గ్రామానికి చెందిన మాజీసర్పంచ్ గ్రంధే వెంకటరంగయ్య కాంస్య విగ్రహాన్ని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నారాయణ రెడ్డి మాట్లాడుతూ, సూరెపల్లె గ్రామం మొదటి సర్పంచ్‌గా 35 సంవత్సరాలు సేవలు అందించిన వెంకటరంగయ్య ప్రజల మన్ననలు పొందారన్నారు. గ్రామం అభివృద్ధికి అన్ని విధాలా సహకరిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జ్ ఇమ్మడి కాశీనాథ్, గ్రంధే రంగమోహన్, రావి వెంకటరెడ్డి, రావి బాసపతి రెడ్డి, పి.గోపీనాథ్ చౌదరి, మాజీ మున్సిపల్ చైర్మన్ దూదేకుల మీరావలి, కూటమి శ్రేణులు పాల్గొన్నాయి.

అంగన్‌వాడీ సిబ్బంది ఉత్తమ సేవలందించాలి

ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి


నియామకపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

మార్కాపురం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీలు ఉత్తమ సేవలం దించాలని మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి అన్నారు. స్థానిక జవహర్‌నగర్ కాలనీలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నూతనంగా ఉద్యోగాలు పొందిన అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలకు ఆదివారం సాయంత్రం నియామక పత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నారాయణరెడ్డి మాట్లాడుతూ కిషోర బాలికలు, మహిళలకు పౌష్టికాహారాన్ని అందించి వారి అభివృద్ధికి కృషి చేయాలన్నారు. వృత్తిపట్ల అంకితభావంతో పనిచేసి మంచి పేరు తెచ్చుకోవాలన్నారు. కార్యక్రమంలో సీడీపీవో సుశీలాదేవి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అలంకారప్రాయంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

దీర్ఘకాలిక సెలవుపై వైద్యులు



సంజీవరాయునిపేటలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

గిద్దలూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సంజీవరాయునిపేట ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో నాడిపట్టే నాథుడే కరువయ్యారు. ఠీవీగా వైద్యశాల భవనం దర్శనమిస్తున్నా, వైద్యసేవలుమాత్రం సక్రమంగా అందడం లేదు. పర్యవేక్షించాల్సిన ఉన్నతాధికారులు ఆసుపత్రుల వైపు అసలు చూడడం లేదు.

గిద్దలూరు మండలం సంజీవరాయునిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం 24 గంటల పాటు పని చేయాల్సి ఉంది. అయితే ఇక్కడ పని చేస్తున్న వైద్యాధికారులు డాక్టర్ సుమయ, డాక్టర్ దివ్య పీజీ కోర్సులు చదివేందుకు ఫిబ్రవరి నెలలో దీర్ఘకాలిక సెలవుపై వెళ్లారు. దీంతో ఈ ఆసుపత్రిలో వైద్యసేవలు స్తంభించాయి. దీంతో ఈ ఆసుపత్రిలో ఓపీ చూసేందుకు వీలుగా గిద్దలూరు పీపీ యూనిట్ నుంచి ఒక వైద్యుడిని తాత్కాలికంగా నియమించారు. ఈ వైద్యుడు 104 వాహనంలో సైతం సేవలు అందించాల్సి రావడంతో 104లో డ్యూటీ లేనప్పుడు మాత్రమే సంజీవరాయునిపేట వైద్యశాలకు వచ్చి సేవలు అందిస్తున్నారు దాంతో సగం రోజులు ఇక్కడ వైద్యసేవలు అందడం లేదు. ఈ నేపథ్యంలో నర్సులు, ఇతర సిబ్బందే వైద్యసేవలందిచాల్సిన పరిస్థితి నెలకొన్నది. ఈ ఆసుపత్రికి వాచ్‌మెన్ లేకపోవడం, రాత్రిపూట ఒకే నర్సు డ్యూటీ చేయాల్సి వస్తుండడంతో భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో ఉదయం 8 నుంచి రాత్రి 7గంటల వరకు మాత్రమే ఆసుపత్రి తెరచి ఉంచి మిగతా సమయమంతా మూసి ఉంటోంది. రెగ్యులర్ వైద్యుడు లేక, డిప్యూటేషన్ వైద్యుడు ఎప్పుడు వస్తాడో తేలిక చట్టుపక్కల గ్రామాల రోగులు అధిక వ్యయ ప్రయాసలోడ్చి గిద్దలూరు వెళుతున్నారు. ముఖ్యంగా గర్భిణులకు ప్రసవం సమయంలో తరచూ అత్యవసర పరిస్థితి ఎదుర్కొంటు న్నారు. ఇక గిద్దలూరు పట్టణంలోని కోటగడ్డవీధిలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిస్థితి కూడా ఇలాగే తయారైంది. ఇక్కడ పనిచేస్తున్న డాక్టర్ పీజీ చదివేందుకు దీర్ఘకాలిక సెలవులో వెళ్ళగా నెలన్నరగా ఈ ఆసుపత్రికి వైద్యుడే కరువయ్యాడు. కనీసం డిప్యూటేషన్ కూడా ఎవరినీ నియమించక పోవడంతో రోగులకు సిబ్బందే కరువయ్యారు. డాక్టర్ లేని ఆసుపత్రికి పోయి ఉపయోగ మేమిటని రోగులు ప్రైవేటు ఆసుపత్రిల వైపు పోతున్నారు. ఈ రెండు ఆసుపత్రులలో తగినన్ని మందులు, సిబ్బంది ఉన్నప్పటికీ నాడి పట్టే డాక్టరే లేక రోగులకు వైద్యసేవలు మృగ్యమవుతున్నాయి. వెంటనే డిప్యూటేషన్‌పై డాక్టర్లను నియమించి వైద్యసేవలను పునరుద్ధరించాలని ఆప్రాంత ప్రజలు, రోగులు కోరుతున్నారు.

పేద వైశ్య విద్యార్థులకు ఆర్థికసాయం

కంభం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): కంభం వాసవీ కల్యాణ మండపంలో ఆదివారం జరిగిన వైశ్యపేద విద్యార్థి వసతిగృహ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆరుగురు పేద వైశ్య విద్యార్థులకు ఒక్కొక్కరి రూ.10 వేలు చొప్పున ప్రోత్సాహక నగదు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పడిన కమిటీకి అధ్యక్షునిగా బైసాని లక్ష్మీవెంకటరంగనాయకులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పేద విద్యార్థులకు ఈ కమిటీ ఎప్పుడూ అండగా ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కమిటీ గౌరవాధ్యక్షులు బొగ్గు వెంకట శ్రీనివాసులు, తిరువీధి మల్లికార్జున, రాజలింగయ్య, బైసాని వెంకటరామకృష్ణ, పులిపాటి రామ్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహాల వద్ద స్వచ్ఛత కార్యక్రమం


అంబేద్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తులు వెలిగిస్తున్న బీజేపీ నాయకులు

గిద్దలూరు టౌన్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ జయంతి ఆదివారం నిర్వహించనున్న నేపథ్యంలో బీజేపీ ఆధ్వర్యంలో పలు అంబేడ్కర్ విగ్రహాల వద్ద స్వచ్ఛత కార్యక్రమం నిర్వహించి కొవ్వొత్తులు వెలిగించి నివాళ్లు అర్పించారు. పట్టణంలోని అటవీ శాఖ కార్యాలయం, కూరగాయల పెద్దమార్కెట్ కూడళ్లలోని అంబేద్కర్ విగ్రహాలను శుభ్రం చేశారు. పార్టీ నాయకులు, శ్రేణులు చేసి కొవ్వొత్తులు వెలిగించి ఘననివాళులు అర్పించారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి డాక్టర్ జేవీ.నారాయణ, పట్టణ పార్టీ అధ్యక్షులు ఎ.ఉదయ్‌శంకర్, జిల్లా ఉపాధ్యక్షులు బీవీ.రామాంజనేయులు, జిల్లా ఎస్సీ ప్రధాన కార్యదర్శి ఎం.పుల్లయ్య, బీజేపీ నాయకులు మల్లారెడ్డి, కె.నాగేశ్వరరావు, ఎం.రామకృష్ణ, వీరచక్రం, జి.శ్రీనాథ్, కె.వెంకటేశ్వర్లు, శేషాద్రి, సురేష్ పాల్గొన్నారు.

అంబేడ్కర్ జయంతికి ఏర్పాటు

ఎర్రగొండపాలెం రూరల్ : భారత్ రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలను స్థానిక టీడీపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు చేకూరి సుబ్బారావు ఆదివారం తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నియోజకవర్గ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు హాజరవుతారన్నారు. అలాగే డా.బీఆర్ అంబేద్కర్ ఆడిటోరియం, ఎస్సీ బాలికల హస్టల్ జరిగే కార్యక్రమాలలో పాల్గొంటారన్నారు.

జయంతి ఉత్సవాలలో పాల్గొనాలి

గిద్దలూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): అమరజీవి పొట్టిశ్రీరాములు 125వ జయంతి ఉత్సవాలను రాష్ట్ర ప్రభుత్వం ఘనంగా నిర్వహిస్తున్న దృష్ట్యా అందులో భాగంగా 16న బుధవారం కనిగిరిలో జరిగే ప్రత్యేక జయంతి ఉత్సవాల కార్యక్రమంలో ఆర్యవైశ్యులు, ఆవోపా సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఆవోపా అధ్యక్షులు దారా రాములు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఘనంగా మట్టల ఆదివారం


ఆర్‌సీఎం చర్చిలో అట్టలతో ప్రదర్శన నిర్వహిస్తున్న క్రైస్తవులు

మార్కాపురం వన్‌టౌన్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మట్టల ఆదివారం మార్కాపురం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆర్సీఎం చర్చిలో ఫాదర్ అరం జాన్ ఆధ్వర్యంలో మట్టలతో ప్రదర్శన నిర్వహించారు. హోసన్నా గీతాలు పాడుతూ ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఏబీఎం కాంపౌండ్‌లోని తెలుగు బాప్టిస్టు టౌన్ చర్చిలో సండే స్కూల్ చర్చి యువత విద్యార్థులు మట్టలతో ప్రదర్శన నిర్వహించారు. హోసన్నాకు జయము, బోలో ఏసూ మసికీ జై నినాదాలతో ఆటలు, ప్రార్థనలతో కార్యక్రమాలు నిర్వహించారు. పాస్టర్ పులకూరి అమృత్ తేజ్, సండే స్కూల్ సూపరింటెండెంట్ గంగా భవానీ, సుస్మితా, యూత్ డైరెక్టర్ సౌమ్య, చర్చి అధ్యక్ష, కార్యదర్శులు శామ్యూల్, జయరావు, రామస్వామి, సండే స్కూల్ టీచర్లు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా నాగూర్‌మీరాస్వామి ఉరుసు


ప్రత్యేక అలంకరణలో నాగూర్‌మీరా పీరు

పెద్దారవీడు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): పెద్దారవీడులోని నాగూర్ మీరా స్వామి ఉరుసు ఉత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. గ్రామంలోని మకానంలో నాగూర్ మీరా పీరును ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు భారీసంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఉరుసు ఉత్సవం సందర్భంగా అర్ధరాత్రి స్వామి వారి గ్రామోత్సవం నిర్వహించారు. మొక్కులు ఉన్న వారు స్వామి వారికి గొడుగులు సమర్పించి జెండాలను గ్రామోత్సవంలో స్వామి వెంబడి ఊరేగించారు. ఈ సందర్భంగా కోలాటం వంటి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : పంటలకు గిట్టుబాటు ధర లు కల్పించి జిల్లా రైతులను ఆదుకోవాలని సీపీఎం డిమాండ్ చేసింది. ఆదివా రం ఒంగోలులోని సుందరయ్య భవన్‌లో జరిగిన సీపీఎం ప్లీనరీ సమావేశానికి పూనాటి ఆంజనేయులు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా చేసిన తీర్మానాలను పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్కే.మాబు విడుదల చేశారు. కరువు మండలాలుగా ప్రకటించిన 21 మండలాల్లో కరువు సహాయక చర్యలు చేపట్టాలని, నల్లబర్లీ, బర్లీ, పొగాకు, మిర్చి, వరి తదితర పంటలకు మద్దతు ధర కల్పించాలన్నారు. నీటి ఎద్దడి నివారణ చర్యలు తీసుకోవాలని, తాగునీటి కొరత ఉన్న గ్రామాలు, పట్టణాలకు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయాలని పేర్కొన్నారు. అలాగే ఒంగోలు, కనిగిరి, దర్శి, గిద్దలూరు చీమకుర్తి, పొదిలి పట్టణాల్లో మంచినీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని వారు కోరారు.

గాలివాన బీభత్సం

- నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు
- విద్యుత్ సరఫరాకు అంతరాయం
- నేలమట్టమైన బొప్పాయి చెట్లు
- కల్లాల్లో తడిచిన మిర్చి
- ధాన్యం కాపాడుకునేందుకు రైతుల పరుగులు



దర్శి: వర్షానికి ధాన్యం తడవకుండా కప్పిన పరదాలు



ముండ్లమూరు: సుంకరవారిపాలెంలో నేలమట్టమైన బొప్పాయి తోట



ముండ్లమూరు: ఉమామహేశ్వర అగ్రహారంలో కురిసిన వడగళ్ళ వాన

దర్శి, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): దర్శి, కనిగిరి ప్రాంతాల్లో ఆదివారం గాలివాన బీభత్సం సృష్టించింది. పలుచోట్ల విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. బొప్పాయి తోటలు దెబ్బతిన్నాయి. కల్లాల్లో మిర్చి తడిసిపోయింది. కల్లాల్లో ఉన్న ధాన్యం, మిర్చిని పట్టలు కప్పి కాపాడుకొనేందుకు రైతులు పరుగులుతీశారు.

దర్శి ప్రాంతంలో ఆదివారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. ఈ వర్షానికి తూర్పుచౌటపాలెం, చందలూరు తదితర గ్రామాల్లో బొప్పాయి తోటలు దెబ్బతిన్నాయి. మూడు రోజుల క్రితం ఇలాగే ఈదురుగాలులతో కూడిన వర్షం కురవటంతో పలు గ్రామాల్లో బొప్పాయి నేలకొరిగిన విషయం తెలిసిందే. ఆదివారం మళ్లీ గాలివాన బీభత్సం సృష్టించటంతో బొప్పాయి తోటలు మరింత దెబ్బతిన్నాయి. దీంతో బొప్పాయి సాగు చేసిన రైతులు అల్లాడిపోతున్నారు. ఎకరాకు సుమారు రూ.2 లక్షలు పెట్టుబడులు పెట్టి బొప్పాయి సాగు చేశారు. ప్రస్తుతం ముమ్మరంగా కాపు దశలో ఉంది. కాయలు కాస్తున్న సమయంలో చెట్లు నేలకొరగటంతో రైతులు పూర్తిగా నష్టపోయారు. రబీ సీజన్‌లో సాగుచేసిన వరిపంట కూడా కొన్ని గ్రామాల్లో దెబ్బతింది. కళ్లాలు చేస్తున్న రైతులు పంటను కాపాడుకునేందుకు నానా అగచాట్లు పడుతున్నారు. కళ్లాల్లో రాసులు పోసిన వరి ధాన్యం తడవకుండా పరదాలు కప్పి భద్రపర్చుకుంటున్నారు. అలాగే, ఈదుర గాలుల వర్షానికి మిర్చి దెబ్బతింది. ప్రస్తుతం కోతదశలో ఉన్న మిర్చి ఈదురుగాలులకు కాయలు రాలిపోయాయి. అసలే మార్కెట్‌లో ధరలు లేక నష్టాల అంచున ఉన్న మిర్చి రైతులు అకాల వర్షానికి పంట దెబ్బతినటంతో మరింత నష్టపోయే పరిస్థితి నెలకొంది. దెబ్బతిన్న పంటలను గుర్తించి ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

పంటలకు తీవ్ర నష్టం

ముండ్లమూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలో పలు గ్రామాల్లో ఆదివారం మధ్యాహ్నం గాలి వాన బీభత్సం సృష్టించింది. ఉరుములు, మెరుపులతో పాటు వడగళ్ళ వాన కురిసింది. మిర్చి, వైట్ బర్లి పొగాకు, మినుము, నూగు, వరి, బొప్పాయి తోటలకు అపారనష్టం వాటిల్లింది. నాయుడుపాలెం, సుంకరవారిపాలెం, బలరామ్‌నగర్ గ్రామాల్లో బొప్పాయి తోటలు నేలమట్టం అయ్యాయి. పులిపాడు, కమ్మవారిపాలెం, వేముల, ముండ్లమూరు, కెల్లంపల్లి, నందమూరి నగర్ గ్రామాల్లో 20 విద్యుత్ స్తంభాలు గాలివాన బీభత్సానికి పడిపోయాయి.



పీసీపల్లి: పెద్దన్నపల్లిలో పడిపోయిన ట్రాన్స్‌ఫార్మర్

మండలంలోని ఈదర, బొప్పూడివారిపాలెం, భీమవరం, పూరిమెట్ల, ఉమామహేశ్వర అగ్రహారం, వేముల, కెల్లంపల్లి, కమ్మవారిపాలెం, తమ్మలూరు, నాయుడుపాలెం, మారెళ్ళ, మక్కెనవారిపాలెం, జమ్మలమడక గ్రామాల్లో వడగళ్ళ వాన కురిసింది. ఉమామహేశ్వర అగ్రహారం, పూరిమెట్ల, తమ్మలూరు గ్రామాల్లో రైతులు కల్లాల్లో ఆరబెట్టిన మిర్చి తడిచిపోయింది. మిర్చిని కాపాడుకొనేందుకు రైతులు పరదా పట్టలు వేశారు. పులిపాడు, తమ్మలూరులో వైట్‌బర్లీ పొగాకు పూర్తిగా తడిచిపోయింది. వేముల, కమ్మవారిపాలెం, కొమ్మవరం గ్రామాల్లో మినుము, నూగు వర్షం దాటికి ఒరిగిపోయింది. ఉమామహేశ్వర అగ్రహారంలో మిర్చి కోత కోసేందుకు వచ్చిన వలస కూలీలకు వేసిన గుడారాలు గాలికి లేచిపోయాయి. పలు గుడారాల్లోకి నీరు రావటంతో నీటిని తొలగించేందుకు వలస కూలీలు పడరాని పాట్లుపడ్డారు. ఉల్లగల్లు, రెడ్డినగర్ మధ్య రహదారికి ఇరువైపులా ఉన్న చెట్ల కొమ్మలు విరిగి రోడ్లపై పడి పోయాయి. విద్యుత్ ఏఈ పి.చినఅంకబాబు తన సిబ్బందితో ఆయా గ్రామాలకు వెళ్ళి మరమ్మతులు చేసి విద్యుత్‌ను పునరుద్ధరించారు.

కురిచేడులో వర్షం

కురిచేడు, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): కురిచేడులో ఆదివారం సాయంత్రం కొద్దిపాటి వర్షం కురిసింది. ఉదయం నుంచి ఠారెత్తించిన ఎండ సాయంత్రానికి ఒక్కసారిగా చల్లబడింది. కొద్దిపాటి జల్లులు పడ్డాయి. వాతావరణం చల్లబడింది.

పీసీపల్లిలో విద్యుత్‌కు అంతరాయం



ముండ్లమూరు: పులిపాడులో పడిపోయిన విద్యుత్ స్తంభం



కనిగిరి: ప్రభుత్వ బాలికల హైస్కూల్ వద్ద నేలకొరిగిన కరెంట్ స్తంభం

పీసీపల్లి, ఏప్రిల్ 13(ఆంధ్ర జ్యోతి): మండలంలో ఆదివారం గాలివాన బీభత్సం సృష్టించింది. ఉరుములు, మెరుపులతో పాటు ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. కల్లాల్లో ఆరబెట్టిన మిరపకాయలు తడిసి ముద్దయ్యాయి. పలుచోట్ల చెట్లు పడిపోవడంతో విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. దీంతో మండలంలోని అన్ని గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అకాల వర్షంతో మిరప రైతులకు తీవ్రనష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షంతో పాటు వీచిన గాలి బీభత్సం సృష్టించడంతో మండలంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లకు వచ్చే మెయిన్‌లైన్లు బ్రేక్‌డౌన్ అయ్యాయి. పెద్దన్నపల్లిలో సింగిల్‌ఫేస్ ట్రాన్స్‌ఫార్మర్ అమర్చిఉన్న విద్యుత్‌స్తంభం గాలి తీవ్రతకు విరిగి పడిపోయింది. కమ్మవారిపల్లి గ్రామంలో కురిసిన వర్షానికి కల్లాల్లో ఉన్న మిరపకాయలు తడిసి ముద్దయ్యాయి. కాయలపై కప్పిఉంచిన పట్టలు గాలికి ఎగిరిపోయాయి.



కనిగిరి: సూరాపాపిరెడ్డి కాలనీలో గాలికెగిరిపడిన ఇంటిపై రేకుల కప్పు

శనివారం కురిసిన వడగండ్ల వర్షానికి మండలంలోని పీసీపల్లి, కొత్తపల్లి, పాతపల్లి, కమ్మవారిపల్లి, మలినేనివారిపల్లి, పడమటిపల్లి, పెద్దన్నపల్లి, వాకంవారిపల్లి, పాలేటిపల్లి గ్రామాలకు విద్యుత్ నిలిచిపోయింది. ఆదివారం తెగిన విద్యుత్‌తీగలకు మరమ్మతులు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. తిరిగి సాయంత్రం వచ్చిన గాలివాన తీవ్రతకు మండలంలోని అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అకాలవర్షం రైతులతో పాటు విద్యుత్‌శాఖకు నష్టం మిగిల్చింది.

కనిగిరిలో తెగిపడిన విద్యుత్ తీగలు

కనిగిరి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): కనిగిరి ప్రాంతంలో ఆదివారం సాయంత్రం ఈదురుగాలులతో వర్షం కురిసింది. పట్టణంలోని ప్రభుత్వ బాలికల హైస్కూల్ వద్ద విద్యుత్ స్తంభం నేలకొరిగింది. స్తంభానికి ఉన్న విద్యుత్ లైను తీగలు తెగిపోవడంతో సబ్‌స్టేషన్ వద్ద విద్యుత్ సరఫరా ట్రిప్ అయి నిలిచిపోయింది. సమయానికి రోడ్డుపై ఎవరూ లేకపోవటంతో పెను ప్రమాదం తప్పింది.

పట్టణ సమీ పంలోని సూరా పాపిరెడ్డి కాలనీలోని ఇళ్లపై రేకుల కప్పులు ఎగిరిపడ్డాయి. దీంతో ఇళ్లలోని వస్తువులు, దస్తులు, సామ్రగి తడసిపోయి నష్టం వాటిల్లింది. రోడ్ల వెంబడి ఉన్న హోర్డింగ్‌లు ఈదురు గాలులకు నేలకొరిగాయి. పట్టణంలోని శివనగర్ కాలనీలో వర్షపు నీటితో రోడ్లన్నీ జలమయంగా మారాయి.

భక్తిశ్రద్ధలతో ఆదివారం పూజలు

సీఎస్‌పురం(పామూరు), ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలం మిట్టపాలెం శ్రీ నారాయణస్వామి దేవస్థానంలో ఆదివారం పూజలను భక్తులు ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు స్వామి మూలవిరాట్‌కు అభిషేకాలు, సహస్ర కుంకుమార్చన పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మేళతాళాలతో స్వామివారికి మహ నైవేద్యాన్ని ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి స్వామివారికి సమర్పించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఆరోగ్యం పట్ల ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలి

పామూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ 40 సంవత్సరాల వయసు దాటినతర్వాత ఆరోగ్య విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలని ఒంగోలు మెడిక్యూర్ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ గుండె వైద్యనిపుణులు డాక్టర్ కె.శ్రీధర్‌బాబు అన్నారు. పట్టణంలోని డాక్టర్ గద్దె ఏడుకొండలు అశ్వని హాస్పిటల్‌లో ఆదివారం గుండె వైద్యశిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ శ్రీధర్‌బాబు మట్లాడుతూ ఉరుకుల పరుగుల జీవితంలో ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. ప్రతిరోజు క్రమం తప్పకుండ వ్యాయామం చేయడంద్వారా గుండె జబ్బులను నివారించుకోవచ్చునని చెప్పారు. పామూరులోని అశ్వని హాస్పిటల్‌లో ప్రతినెలా మూడో ఆదివారం తక్కువ ఖర్చుతో గుండె పరీక్షలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు.

వాగులోకి దూసుకెళ్లిన కారు.. తప్పిన ప్రమాదం

ముండ్లమూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలవరం సమీపంలో అద్దంకి - దర్శి ప్రధాన రహదారిపై ఆదివారం మధ్యాహ్నం కారు వేగంగా వెళుతూ వాగులోకి దూసుకెళ్లింది. దర్శి వైపు నుంచి అద్దంకి వెళ్తున్న కారు పోలవరం నేల చప్టా వద్ద అదుపుతప్పి వాగులోకి దూసుకు వెళ్ళింది. ఆ దారిన వెళ్తున్న వారు బోల్తా పడిన కారులో ఉన్నవారిని బయటకు తీశారు. వీరికి పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. పెద్ద ప్రమాదం తప్పడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

అస్తవ్యస్తంగా ఎన్‌ఏపీ నిర్వహణ

- ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల నిర్లక్ష్యం
- అపహరణకు గురవుతున్న విలువైన మెటీరియల్



రాగి తీగ అపహరణకు గురైన దర్శి ఎన్ఏపీ స్కీమ్ ట్రాన్స్‌ఫార్మర్

దర్శి, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల నిర్లక్ష్యవైఖరితో ఎన్‌ఏపీ రక్షిత మంచినీటి పథకం నిర్వాహణ అస్తవ్యస్తంగా మారింది. అధికారులు, సిబ్బంది బాధ్యతారహితంగా వ్యవహరిస్తుండటంతో విలువైన మెటీరియల్ అపహరణకు గురవుతుంది. గతంలో ఎన్‌ఏపీ స్కీమ్‌కు చెందిన పైపులు, ట్రాన్స్‌ఫార్మర్లు, ఇనుప మెటీరియల్ అనేకసార్లు చోరీకి గురైంది. తాజాగా దర్శి ఎన్‌ఏపీ చెరువుకు నీరు పంపింగ్ చేసేందుకు ఏర్పాటుచేసిన మోటార్లకు విద్యుత్ సరఫరా కోసం నిర్మించిన ట్రాన్స్‌ఫార్మర్ల రాగితీగను గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించారు. లక్షలాది రూపాయల విలువచేసే రాగితీగను అక్కడ ఉన్న అన్నీ ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి కోసుకెళ్లారు. ఒక్కరోజులో ఎంతో పటిష్టమైన రాగితీగను అన్నీ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద తీగను కోసుకొని వెళ్లాలంటే ఎంతో సమయం పడుతుంది. సిబ్బంది పర్యవేక్షణ లేకపోవటంతో ఆ మోటార్లు ట్రాన్స్‌ఫార్మర్ల గూర్చి ఎవరూ పట్టించుకోక పోవటంతో దొంగలు ఇదే అదనుగా లక్షలాది రూపాలయ విలువైన రాగితీగను అపహరించారు. చేతుల కాలాక ఆకులు పట్టుకున్నట్లు అధికారులు సంఘటన జరిగిన ఒకరోజు తర్వాత పిర్యాదు చేశారు.

120 గ్రామాలకు మంచినీరు అందించే ఎన్‌ఏపీ రక్షిత మంచినీటి పథకంపై ఉన్నతాధికారులు నిర్లక్ష్యవైఖరి అవలంబిస్తున్నారు. నిర్వహణ బాధ్యతలు అప్పగించే విషయంలో కూడా మతలబు జరిగిందని చెప్పుకుంటున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ సబ్‌డివిజన్ కార్యాలయం దర్శిలో ఉంది. ఇక్కడ డీఈఈతో పాటు ఏఈ మిగిలిన సిబ్బంది అందుబాటులో ఉంటారు. జిల్లా అధికారులు ఏ ఉద్దేశంతోనో ముండ్లమూరులో పనిచేస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈకి దర్శి ఎన్‌ఏపీ స్కీమ్ నిర్వాహణ బాధ్యతలు అప్పగించారు. ఆయన అక్కడ, ఇక్కడ విధులు నిర్వహిస్తుండటంతో పని ఒత్తిడి అధికమైంది. ఎన్‌ఏపీ స్కీమ్ ద్వారా మంచినీరు శివారు ప్రాంతాలకు సక్రమంగా అందటం లేదు. పలు గ్రామాలకు ఫిల్టర్ కూడా చేయకుండా కలుషిత నీరు విడుదల చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఈనేపథ్యంలో ఎన్‌ఏపీ చెరువుకు నీరు పంపింగ్ చేసే ట్రాన్స్‌ఫార్మర్ల రాగితీగను దొంగలించటంతో కలకలం నెలకొంది. అసలు ఎన్‌ఏపీ స్కీమ్‌లో ఏం జరుగుతుందనే చర్చ నెలకొంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఎన్‌ఏపీ రక్షిత మంచినీటి పథకం దుస్థితి గుర్తించి పూర్తిస్థాయిలో నిర్వహణ బాధ్యతలు అప్పజెప్పాల్సిన అవసరం ఉంది. వేసవిలో అన్నీ గ్రామాలకు సక్రమంగా మంచినీరు అందించేలా పటిష్ట చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత వారిపై ఉంది.

గుంటిగంగ తిరునాళ్లలో ట్రాఫిక్‌కు ఇబ్బందిలేకుండా చర్యలు

- దర్శి డీఎస్పీ లక్ష్మీనారాయణ



ప్రభల నిర్వాహకులతో మాట్లాడుతున్న డీఎస్పీ లక్ష్మీనారాయణ

తాళ్లూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన గుంటిగంగ అమ్మవారిని భక్తులు సుహృద్భావ వాతావరణంలో తిలకించేలా ప్రభల నిర్వహకులు, ప్రజలు సహకరించాలని దర్శి డీఎస్పీ లక్ష్మీనారాయణ తెలిపారు. ఆదివారం సాయంత్రం ప్రభల నిర్వహకులు, దేవదాయ శాఖ, గ్రామపంచాయతీ అధికారులతో గుంటిగంగ సన్నిదిలో తిరునాళ్ల ఏర్పాట్ల గురించి మాట్లాడారు. తిరునాళ్లలో ట్రాఫిక్‌కు అవరోధం తలెత్తకుండా పోలీస్ శాఖ విధించిన నిబంధనలు పాటించాలన్నారు. వాహనదారులు తిరునాళ్ల ప్రాంగణంలోకి వాహనాలను తీసుకరావద్దని సూచించారు. పాటకచేరి నిర్వహించే వారు సంప్రదాయబద్ధమైన దుస్తులు వేసుకుని పాటలు పాడాలే తప్ప, ఎలాంటి డ్యాన్స్‌లు చేయటం నిషిద్ధమన్నారు. ప్రభలపై ఏర్పాటుచేసే స్టేజీలు కట్టుదిట్టంగా చేయాలన్నారు. స్టేజీ ముందు పది మీటర్ల దూరంలో వలయం ఏర్పాటు చేయాలన్నారు. ప్రభల నిర్వాహకులు కూడా పోలీస్‌శాఖకు సహకరించి ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ప్రశాంతవాతావరణంలో తిరునాళ్ల ముగిసేలా చూడాలన్నారు. పోలీస్‌శాఖ ఇచ్చిన సమయంలోపు కార్యక్రమాలు ముగించాలన్నారు. పోలీస్ శాఖతో సహకరించి తిరునాళ్ల ప్రశాంతవాతావరణంలో ముగిసేలా చూడాలన్నారు. తిరునాళ్లలో భక్తులకు దేవదాయ, పంచాయతీ అధికారులు చేపట్టిన ఏర్పాట్లను డీఎస్పీ పరిశీలించారు. కార్యక్రమంలో దేవస్థాన కమిటీ చైర్మన్ కొసనా గురుబ్రహ్మ, సీఐ వై.రామారావు, తాళ్లూరు, దర్శి, ముండ్లమూరు ఎస్‌లు ఎస్.మల్లికార్జునరావు, మురళి, కమలాకర్, టీవీ సుబ్బారెడ్డి, పోశం మధుసూదన్‌రెడ్డి, పులి ప్రసాద్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మెగా వైద్యశిబిరం

స్వర్గీయ సోమా పుల్లయ్య జ్ఞాపకార్థం శ్రీరామ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో సోమవారం జరిగే తిరునాళ్లలో మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు పుల్లయ్య కుమారులు తెలిపారు. వైద్యులు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేస్తారన్నారు. వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

కురిచేడు, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని అలవలపాడు గ్రామం వద్ద ఓ మహిళ అనుమానాస్పదంగా మృతి చెందారు. దర్శి ఎస్సెస్సీ కాలనీకి దగ్గరలో నివాసం ఉంటున్న అన్నెబోయిన లక్ష్మి(45) రెండు రోజల నుంచి కనబడటం లేదని కుటుంబసభ్యులు వెతుకుతున్నారు. ఈక్రమంలో ఓవ్యక్తి అలవలపాడు సమీపంలో మహిళ మృతదేహం ఉందని పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ శివ మృతదేహాన్ని పరిశీలించి విచారణ చేపట్టగా ఆమె దర్శికి చెందిన లక్ష్మిగా గుర్తించారు. గుర్తు తెలియని వ్యక్తి హత్య చేసిఉండవచ్చుననే అనుమానాలు సంఘటనా స్థలంలో ఎక్కువ మంది వ్యక్తం చేశారు. సంఘటనా స్థలాన్ని త్రిపురాంతకం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అసన్ పరిశీలించారు. ఎస్ఐ శివ శవపంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం దర్శి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతురాలు లక్ష్మికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

భార్యను హత్యచేసిన భర్త

పామూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మాటమాట పెరిగి భార్యను భర్త రాడ్‌తో కొట్టడంతో మృతి చెందిన ఘటన ఆదివారం పామూరులో చోటుచేసుకొంది. పట్టణంలోని సీఎస్‌పురం రోడ్‌లోగల ప్రశాంతి నగర్‌లో యాసరపు రమేష్ భార్య మార్తమ్మ, ముగ్గురు పిల్లలతో జీవిస్తున్నారు. మధ్యాహ్న భోజనం అనంతరం భార్యభర్తల మధ్య గొడవ తలెత్తింది. కోపోద్రిక్తుడైన రమేష్ సమీపంలో ఉన్న రాడ్‌తో మార్తమ్మ తల వెనుక భాగంలో కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందింది.

సమాచారం అందుకొన్న కనిగిరి డీఎస్పీ సాయిఈశ్వర్ యశ్వంత్, ఇన్‌చార్జ్ సీఐ షేక్ ఖాజావలి, ఎస్ఐ కిశోర్‌బాబులు మార్తమ్మ మృతదేహాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కనిగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

మూఢ నమ్మకాలపై ప్రజలను చైతన్యవంతం చేయాలి



మాట్లాడుతున్న గేయానంద్

పామూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మూఢ నమ్మకాలపై ప్రజలను చైతన్యవంతం చేయాలని జనవిజ్ఞాన వేదిక(జేవీవీ) రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గేయానంద్ అన్నారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జేవీవీ జిల్లాస్థాయి శిక్షణ తరగతుల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రజలకు వాస్తవాలు చెప్పాల్సిన ప్రభుత్వాలు మతం మందును వెదజల్లుతూ మూఢనమ్మకాలను పెంచిపోషిస్తున్నాయని అన్నారు. సైన్స్‌కు, శాస్త్రీయ దృక్పథానికి ప్రభుత్వాలు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలందరికి విద్య, వైద్యం అందుబాటులో ఉండాలన్నారు. మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా గత 20 సంవత్సరాలనుంచి జేవీవీ కృషి చేస్తుందన్నారు. ప్రభుత్వాల నుంచే నేడు సైన్స్‌కు ముప్పు పొంచి ఉందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుర్రా రామారావు, జిల్లా గౌరవాధ్యక్షుడు డాక్టర్ టి.చెన్నకృష్ణ, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మండ్లా శ్రీనివాసులు, సీహెచ్ జయప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మట్టల ఆదివారం వేడుకలు



దొనకొండలో ఊరేగింపు నిర్వహిస్తున్న క్రైస్తవులు

దొనకొండ, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): ఏసుక్రీస్తు పునరుత్థాన పండుగ (ఈస్టర్)ను పురస్కరించుకొని ఆదివారం క్రైస్తవులు మట్టల ఆదివారం వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఏసుక్రీస్తు జెరూసలేం పట్టణంలో ప్రవేశించినపుడు అక్కడి ప్రజలు వివిధ రకాల మట్టలతో ఘనస్వాగతం పలికారు. దీనినే క్రైస్తవులు మట్టల పండుగగా ఆచరిస్తారు. దొనకొండ ఆర్సీఎం చర్చిలో రెవరండ్ ఫాదర్ గుడిపల్లి థామస్ ఆధ్వర్యంలో కొబ్బెరమట్టలు చేత పట్టుకొని క్రైస్తవ గీతాలను ఆలపిస్తూ ఊరేగింపు నిర్వహించారు. ఆర్సీఎం, ఏబీఎం, సీఎస్ఐ, లూతరన్, చర్చ్ ఆఫ్ క్రైస్ట్ తదితర చర్చిల్లో మట్టల ఆదివారం ప్రత్యేక సందేశాన్ని సంఘకాపరులు వినిపించారు. భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

దర్శిలో.. దర్శి, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): దర్శి పట్టణంలో ఆదివారం మట్టల ర్యాలీ నిర్వహించారు. క్రిస్టియన్లు ఈస్టర్ పండుగకు ముందు వచ్చే ఆదివారం ఈ ర్యాలీ నిర్వహించటం సంప్రదాయం. స్థానిక సియోను ప్రార్థనా మందిరం సంఘస్తులు, విద్యార్థులు దావీదు రాజుకు జయము జయము అంటూ కీర్తనలు ఆలపిస్తూ మట్టల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సంఘకాపరి జాన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముండ్లమూరులో ఉచిత వైద్యశిబిరం



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు మేఘన, లిల్లి జాయ్

ముండ్లమూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ముండ్లమూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉన్నం చారిటబుల్ ట్రస్ట్, విజయవాడ వారి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. పెదకాకాని శంకర్ కంటి వైద్యులు డాక్టర్ మేఘన, డాక్టర్ లిల్లి జాయ్ వైద్య పరీక్షలు చేశారు. 240 మంది పరీక్షలు చేయించుకోగా, 110 మందికి ఆపరేషన్‌లు అవసరమని వైద్యులు నిర్ధారించారు. అంతకుముందు వైద్య శిబిరాన్ని ప్రారంభించిన ఉన్నం చారిటబుల్ ట్రస్ట్ అధినేత రామాంజనేయులు మాట్లాడుతూ పేద ప్రజలు ఆరోగ్యకరంగా ఉండాలన్నదే తమ ట్రస్ట్ లక్ష్యమన్నారు. ఇప్పటికే తమ ట్రస్ట్ ద్వారా 12వేల మందికిపైగా ఆపరేషన్‌లు చేయించినట్టు చెప్పారు. కార్యక్రమంలో సీహెచ్ శ్రీరామ్, ఉన్నం మురళీకృష్ణ, మోపర్తి రవి, ఉన్నం పరిపూర్ణయ్య, టీడీపీ నాయకులు మానం నాగేశ్వరరావు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

గుంటిగంగ భవాని అమ్మవారికి అభిషేకాలు



అమ్మవారికి అభిషేకం చేసేందుకు వస్తున్న మహిళలు

తాళ్ళూరు, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రసిద్ధిచెందిన గుంటి గంగ భవానీ అమ్మవారికి ఆర్యవైశ్య మహిళలు ఆదివారం ప్రత్యేకంగా అభిషేకం నిర్వహించారు. పూర్వం నుంచి ఆర్యవైశ్యులు అమ్మవారి తిరునాళ్ల సందర్భంగా అభిషేకాలు నిర్వహించటం ఆచారంగా వస్తుంది. ఈతరుణంలో కొంత కాలం ఆచారాన్ని మరచిన ఆర్యవైశ్యులు పెద్దల సూచనల మేరకు వంద సంవ త్సరాల తిరునాళ్ల సందర్భంగా 151 మంది మహిళలు కలశ బిందెలతో తూర్పు గంగవరం నుంచి ప్రత్యేక బస్సులలో వచ్చి మంగళ వాయిద్యాలు, డప్పుల మోతలతో అమ్మవారికి ప్రదర్శనలు చేసి అభిషేకం చేశారు.

ఇంటర్ ఫలితాల్లో పామూరు వీజేసీ విద్యార్థుల హవా



సీహెచ్ ప్రత్యూష



నందకిషోర్

కనిగిరి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): కనిగిరి ఎంఎస్ఎం కళాశాల అనుబంధ పామూరు పట్టణంలోని వెంగమాంబ జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. స్థానిక ఎంఎస్ఎం కళాశాలలో ఆదివారం జరిగిన సమావేశంలో ఎంఎస్ఎం కళాశాల కరస్పాండెంట్ ఏలూరి సుబ్బారావు వెంగమాంబ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.వెంకటేశ్వర్లు, అధ్యాపక బృందాన్ని అభినందించారు. ఈసందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ అత్యుత్తమ ప్రమాణాలతో విద్యాబోధనే లక్ష్యంగా కృషి చేస్తున్నట్టు తెలిపారు. ఇంటర్ రెండో సంవత్సరం బైపీసీలో సీహెచ్ ప్రత్యూష 973 మార్కులు సాధించి పామూరు మండలంలో మొదటిస్థానంలో నిలిచారన్నారు. ఎంపీసీలో ఎం.పూజ 971, సీఈసీలో నందకిషోర్ 941 మార్కులు సాధించారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో ఎస్‌కే మనీషా బైపీసీలో 941 మార్కులు, ఎంపీసీలో ఎం.సుష్మా 455, డి.మణికంఠ 455, బి.వైష్ణవి 455 మార్కులు సాధించిచారు.. కె.సుభాని సీఈసీలో 412 మార్కులు సాధించినట్లు ఏలూరి తెలిపారు. సమావేశంలో కళాశాల డైరెక్టర్ నరేంద్ర, అధ్యాపక బృందం పాల్గొన్నారు.



నాకొక శ్రీమతి కావాలి

- పెరుగుతున్న పెళ్లికాని ప్రసాదులు
- మెజార్టీ కమ్యూనిటీల్లో అమ్మాయిల కొరత
- మారుతున్న యువతుల అభిరుచులు
- కష్టమవుతున్న పెండ్లి సంబంధాలు
- వివాహ పరిచయ వేదికలకు పెరుగుతున్న క్యూ
- అబ్బాయిల తల్లిదండ్రుల్లో ఆందోళన
- కొన్ని ప్రాంతాల్లో అమలవుతున్న కన్యాశుల్కం

పెళ్లెప్పుడవుతుంది బాబూ.. నాకు పిల్ల యాడ దొరుకుతుంది బాబు.. దశాబ్దాల క్రితం రాసిన ఈ సినిమా పాట ప్రస్తుత పరిస్థితులకు అతికినట్టు సరిపోతుంది. పెళ్లి రెండు జీవితాలను ముడివేసే బంధం. ఒక్క మాటలో చెప్పాలంటే.. ప్రతి ఒక్కరి జీవితంలో అతి ముఖ్యమైన ఘట్టం. అయితే మూడు ముళ్లతో ఏకం కావాలని కోరుకునే ఎంతోమంది అబ్బాయిలకు ఈ మధ్య కాలంలో పిల్ల దొరకడం లేదు. ఒకటి రెండు కాదు మెజార్టీ సామాజిక వర్గాల్లో అమ్మాయిల కొరత వేధిస్తుంది.



గుంటూరు, సంగడిగుంటకు చెందిన ఓ యువకుడు ఎనిమిదేళ్ల కిందట బీటెక్ పూర్తిచేసి సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. నెలకు రూ.60 వేలకుపైగానే జీతం వస్తోంది. మూడేళ్లుగా తల్లిదండ్రులు పెళ్లి ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఇప్పటివరకూ సంబంధం కుదరలేదు.

గుంటూరు విద్యానగర్‌కు చెందిన యువకుడు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు సంస్థలో రూ.80 వేలతో ఉద్యోగం చేస్తున్నాడు. గ్రామంలో ఆస్తులు బాగానే ఉన్నాయి. అయినా మూడేళ్లుగా పెళ్లి సెట్ కాలేదు.

డొకిపర్రు గ్రామానికి చెందిన ఓ యువకుడు బేల్దారు మేస్త్రిగా ఉంటూ నెలకు రూ.50 వేలకు పైగా సంపాదిస్తున్నాడు. గ్రామాల్లో పొలం, ఇతర ఆస్తులు ఉన్నాయి. ఐదేళ్ల నుంచి పెళ్లి ప్రయత్నాలు సాగిస్తున్నా సంబంధం కుదరలేదు.

రూరల్ మండలం, ఓ గ్రామానికి చెందిన అగ్రకులానికి చెందిన యువ రైతుకు పెళ్లి కావడంలేదు. దీంతో అతడి తల్లిదండ్రులు విజయనగరం జిల్లాకు వెళ్లి ఎదురు రెండు లక్షలు ఇచ్చి ఓ బలహీన వర్గానికి చెందిన యువతితో వివాహం చేశారు.

● గుంటూరు ఏటి అగ్రహారం ప్రాంతానికి చెందిన యువకుడు ఆరేళ్ల కిందట న్యాయ విద్య పూర్తి చేసి సొంతంగా ప్రాక్టీస్ చేసుకుంటున్నాడు. ఐదేళ్ల నుంచి కుటుంబ సభ్యులు సంబంధాలు చూస్తున్నా ఇప్పటికీ కుదరలేదు.



మారుతున్న అమ్మాయిల అభిరుచులు..

ఇటీవలి కాలంలో యువతుల అభిరుచులూ మారుతున్నాయి. గతంలో అమ్మాయి తరపు వారికి అబ్బాయి నచ్చితే సరిపోయేది. కాని, ఇప్పుడు అమ్మాయిలకు నచ్చితేనే పెళ్లికి ముందుకు వెళ్తున్నారు. అబ్బాయి వయస్సు, సంపాదన, కుటుంబ నేపథ్యం, ఆస్తులు ఇలా అన్ని చూసుకున్న తర్వాతనే ఒప్పుకుంటున్నారు. ముఖ్యంగా పెద్ద కుటుంబాలను కోరుకునేందుకు ఇష్టపడడం లేదు. పెళ్లి కాగానే వేరు కాపురం పెడుతారా..? లేదా..? అన్న కోణంలోనే అమ్మాయిలు చూస్తున్నారు. తమ పిల్లలకు కష్టం వాటిల్లకుండా ఉండాలన్న తపనను తల్లిదండ్రులు ప్రదర్శిస్తున్నారు.

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ఇదీ గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లోని యువకుల పరిస్థితి. చదువు, జీతం, ఆస్తులు, హోదా ఉన్నా పెళ్లిళ్లు కుదరడంలేదు. మూడు పదుల వయసు దాటుతున్నా పెళ్లి కాని వారి సంఖ్య ప్రస్తుతం అన్ని సామాజిక వర్గాల్లో తీవ్రమవుతోంది. గతంలో ఆడపిల్ల ఇంట్లో ఉంటే గుండెల మీద కుంపటి అనుకునేవారు. కట్నకానుకలు ఇవ్వడానికి అప్పు చేసేవారు. ఇప్పుడు ఇదంతా పూర్తిగా మారింది. కట్నం మాట దేవుడెరుగు, అమ్మాయి వివాహం చేసుకోవడానికి ఒప్పుకుంటే చాలన్నట్లుగా అబ్బాయిలు, వారి తల్లిదండ్రులు ఎదురుచూస్తున్నారు.

● పరిచయ వేదికలకు అబ్బాయిల క్యూ

ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఓ సామాజిక వర్గంలో అమ్మాయిలు కొరత అధికంగా ఉంది. దీనిని దృష్టిలో పెట్టుకుని.. ఆ సంఘం పెద్దలు ఓ ఆలోచన చేసి.. వధూవరుల వివరాల సేకరణకు సంఘం ఆధ్వర్యంలో ఒక రిజిస్టర్ నిర్వహిస్తున్నారు. అయితే గడిచిన ఎనిమిది నెలల్లో 2140 మంది అబ్బాయిలు, 830 మంది అమ్మాయిలు పేర్లు నమోదు చేసుకున్నారు. అందులో సదరు సంఘం ఇప్పటికి మూడుసార్లు పరిచయ వేదికలు నిర్వహిస్తే.. ఇద్దరూ ఒక్కటైంది కేవలం 79 మంది మాత్రమే. ఈ తరహా పరిచయ వేదికలకు అబ్బాయిలు క్యూ కడుతున్నారే తప్ప.. అమ్మాయిల సంఖ్య నానాటికి తగ్గుతుంది. గుంటూరులో ఇటీవల ఓ ప్రధాన సామాజిక వర్గానికి చెందిన వివాహ పరిచయ వేదిక ఏర్పాటు చేయగా 70 శాతం అబ్బాయిలు వస్తే.. 30 శాతం అమ్మాయిలు వచ్చారు.

● మానసిక సమస్యలు..

పెళ్లికాకపోవడం వల్ల యువకులతోపాటు వారి తల్లిదండ్రులు మానసికంగా ఒత్తిడికి గురవుతున్నారు. 30 ఏళ్లు దాటినా పెళ్లి కాకపోవడం వల్ల అబ్బాయిల్లో అసహనం, నిరుత్సాహం వంటివి పెరిగి పోతున్నట్లు మానసిక వైద్యులు చెబుతున్నారు. పెళ్లెప్పుడు అని పలువురు అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పలేక తీవ్రమైన ఒత్తిడిని అనుభవిస్తున్నారు.

● నిర్దిష్ట అభిప్రాయాలు లేని తల్లిదండ్రులు

పెళ్లిళ్లు ఆలస్యమవ్వడానికి అబ్బాయిలు, అమ్మాయిల తల్లిదండ్రుల వ్యవహారశైలి మరో కారణంగా చెప్పవచ్చు. మంచి కట్న కానుకలు ఆశించడం, అమ్మాయి అందంగా ఉండాలని, అణకువగా ఉండాలని కోరుకుంటూ మొదట్లో వచ్చిన సంబంధాలను కాదనుకుంటున్నారు. ఆ తర్వాత వయసు దాటిపోతున్నా అబ్బాయిలకు పెళ్లిళ్లు చేయలేని పరిస్థితి నెలకొంటోందని చెబుతున్నారు. కట్నంతోపాటు బంగారం, భూములు ఇవ్వాలన్న షరతులను అమ్మాయిల తల్లిదండ్రులు ఒప్పుకోవడం లేదు. మరోవైపు అబ్బాయికి ఆస్తి, లక్షల జీతం ఉండాలని అమ్మాయిల తల్లి దండ్రులు ఆశిస్తున్నారు.

రైతులకు, కులవృత్తుదారులకు పిల్లను ఇవ్వం

రైతులకు, కులవృత్తులు చేసుకునే వారికి పిల్లనిచ్చేందుకు ఆడపిల్లల తల్లిదండ్రులు ముందుకు రావడం లేదు. ఉద్యోగాలు చేసే వారి కంటే ఎక్కువ సంపాదన, ఆస్తులు ఉన్నప్పటికీ పిల్లనివ్వడానికి ఆసక్తి చూపించడం లేదు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో అగ్రకుల సామాజిక వర్గానికి చెందిన వారికి 20 ఎకరాల పొలం ఉన్నప్పటికీ పెళ్లి కావడం లేదు. ప్రతి గ్రామంలో 30 నుంచి 50 మంది వరకు పెళ్లి కాకుండా ఉంటున్నారని ఈ మధ్య నిర్వహించిన సర్వేలో తేలింది. దీంతో అబ్బాయిలు తల్లిదండ్రులు వేరే జిల్లాలకు వెళ్లి ఇతర కులాలకు చెందిన అమ్మాయిలను తెచ్చి పెళ్లి చేస్తున్నారు.



అందుబాటులో వీకెండ్ మ్యారేజ్

ఇప్పటివరకు సహజీవనంతో కాలంగడుపుతున్న యువత జీవితాల్లో వీకెండ్ మ్యారేజ్ అనే కాన్సెప్ట్ వైపు వెళుతున్నారు. పెళ్లి చేసుకున్నా, ఇబ్బందులు పడకుండా ఉండేలా వీకెండ్ మ్యారేజెస్ వైపు మొగ్గు చూపుతున్నారు. వీరూ అందరిలాగానే పెళ్లి చేసుకుంటారు. అయితే ఇద్దరూ వారంతంలో మాత్రమే కలిసి ఉంటారు. మిగతా రోజుల్లో ఎవరి జీవితం వారు స్వేచ్ఛగా గడుపుతారు. ఈ పద్ధతిలో ఎవరి ఉద్యోగం, ఎవరి ఖర్చులు వారివే. వారాంతంలో మాత్రం కలిసి ఖర్చులు పంచుకుని ఎంజాయ్ చేస్తారు. పిల్లలు పుడితే ఖర్చులు సగం సగం పెట్టుకుంటారు. వారంలో కేవలం రెండు రోజులు మాత్రమే కలిసి ఉంటారు కాబట్టి, విభేదాలు, గొడవలు ఉండవనే భావనతో ఈ పద్ధతి వైపు వెళ్తున్నారు. ప్రస్తుతం ఈ సంప్రదాయం హైదరాబాద్‌లో ఈ మధ్యనే మొదలైంది.



కష్టతరంగా మార్చేశారు..

గతంలో సులువుగా ఉండే పెళ్లి ప్రక్రియను నేటి తల్లిదండ్రులు, యువత క్లిష్టతరం చేశారు. ఆధునిక జీవనశైలి, వ్యక్తిగత అభిరుచులు, భిన్నమైన ఆర్థిక స్థితిగతులు, కుటుంబాల ఆశలు ఇవన్నీ కలిసి వచ్చి పెళ్లి సంబంధాలపై ప్రభావం చూపుతున్నాయి. పిల్లల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని వారు ఏ రంగంలో స్థిరపడినా ఆలస్యం చేయకుండా పెళ్లి చేస్తే ఎలాంటి సమస్యలు రావు. తల్లిదండ్రులు, పెద్దలు కలిసి వధూవరులతో చర్చించి సమస్యలను వెంటనే పరిష్కరించుకోవాలి.

- మాధవ స్వామి, శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయ ప్రధాన అర్చకులు, బృందావన్‌గార్డెన్స్, గుంటూరు.





● అమ్మాయిలు కొరత అత్యధికం..

అన్ని సామాజికవర్గాల్లో అమ్మాయిల కొరత అత్యధికంగా ఉంది. సంబంధాలు దొరకడం కష్టమవుతున్నది. మా మ్యారేజ్ బ్యూరో తరపున అనేకసార్లు వివాహ పరిచయ వేదికలు ఏర్పా టు చేసినా 112 మంది అబ్బాయిలు, 26 మంది అమ్మాయిలు మాత్రమే తమ పేర్లు నమోదు చేసుకున్నారు. భవిష్యత్‌ను తలుచుకుంటేనే భయం వేస్తోంది.

- ఎమ్ వరలక్ష్మి, వరలక్ష్మీ మ్యారేజ్ బ్యూరో, పాతగుంటూరు.

అంబేద్కర్ జయంతి వేడుకలకు పొన్నెకల్లు సిద్ధం



● నేడు పాల్గొననున్న సీఎం చంద్రబాబునాయుడు



సభా ప్రాంగణంలో స్టేజి ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్, జిల్లా ఇన్‌ఛార్జ్ కలెక్టర్ భార్గవ్ తేజ



జిల్లా ఎస్పీతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్

తాడికొండ, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీ.ఆర్. అంబేద్కర్ జయంతి వేడుకలకు తాడికొండ మండలంలోని పొన్నెకల్లు సిద్ధమైంది. రాష్ట్రస్థాయిలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రానున్న నేపథ్యంలో అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. గుంటూరు జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ భార్గవ్ తేజ, ఎస్పీ సతీష్‌కుమార్, తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ ఆదివారం ఉదయం నుంచి పొన్నెకల్లులోనే ఉండి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

సీఎం పర్యటన ఇలా

సీఎం చంద్రబాబు ఉదయం 10.30 గంటలకు ఉండవల్లిలోని ఇంటి నుంచి హెలీకాప్టర్‌లో బయలుదేరి 10:40 గంటలకు పొన్నెకల్లు చేరుకుంటారు. 10.40 నుంచి 11:05 నిమిషాల వరకు ప్రజలు, అధికారులతో మాట్లాడతారు. 11:05 నుంచి 11:10 గంటలకు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పిస్తారు. 11:10 నుంచి 11:50 గంటల వరకు పొన్నెకల్లులోని అంబేద్కర్ కాలనీలోని ఇళ్లను సందర్శిస్తారు. అనంతరం 12.05 గంటలకు ప్రజావేదిక సభా ప్రాంగణానికి చేరుకుంటారు. 12:05 నుంచి 2:05 గంటల వరకు బహిరంగ సభలో పాల్గొంటారు. అనంతరం 2.30 గంటల వరకు భోజన విరామం తీసుకుంటారు. 2.40 నుంచి 4.10 గంటల వరకు పార్టీ క్యాడర్‌తో సమావేశం అవుతారు. 4:20 గంటలకు హెలీకాప్టర్ ద్వారా ఉండవల్లిలోని ఇంటికి వెళతారు.

---

500 కుటుంబాలు టీడీపీలో చేరిక

u పార్టీ కండువాలు కప్పి స్వాగతించిన ఎమ్మెల్యే కొండయ్య



ఎమ్మెల్యే కొండయ్య సమక్షంలో టీడీపీలో చేరిన దేశాయిపేట వాసులు

దేశాయిపేట(చీరాల), ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : వేటపాలెం మండలం దేశాయిపేట గ్రామానికి చెందిన సుమారు 500 కుటుంబాలు ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య సమక్షంలో టీడీపీలో చేరారు. వారందరినీ ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి స్వాగతించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు చేస్తున్న అభివృద్ధిని చూసి ప్రజలు మంత్రముగ్ధులవుతున్నారని ఎమ్మెల్యే అన్నారు. చల్లా రామయ్య కల్యాణ మండపంలో జరిగిన ఈ కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ అధికారి ప్రతినిధి డాక్టర్ మహేంద్రనాథ్, ఆప్కో చైర్మన్ సజ్జా హేమలత, ఏఎంసీ చైర్మన్ కౌతవరపు జనార్దనరావు, టీడీపీ కూటమి నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.

అన్నదాతకు.. అకాల కష్టం



కోటపాడులో ఆరబోసిన మొక్కజొన్నపై కప్పిన పట్టలపై వర్షపు నీరు

1 జిల్లా వ్యాప్తంగా ఈదురు గాలులతో కూడిన వర్షం
1 కల్లాల్లోనే మొక్కజొన్న, వైట్‌బర్లీ పొగాకు... మామిడి రైతులకు నష్టమే
1 కోతదశలో రబీ వరి.. పంటను కాపాడుకునేందుకు రైతుల తంటాలు
1 బాపట్ల పట్టణంలో పిడుగు... భారీ గాలులు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి) జిల్లాలో ఆదివారం కురిసిన అకాల వర్షాలు అన్నదాతలను తీవ్ర ఆందోళనకు గురిచేశాయి. మధ్యాహ్నం వరకు భగభగలాడిన సూర్యుడు సాయంత్రానికి ఆకాశం మేఘావృతం కావడంతో పాటు భారీగా ఈదురుగాలులు, మెరుపులు, పిడుగులతో పాటు వర్షం పడడంతో పంటను కాపాడుకో వడానికి అన్నదాతలు ఉరుకులు, పరుగులు పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. మార్టూరులో వ డగళ్ల వాన కురవగా, బాపట్ల పట్టణంలో ఈదు రుగాలులతో కూడిన వర్షం పడింది. గాలుల ధాటికి బాపట్ల పట్టణంలోని టీడీపీ కార్యాలయం ఎదురుగా నిర్మాణంలో ఉన్న భవనానికి రక్షణగా వేసిన ఇనుప కంచె కూలిపోయింది. ఆ సమయానికి సమీపప్రాంతలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పినట్లైంది. పట్టణంలోని భీమావారిపాలెంలో కొబ్బరి చెట్టుపై పిడుగు పడడంతో మంటలు చెలరేగాయి. అగ్నిమా పక సిబ్బంది స్పందించి మంటలను అదుపులోకి తెచ్చారు. గాలులు ధాటికి పట్టణంలో దాదాపు రెండు గంటల పాలు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. అకాల వర్షం ధాటికి కల్లాల్లో ఉన్న పంటను కాపాడుకోవడానికి రైతాంగం తీవ్రంగా కష్టపడాల్సి వచ్చింది

రైతుల్లో తీవ్ర ఆందోళన....

కారంచేడు, పర్చూరు, ఇంకొల్లు, బాపట్ల మండలాల పరిధిలో వేల ఎకరా ల్లో వైట్ బర్లీ పొగాకు ఆరబెట్టి ఉంది. అకాల వర్షంతో పొలాల్లో పందిళ్లకు కట్టి ఉంచిన పొగాకును కాపాడుకోవడానికి రైతులు అవస్థలు పడ్డారు. రబీ వరి పంట కోత దశలో ఉంది. ఈదురుగాలులు వీయడంతో పైరు నేల వాలి ధాన్యం రంగుమారే అవకాశం ఉందని అన్నదాతలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మొక్కజొన్న పంట నూర్పిళ్లు ప్రారంభమయ్యాయి. చాలా వరకు దిగుబడులు కల్లాల్లోనే ఉన్నాయి. మొక్కజొన్న తడిస్తే రంగు మారడంతో పాటు మొలకలు వచ్చే ప్రమాదం కూడా ఉందనేది రైతుల ఆవేదనగా ఉంది. ఇప్పటికే మద్దతుధర అందక విలవిలలాడుతున్నామని ఇప్పుడు ఈ అకాల వర్షాల దెబ్బకి బహిరంగ మార్కెట్‌లో ధర మరింత తగ్గించి అడ ుగ ుతార ని రైతాంగం వాపోతోంది. మామిడి రైతులకు కూడా ఈ వర్షం ఆవేదననే మిగిల్చింది. ఈదురుగాలుల ధాటికి మామిడికాయలు రాలడంతో తమకు నష్టాల తప్ప వని మామిడి రైతులు అంటున్నారు. వేరుశ నగ, మినుము, ఉద్యా న పంటలు దాదాపు అన్ని పైర్లపై ఈ అకాల వర్షం ప్రభావం చూపింది. పర్చూరు, ఇంకొల్లు మండలాల పరిధిలో కల్లాల్లో ఆరబోసిన మిర్చిని తరలించడానికి రైతులు నానా అగచాట్లు పడ్డారు



వైట్‌బర్లీ పొగాకును కాపాడుకునేందుకు పర్చూరు రైతుల అవస్థలు



బాపట్ల: భీమవారిపాలెంలో పిడుగుపడి దగ్ధమవుతున్న కొబ్బరి చెట్టు

ఈదురుగాలుల బీభత్సం

జిల్లా వ్యాప్తంగా ఆదివారం సాయంత్రం నుంచి దాదాపు మూడుగంటల పాటు ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. గాలుల ధాటికి బాపట్ల రూరల్ ప్రాంతాలలో వృక్షాలు నేలకొరగగా పలు చోట్ల విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. మార్టూరు ప్రాంతంలో వడగండ్లు పడగా ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. మరో వైపు లక్షల పెట్టుబడితో సాగు చేసిసన పంట చేతికొచ్చే సమయానికి వర్షం వచ్చి నేలపాలు చేసిందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

హార్బర్ సరే.. మా గతేంటి..?

- ఈపూరుపాలెం స్ట్రయిట్‌కట్‌లో ఫిషింగ్ హార్బర్ ఏర్పాటుపై రైతుల ఆందోళన
- అక్కడ నిర్మాణం జరిగితే తాగు, సాగు నీటికి ముప్పు
- పాడిపంటలు దెబ్బతింటాయని ఆగ్రహం
- గవినివారిపాలెం ఎత్తిపోతల వద్ద నిరసన
- ఎమ్మెల్యే దృష్టికి సమస్య



ఈపూరుపాలెం స్ట్రయిట్‌కట్



గవినివారి పాలెం పంపింగ్ స్కీం వద్ద నిరసన తెలుపుతున్న రైతు సంఘాల నాయకులు, రైతులు

చీరాల, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : వాడరేవులో నిర్మాణం జరగాల్సిన ఫిషింగ్ హార్బర్‌ను ఇటీవల జరిగిన అధ్యయనాల కారణంగా ఈపూరుపాలెం స్ట్రయిట్‌కట్‌లో నిర్మించేందుకు సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ ఫర్ కోస్టల్ ఫిషరీస్ సంస్థ నివేదికను అందించింది. వాడరేవు సముద్ర తీరంలో హార్బర్ నిర్మించేందుకు 2014లోనే కేంద్ర ప్రభుత్వం అధ్యయనం చేసి రూ.450 కోట్లు అంచనాలతో సిద్ధం చేసిం ది. కాలక్రమేణా వివిధ కారణాలతో హార్బర్ అటకెక్కింది, అయితే తాజాగా జరిగిన అధ్యయనాలతో అధికారులు ఈపూరుపాలెం స్ట్రయిట్‌కట్‌ను ఆధునీకరణ చేసి పడవల రాకపోకలకు కాలువను విస్తరించి కట్టలు పటిష్టంచేసి జెట్టీలు నిర్మిస్తే రూ.225 కోట్లతోనే హార్బర్ నిర్మా ణం జరుగుతుందని అంచనా వేశారు. అందుకు సంబంధించి ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి.

మండల పరిధిలో ఎత్తిపోతలకు దెబ్బ

ఇదే తరహా ప్రణాళిక సిద్ధమైతే చీరాల మండల పరిధిలోని తోటవారి పాలెం, గవినివారి పాలెం, అక్కయ్యపాలెం పంపింగ్ స్కీంలకు ముప్పు వాటిల్లే అవకాశం ఉంది. స్ట్రయిట్‌కట్ ఆధునికీకరణ జరిగితే సముద్ర జలాల ఉధృతి ఉంటుంది. అలాగే హార్బర్ వ్యర్థాలను భూమిలోకి వదులుతారు. ఈక్రమంలో ఉప్పు నీటి శాతం విస్తరించి స్ట్రయిట్ కట్‌కు అనుసంధానంగా ఉన్న మూడు ప్రభుత్వ, మరో నాలుగు ప్రైవేటు పంపింగ్ స్కీంలు ఉప్పు నీటితో దర్శనమిస్తాయి. ఈ నేపథ్యంలో తాగు, సాగు నీరు అందక రైతులు, ప్రజలు, పశు పక్షాదుల జీవన మనుగడ కష్టం తరంగా ఉంటుంది. ఇది ప్రస్తుతం రైతుల్లో నెలకొన్న ఆందోళన. ఈ మూడు ఎత్తిపోతలకు సంబంధించి సుమారు 12వేల ఎకరాల పంట సాగు భూమి ఉంది. అలాగే అనుబంధంగా 20 గ్రామాలు ఆధారపడి ఉన్నాయి. ఈక్రమంలో వేల సంఖ్యలో ప్రజలు, రైతులు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉంది. అధికారులు మరోమారు పునఃపరిశీలన చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇదిలా వుండగా రైతులు హార్బర్ నిర్మాణం ప్రణాళికలపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈక్రమంలోనే ఆదివారం గవినివారి ఎత్తిపోతల పథకం వద్ద నిరసనకు దిగారు. దీనిపై మరోరెండు రోజుల్లో రైతులు కలెక్టర్‌ను కలువనున్నట్లు తెలిపారు.

సమస్యపై ఎమ్మెల్యేకు విజ్ఞప్తి

హార్బర్ అంశం తెరపైకి రావడంతో తిరుమల తిరుపతి పర్యటనలో ఉన్న ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య దృష్టికి ఇప్పటికే రైతులు తీసుకువెళ్లారు. ఆదివారం నియోజకవర్గ క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గ అధికార ప్రతినిధి డా.మహేంద్రనాథ్‌ను రైతు సంఘాల నాయకులు, రైతులు కలిసి సమస్యను వివరించారు. హార్బర్‌ను కొత్త ప్రాంతంలో నిర్మిస్తే పంట పొలాలు దెబ్బతింటాయని, గతంలో ఎంపిక చేసినచోటే నిర్మించాలని కోరారు. దీంతో డా.మహేంద్రనాథ్ స్పందిస్తూ రైతులకు, ప్రజలకు నష్టం వాటిల్లే అవకాశం ఉంటే వెంటనే సమస్యను ముఖ్యమంత్రి, మారిటైం బోర్డు అధికారుల దృష్టికి సమస్యను తీసుకువెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

హార్బర్ నిర్మిస్తే.. మా పరిస్థితి ఏమిటి?



హార్బర్ నిర్మాణానికి వ్యయం తగ్గుతుందని ఆలోచించే పాత చోట కాకుండా కొత్త ప్రాంతంలో నిర్మిస్తే మా బతుకులు ఏమి అవ్వాలి. ఇప్పటికే డీపీఆర్‌లు సిద్ధం చేసినట్లు సమాచారం ఉంది. నిర్మాణం జరిగితే రైతులకు తీవ్ర నష్టం తప్పదు. అధికారులు ఆ నిర్ణయాన్ని విరమించుకోవాలి.

- నక్కల లక్ష్మణ, గవినివారిపాలెం పంపింగ్ స్కీం అధ్యక్షుడు

తాగు, సాగు నీటికి ఇబ్బందులు



హార్బర్ నిర్మాణం జరిగితే తాగు, సాగు నీటికి ఇబ్బందులు తలెత్తుతాయి. దీంతో ప్రజలు, పశు పక్షాదులు జీవించే పిరిస్థితి ఉండదు. అంతా నష్టపోయి ప్రజలు, రైతులు వలసబాట పట్టాల్సిన దుస్థితి ఏర్పడుతుంది. నిర్మాణాన్ని ఒప్పుకోం.

- గవిని శ్రీనివాసరావు, తోటవారి పాలెం పంపింగ్ స్కీం అధ్యక్షుడు

హార్బర్‌తో అనర్థమే



ఈపూరుపాలెం స్ట్రయికట్‌లో హార్బర్ నిర్మాణం అనర్థమే. మేమంతా చిన్న, సన్నకారు రైతులం. కొందరయితే పది, ఇరవై సెంట్లలో ఆకు కూరలు, కూరగయాలను పండించి జీవనం సాగిస్తున్నారు. హార్బర్ వస్తే ఇక పంటలు ఉండవు. అందరూ పొలాలను విడిచి వలస పోవాలి.

- జీ శ్రీనివాసరావు, అక్కయ్యపాలెం పంపింగ్ స్కీం అధ్యక్షుడు



ముప్పవరంలో కాంతమ్మ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న మంత్రి గొట్టిపాటి

మంత్రి గొట్టిపాటి పరామర్శలు

పంగులూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదివారం ముప్పవరం గ్రామంలో పర్యటించారు. గ్రామానికి చెందిన కుక్కపల్లి భాస్కరరావు తల్లి కాంతమ్మ శనివారం అనారోగ్యంతో మృతి చెందగా, ఆమె చిత్రపటం వద్ద నివాళి అర్పించిన మంత్రి గొట్టిపాటి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. గత నెలలో ముప్పవరం నుంచి ఆటోలో రావినూతల కూలి పనులకు వెళ్తూ రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మరణించిన కొమ్ము సలోమి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఇదే ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స అనంతరం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న దాసరి పుష్పాలు, కొమ్ము పాపమ్మను పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు రావూరి రమేష్, ఏఎంసీ మాజీ చైర్మన్ కుక్కపల్లి సుబ్బారావు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు కేవీ సుబ్బారావు, ధూళిపాళ్ల రామచంద్రప్రసాద్, కుక్కపల్లి ఏడుకొండలు, పంగులూరు డి.సి. చైర్మన్ కుక్కపల్లి ఆంజనేయులు, అల్లంనేని బ్రహ్మానందస్వామి, నార్నె సుబ్బారావు, జగన్మోహన్, దాసరి నాగేశ్వరరావు, జె.కె.సి, చిన్న, కాజా, గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

అద్దంకి : కలవకూరుకు చెందిన లచ్చిబోయిన నాగేశ్వరరావు ఇటీవల ప్రమాదవశాత్తు గాయపడి ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటుండగా ఆదివారం మంత్రి గొట్టిపాటి పరామర్శించారు. ఆయనవెంట టీడీపీ నాయకులు పరమేష్ ఉన్నారు.

నేడు మంత్రి రవికుమార్ పర్యటన

అద్దంకి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సోమవారం పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. ఉదయం 9 గంటలకు వెంపరాల, 9-45 గంటలకు అద్దంకి పట్టణంలోని నంబూరివారిపాలెం, 10 గంటలకు బంగ్లా రోడ్డులో అంబేడ్కర్ విగ్రహాలకు నివాళులర్పించనున్నారు. 11 గంటలకు రామాయపాలెంలో జరిగే కార్యక్రమాలకు హాజరుకానున్నారు. మధ్యాహ్నం 12-30కి ఇంకొల్లు మండలం భీమవరంలో జరిగే కార్యక్రమానికి హాజరవుతారు.

నేడు ఎమ్మెల్యే ఏలూరి పర్యటన

పర్చూరు : ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సోమవారం నియోజకవర్గంలో పర్యటించనున్నట్లు ఆదివారం క్యాంపు కార్యాలయం సిబ్బంది ఒక ప్రకటనలో తెలిపారు.

ఘనంగా మట్టల ఆదివారం వేడుక

ర్యాలీ నిర్వహించిన క్రైస్తవులు, చిన్నారులు

చీరాల, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : పలు చర్చిలు, వీధులలో క్రైస్తవులు, చిన్నారులు మట్టల ఆదివారం (పామ్) వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా మట్టలకు పూలతో అలంకరించి ర్యాలీ నిర్వహించారు. గుడ్ ఫ్రైడేకు వారం ముందు క్రైస్తవులు మట్టల ఆదివారాన్ని జరుపుకుంటారు. శ్రమల కాలం (లెంట్ డేస్)లో క్రీస్తు ఏసును రక్షకుడిగా అంగీకరిస్తూ ప్రజలు స్వీకరించిన రోజుగా మట్టల పండుగను జరుపుకుంటారు. మతబోధకులు ప్రార్థనలు చేశారు.

యద్దనపూడి : యద్దనపూడి మండలంలోని పూనూరులో లూథరన్ చర్చిలో ఆదివారం మట్టల పండుగను వేడుకగా జరుపుకున్నారు. సంఘ కాపరి రాజేష్ ఆధ్వర్యంలో సండే స్కూలు పిల్లలు రంగురంగుల పూలతో అలంకరించిన మట్టలతో ప్రదర్శన, కోలాటం నిర్వహించారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు, సండే స్కూలు పిల్లలు పాల్గొన్నారు.

అద్దంకి : మట్టల ఆదివారాన్ని క్రైస్తవులు వేడుకగా జపుకున్నారు. పట్టణంలోని గరటయ్య కాలనీలో బిలీవర్స్ ఆగ్రస్ చర్చి ఆధ్వర్యంలో మట్టల ఆదివారం నిర్వహించారు. పాస్టర్ కాంతారావు, కరుణజ్యోతి, రతనపాల్, ఇజ్రాయిల్ పాల్గొన్నారు.

రోడ్డుపై బోల్తాపడిన గడ్డి ట్రాక్టర్

గంటల తరబడి నిలిచిన వాహనాలు

పూసపాడు(పర్చూరు), ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) :పర్చూరు - ఇంకొల్లు పాతమద్రాస్ రోడ్డులోని పూసపాడు సమీపంలో ఆదివారం గడ్డి ట్రాక్టర్ బోల్తాపడింది. దీంతో ఎక్కడ వాహనాలు అక్కడే గంటల తరబడి నిచిపోయాయి. ఒక్క పక్క ఎండ, మరోపక్క ట్రాఫిక్ సమస్యతో ప్రయాణికులు నరకం చూశారు. పోలీసులు చేరుకొని ట్రాక్టర్‌ను తొలగించి వాహనరాకపోకలకు అవకాశం కల్పించారు. పర్చూరు - ఇంకొల్లు రోడ్డు అధ్వానంగా ఉంది. పెద్ద పెద్ద గుంతలు, కంకర రాళ్లతో ప్రయాణాలు కష్టతరంగా మారాయి. దీంతో ఈ రోడ్డులో తరచూ వాహనాలు ప్రమాదానికి గురవుతున్నాయి.

బస్సును ఢీకొన్న లారీ

దాని వెనుక మరో లారీ .. డ్రైవర్, క్లీనర్‌కు తీవ్ర గాయాలు

బల్లికురవ, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : గొర్రెపాడు జంక్షన్ రోడ్డులో ఆదివారం ముందు వెళుతున్న అర్టీసీ బస్సును వెనక నుంచి వస్తున్న లారీ ఢీకొట్టింది. వెంటనే వెనక ఉన్న మరో లారీ ముందు ఉన్న లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్, క్లీనర్‌కు తీవ్రగాయాలయ్యాయి. అందిన సమాచారం మేరకు సంతమాగులూరు వైపు నుంచి అద్దంకి వైపు వెళుతున్న ఆర్టీసీ బస్సు గొర్రెపాడు జంక్షన్ వద్దకు వచ్చేసరికి కొంత నెమ్మదిగా ఆగడంతో వెనక వస్తున్న లారీ బస్సును ఢీకొట్టింది. దాని వెనుక వస్తున్న లారీ ముందున్న లారీని ఢీకొట్టింది. ఈప్రమాదంలో బస్సు వెనక భాగం దెబ్బతినగా, లారీ ముందు భాగం దెబ్బతింది. లారీ డ్రైవర్ నక్కా మొషే, క్లీనర్ దాసరి నారాయణకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించి అనంతరం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.



అవార్డు గ్రహీతలతో యువనేత గౌరీ అమర్‌నాథ్, ఫౌండేషన్ అధ్యక్షురాలు నాగమణి, చైర్మన్ అశ్విని

సామాజిక సేవలతో ఆనందం

చీరాల, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : సామాజిక సేవలతో ఆనందం ఉంటుందని టీడీపీ యువనాయకులు గౌరీ అమర్‌నాథ్ అన్నారు. వివిధ ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో సేవలందిస్తున్న 120 మందికి కృతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో జ్ఞాపికలతో సన్మానించారు. ఆదివారం రోటరీ కమ్యూనిటీ భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో పశు సంవర్థక శాఖ జేడీ డా.బేబీరాణి, చినగంజాం తహసీల్దార్ ప్రభాకరరావు, మెరైన్ సీఐ సాంబశివరావు, వన్‌టౌన్ సీఐ సుబ్బారావు, డా.అమృతపాణి పాల్గొన్నారు.

నేడు భీమవరంలో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ

ఇంకొల్లు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని భీమవరం గ్రామంలో ఏర్పాటు చేసిన తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు విగ్రహాన్ని సోమవారం ఉదయం 10 గంటలకు ఆవిష్కరించనున్నారు. పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా జరగనున్న ఎన్టీఆర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంత్రులు గొట్టిపాటి రవికుమార్, అనగాని సత్యప్రసాద్, డోలా బాలవీరాంజనేయస్వామి, ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, మారిటైం బోర్డ్ చైర్మన్ దామచర్ల సత్య, బాచిన చెంచుగరటయ్య హాజరవుతారని టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు నాయుడు హనుమంతరావు తెలిపారు. కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ప్రతిభను వెలికితీసేందుకే పోటీ పరీక్షలు



మాట్లాడుతున్న రాజశేఖర్

మేదరమెట్ల, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల్లో ప్రతిభను వెలికి తీసేందుకో పోటీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు కిరణ్‌జ్యోతి రీసెర్చి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కందేపు రాజశేఖర్ తెలిపారు. ఆదివారం ధైవాలరావూరులోని కిరణ్‌జ్యోతి రీసెర్చి ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పలు పోటీ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రా మంతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో డిగ్రీ, ఇంజనీరింగ్ చదివిన విద్యార్థులకు పోటీ పరీక్షలకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. వారికి అవసరమైన పుస్తకాలు, కంప్యూటర్లను గ్రంథాలయంలో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. కిరణ్‌జ్యోతి స్కిల్ డెవలప్‌మెంట్ కార్యాలయం వద్ద నిర్వహించిన పోటీల్లో సీనియర్స్ విభాగంలో కోటేశ్వరరవు, జ్యోతిప్రసన్న, ముఫీద, జూనియర్స్ విభాగంలో జయశ్రీ, జనని, కావ్య మొదటి స్థానం సాధించారు. అనంతరం గ్రామంలో మజ్జిగ చలివేంద్రాన్ని మెక్ ప్రాజెక్ట్ డైరెక్టర్ సజ్జా విజయలక్ష్మి ప్రారంభించారు. కిరణ్‌జ్యోతి ఫౌండేషన్ చేసిన అభివృద్ధి పనులను సర్పంచ్ కోనూరి శీతామహలక్ష్మి తెలిపారు. కార్యక్రమంలో కోటేశ్వరమ్మ, సుభాషిణి, కోటేశ్వరరావు, బాలు, ప్రియదర్శిని పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

బల్లికురవ, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : ఉన్నత పాఠశాలలో 1979 - 1980లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం రాత్రి జరిగింది. అప్పట్లో టెన్త్ చదివిన 35 మంది ఒక్కచోట కలిశారు. ఒకరికొకరు యోగ క్షేమాలను తెలుసుకున్నారు. ఈ కలయికకు కృషి చేసిన చెన్నుపల్లి గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థి గుంటుపల్లి మురళిని అందరూ అభినందించారు. అనంతరం ఇంటూరి శంకరరావు మాస్టారిని సత్కరించారు. ఈ సందర్భంగా పాఠశాలకు ఇన్వెర్టర్‌ను అంద జేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం హనుమంతురావు, ఉపాధ్యాయులు డేవిడ్‌పాల్, పార్థసారథి పాల్గొన్నారు.



ఆత్మీయ కలయికలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

అకాల వర్షం... రైతుల్లో కలవరం







మక్తేశ్వరంలో ధాన్యం, మొక్కజొన్న తడవకుండా పట్టలు కప్పుతున్న రైతులు, పంగులూరులో పొగాకు మండెలపై పరదాలు కప్పుతున్న రైతులు, ఇసుకదర్శిలో ఇంటివద్ద ఆరబెట్టిన మొక్కజొన్న విత్తనాలపై పరదా కప్పుతున్న రైతు

- పెద్ద ఎత్తున గాలులు
- విరిగిన స్తంభాలు
- విద్యుత్ సరఫరాకు అంతరాయం

అద్దంకి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : అకాల వర్షంతో రైతులు ఉరుకులు పరుగులు తీసారు. ఆదివారం పగలంతా సెగలు కక్కిన ఎండతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి కాగా, సాయంత్రం 4 గంటల సమయానికి ఒక్కసారిగా ఆకాశం మేఘావృతం అయింది. ఒక్క సారిగా పెద్ద ఎత్తున గాలులు ప్రారంభమై వర్షపు జల్లులు పడ్డాయి. దీంతో మొక్కజొన్న, మిర్చి కల్లాలలో ఆరబెట్టగా వాటిని కాపాడుకునేందుకు రైతులు ఉరుకులు పరుగులు తీసారు. దీంతో కొంత మేర తడవడంతో రైతులు ఆందోళన చెందారు. ప్రధానంగా బల్లికురవ, సంతమాగులూరు, అద్దంకి తదితర మండాలలో గాలులు, వర్షం ఉంది. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. పట్టణంలో సైతం సరఫరా నిలిచిపోయింది. మణికేశ్వరం, వెంపరాల తదితర గ్రామాల్లో స్తంభాలు విరిగాయి. బల్లికురవ మండలం చెన్నుపల్లిలో మొక్కజొన్న పడిపోయింది. పొలాల్లో ఉన్న మిర్చి, జొన్న గాలులకు తీవ్రంగా నష్టం వాటిల్లే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

పంగులూరులో గాలి బీభత్సం

పంగులూరు : ఆదివారం వీచిన ఈదురు గాలులు, కురిసిన వర్షం రైతులను పరుగులు పెట్టించింది. ఎండేందుకు కల్లాలలో ఆరబోసిన మొక్కజొన్న, మిర్చితో పాటు ఎండేందుకు పందిళ్లకు కట్టిన పొగాకు తాళ్లు, మండెలు వేసి ఉన్న బర్లీ పొగాకు తడవకుండా పరదాలు కప్పేందుకు రైతులు పరుగులు తీశారు. నల్ల బర్లీ కొనుగోలు మొదలవక సతమతమవుతున్న రైతులకు ఆదివారం వీచిన ఈదురు గాలులు, అకాల వర్షంతో తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఆరు గా లం శ్రమించి పండించిన మొక్కజొన్న కోత అనంతరం ఆరబోసి అమ్ముకునేందు కు సిద్ధమవుతున్న తరుణంలో వర్షం కొంప ముంచుతుందని రైతులు వాపోతున్నారు. కొండమూరు, ముప్పవరం, కోటపాడు, రేణంగివరం, బైటమంజులూరు, కొండ మంజులూరు పరిసర గ్రామాలలో విస్తారంగా మొక్కజొన్న సాగు చేపట్టారు. కొండమూరులో 11వందల ఎకరాలలో రైతులు మొక్కజొన్న సాగు చేశారు. నిలువుమీద ఉన్న జొన్న పైరు నేల వాలిందని రైతులు ఆవేదన చెందుతున్నారు. మండెల మాటున, పందిళ్లకు వేలాడుతున్న నల్లబర్లీ పొగాకు ఈదురు గాలులు, అకాల వర్షం తమ కొంప ముంచుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈదురు గాలులకు అలవలపాడు గ్రా మ ప్రధాన కూడలిలో, కొండమూరులో విద్యుత్ తీగలు తెగిపోయి సరఫరా ని లిచిపోగా పునరుద్ధరణకు సిబ్బంది ప్రయత్నం చేస్తున్నారు.

చినగంజాం : అకాల వర్షంతో మండల పరిధిలోని పొగాకు, మిర్చి, ఉప్పు రైతులు అందోళన చెందుతున్నారు. ఆదివారం ఉరుములు, ఈదురుగాలులతో వర్షం కురిసింది. మండలంలోని సంతరావూరు, గొనసపూడి ప్రాంతాల్లో మిర్చి, పొగాకు వర్షానికి దెబ్బతింటాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మిరపకాయలు తాలుకాయిలుగా మారుతాయిని చెప్తున్నారు. పందిళ్లపై ఉన్న పొగాకు వర్షానికి తడిస్తే నల్లగా మారుతుందని, నల్లగా మారిన పొగాకును ఎవరూ కొనుగోలు చేయరని అంటున్నారు. చినగంజాం, పెద గంజాం, రాజుబంగారుపాలెం, కొత్తపాలెం, సోపిరాల ఉప్పు మడులలో వర్షపునీరు చేరింది. దీంతో ఉప్పు కరిగిపోతుందని ఆవేదన చెందుతున్నారు.

పర్చూరు : అకాల వర్షంతో పంటలను కాపాడుకునేందుకు రైతులు పరుగులు తీశారు. వేల ఎకరాల్లో సాగుచేసుకున్న వైట్‌బర్లీ, మిర్చి పొలాల వద్దే ఉండడంతో తడిసిపోతుందని ఆందోళనకు గురయ్యారు. వాన కురిస్తే నష్టపోతామని ఆవేదనవ వ్యక్తం చేస్తున్నారు. పర్చూరు వ్యవసాయ సబ్‌డివిజన్‌లో 40వేల ఎకరాల్లో వైట్‌బర్లీ, 15వేల ఎకరాల్లో మిర్చిని రైతులు సాగు చేశారు.

మార్టూరు : ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. పొలంలో మొక్కజొన్న కోసిన రైతులు ఆందోళనకు గురయ్యారు. కోలలపూడి, జొన్నతాళి, ఇసుకదర్శి తదిర గ్రామాలలో మొక్కజొన్నను కల్లాల్లో ఆరబెట్టారు. కొంతమంది విత్తనాలను ఇంటి వద్ద ఆరబెట్టారు. వాటిని కాపాడుకునేందుకు రైతులు పట్టలు కప్పుకున్నారు. 15 నిమిషాల తర్వాత వర్షం ఆగడంతో ఊపిరిపీల్చుకున్నారు.

ఘనంగా సీతారాముల వసంతోత్సవం

చినగంజాం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : కన్యకాపరమేశ్వరి అమ్మవారి మందిరం వద్ద సీతారాముల వసంతోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. కన్యకాపరమేశ్వరి అమ్మవారి మందిరంలో శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా సీతారాముల కల్యాణాన్ని నిర్వహించి, ఎనిమిదవ రోజైన ఆదివారం స్వామి వారికి అమ్మవారి మందిర కమిటీ సభ్యులు, మహిళా భక్తులు వసంతోత్సవాన్ని జరిపారు. ఉత్సవ విగ్రహాలను విశేషంగా అలంకరించి పురవీధులలో జై శ్రీరామ్ నామ స్మరణలతో ఊరేగించారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు.

వైభవంగా చెన్నకేశవ స్వామి కల్యాణోత్సవం

బల్లికురవ, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : కొణిదెనలోని చెన్నకేశవ స్వామి వారి కల్యాణోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. పూజారి అయిన వోలు శోభనాచార్యులు కళ్యాణ వేడుకలను నిర్వహించారు. దేవాలయ కార్యనిర్వహణ అధికారి శిరీష కార్యక్రమంలో పాల్గొన్నారు.

360 మందికి వైద్య పరీక్షలు

పర్చూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : పర్చూరులోని బీఏఆర్ అండ్ టీఏ జూనియర్ కళాశాలలో చిన్నయామిషన్ నిర్వహణలో శంకర్ కంటి అసుపత్రి పెదకాకాని, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 360 మందికి పరీక్షలు చేశారు. విద్యాదాత కీర్తిశేషులు పాబోలు రాధాకృష్ణమూర్తి, ఇందిరాదేవి జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరంలో 200 మందికి శస్త్రచికిత్స అవసరమని వైద్యులు నిర్ధారించారు. రోగులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేశామని నిర్వాహకులు పాబోలు ఉదయభాస్కర్, ధర్మపత్ని గిరిజా కుమారి తెలిపారు. కార్యక్రమంలో రొటేరియన్‌లు ప్రసాద్, రమేష్ చంద్ర, శ్రీనివాసరావు, గిరినాధరెడ్డి, చిన్మయామిషన్ ప్రతినిధులు అజయ్‌బాబు, లింగేశ్వరరావు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు స్వామివారి నామాల ప్రతిష్ఠ

బల్లికురవ, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : బల్లికురవ గ్రామస్థుల సమష్టి కృషితో వెంకటేశ్వరస్వామి శంకు చక్రాలు, నామాల ప్రతిష్ఠ కార్యక్రమం సోమవారం ఉదయం జరగనుంది.

ఉష్ణోగ్రత వివరాలు

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
నెల్లూరు	38.9	29.5
కావలి	37	28
ఆత్మకూరు	39	28
ఉదయగిరి	39	26
కందుకూరు	38	28

జై భజరంగభళీ..!!

వైభవంగా హనుమాన్ శోభాయాత్ర ● కాషాయ జెండాలతో బైక్ ర్యాలీ





జై శ్రీరామ్... జై హనుమాన్.. జై భజరంగభళీ నినాదాలతో ఆదివారం సాయంత్రం నెల్లూరు నగరం మారుమోగింది. నగరంలో హనుమాన్ శోభాయాత్ర వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన బైక్ ర్యాలీలో పెద్ద సంఖ్యలో హిందువులు కాషాయ జెండాలు చేపట్టి ఉత్సాహంగా పాల్గొన్నారు. ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం నుంచి తడికల బజార్‌లోని ఆర్‌ఎస్‌ఆర్‌ఎం పాఠశాల వరకు ర్యాలీ సాగింది. శ్రీరాముడు, హనుమంతుని విగ్రహాలు యాత్రలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. నగరంతోపాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి కూడా భక్తులు ర్యాలీకి తరలివచ్చారు. ఈ సందర్భంగా హిందూ చైతన్య వేదిక రాష్ట్ర నాయకులు మాట్లాడుతూ హనుమంతుడు లంక దహనం అనంతరం సముద్రంలో దూకి పునరుజ్జీవం పొందిన రోజును హనుమ విజయోత్సవంగా జరుపుకుంటామని చెప్పారు. హనుమంతుని వ్యక్తిత్వాన్ని, ధీరత్వాన్ని, సమయస్ఫూర్తిని, కార్యదక్షతను యువతలో పెంపొందించాలనే ఉద్దేశంతో ప్రతి సంవత్సరం హనుమ భక్త శోభాయాత్ర నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ ర్యాలీలో రాజకీయ పార్టీలు, కులాలకు అతీతంగా అందరూ పాల్గొంటారని తెలియజేశారు. హిందూ చైతన్య వేదిక రాష్ట్ర సహ అధ్యక్షుడు కోడూరు జయరాం, రాష్ట్ర న్యాయవాద విభాగం అధ్యక్షుడు నేలపాటి నాగశ్రీనివాస్, రాష్ట్ర కో ఆర్డినేటర్ పీజీ మహేష్, రాష్ట్ర ప్రచార విభాగం అధ్యక్షుడు కాకు మురళీరెడ్డి, జిల్లా నాయకులు టీ సాయిశ్రీనివాస్, ఆచ్చి రామాంజనేయులు, సోలేటి వెంకటేశ్వర్లు, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా, ఈ కార్యక్రమం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు.

- నెల్లూరు (సాంస్కృతికం,ఆంధ్రజ్యోతి)

గాలివాన బీభత్సం

● విరిగిన పడిన చెట్ల కొమ్మలు, ఫ్లెక్సీలు ● పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం

● పండ్ల తోటల రైతులకు నష్టం



కందుకూరు బస్టాండ్ సెంటర్‌లో విరిగిపడిన చెట్ల కొమ్మలను తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

కందుకూరు, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా అక్కడక్కడా ఆదివారం సాయంత్రం గాలివాన బీభత్సం సృష్టించింది. ఒక్కసారిగా దట్టమైన మేఘాలు ఆవహించి, వెంటనే పెనుగాలులు వీచాయి. చిరుజల్లులకే వర్షం పరిమితం కాగా గాలితో ప్రజలు గందరగోళానికి గురయ్యారు. గాలిప్రభావంతో మోటారుసైకిళ్లు కిందపడిపోయి వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. కందుకూరులోని అనేక ప్రాంతాలలో చెట్లకొమ్మలు విరిగిపడి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని భావిస్తున్నారు. కందుకూరు ప్రాంతంలో ప్రస్తుతం నువ్వు కోతలు, నూర్పిళ్లు, మిర్చి ఆఖరికోతలు జరుగుతున్నాయి. కల్లాలో ఉన్న నువ్వుకువ్వలు నేలపాలయ్యాయని రైతులు వాపోతున్నారు. అలాగే పలుచోట్ల మిర్చికి కూడా నష్టం జరిగి ఉంటుందని భావిస్తున్నారు.

● నేలకొరిగిన ఫ్లెక్సీలు

కావలి : పట్టణంలో ఆదివారం సాయంత్రం ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై చీకట్లు కమ్ముకుని ఎర్రదుమ్మురేపుతూ గాలులు వీచాయి. దీంతో ఫ్లెక్సీలు రోడ్లపై పడి పోవటంతో ప్రజలు తీవ్ర అసౌకర్యాలకు గురయ్యారు. స్థానిక పొట్టి శ్రీరాములు విగ్రహం సెంటర్‌లో కట్టిన ఓ ఫ్లెక్సీ రోడ్డుపై వెళుతున్న ఆటోపై పడింది. అయితే ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

● ఉదయగిరి రూరల్ : ఉదయగిరి, వరికుంటపాడు మండలాల్లోని పలు గ్రామాల్లో ఆదివారం ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. ఈదురుగాలులకు ద్విచక్ర వాహనదారులు దుమ్ముధూళితో నిండిపోవాల్సి వచ్చింది. అలాగే విద్యుత్ సరఫరాలోనూ అంతరాయం ఏర్పడింది.

● దుత్తలూరు (ఉదయగిరి) : మండలంలోని పలు గ్రామాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన ఓ మోస్తరు వర్షం కురిసింది. ఈదురు గాలులతో పండ్లతోటల రైతులు తీవ్రంగా నష్టపోవాల్సివచ్చింది.

● బుచ్చిరెడ్డిపాళెం : మండలంలో ఆదివారం సాయంత్రం ఈదురు గాలులు బీభత్సం సృష్టించాయి. పట్టణంలో ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు ఊడి కింద పడిపోయాయి.



కావలిలో ఆటోపై పడిన ఫ్లెక్సీ



నెల్లూరులో ఈదురుగాలులు

రేపటి నుంచి వేట నిషేధం

2నెలలపాటు కడలిలోకి మత్స్యకారులకు నో ఎంట్రీ! ● వేట విరామభృతి రూ.20వేలకు పెంపు

12,440 కుటుంబాలను గుర్తించిన అధికారులు ● త్వరలో లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో జమ



తూపిలిపాళెం తీరంలో పడవను ఒడ్డుకు చేర్చుతున్న మత్స్యకారులు

కావలి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : సముద్రంలో చేపలు గుడ్లు పెట్టే సీజన్ కావడంతో మంగళవారం నుంచి జూన్ 14వ తేదీ వరకు వేట నిషేధం కొనసాగనుంది. 60 రోజులపాటు మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లకుండా రాష్ట్ర ప్రభుత్వం నిషేధం విధించింది. వేట విరామ సమయంలో మత్స్యకార కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు పడకుండా భృతిని అందజేయనుంది. జిల్లావ్యాప్తంగా వేటపై ఆధారపడి జీవించే మత్స్యకార కుటుంబాలు 12,440 ఉన్నట్లు అధికారులు గుర్తించారు. గత వైసీపీ హయాంలో భృతి కింద రూ.10 వేలు ఇస్తూ అది కూడా వివిధ కొర్రీలతో అందరికీ ఇవ్వకుండా అప్పటిపాలకులు ఇబ్బంది పెట్టారు. అయితే, ప్రస్తుత కూటమి ప్రభుత్వం వేట విరామ భృతిని రూ.20 వేలకు పెంచడంతో మత్స్యకారుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ఈ మేరకు జిల్లాకు రూ.24.88 కోట్లు రానున్నాయి. మత్స్య శాఖ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి పంపడంతో అతిత్వరలోనే ఆ నిధులు కూడా మత్స్యకారుల బ్యాంకు ఖాతాలలో జమకానున్నాయి.

● భృతి అందేదెప్పుడు!?

వేట విరామం ప్రారంభమైనప్పటి నుంచి మత్స్యకారులకు జీవనోపాధి కష్టతరంగా ఉంటుంది. దీంతో ప్రభుత్వం అందించే భృతి కోసం మత్స్యకారులు ఎదురు చూస్తుంటారు. గత ప్రభుత్వం సక్రమంగా ఇవ్వకపోవటంతో ఈ ప్రభుత్వంలోనైనా అర్హులందరికీ అందుతుందా లేదా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలో సుమారు 18 వేల మత్స్యకార కుటుంబాలు ఉండగా వారిలో వివిధ పథకాలు పొందే వారు కాకుండా కేవలం సముద్ర వేటపైనే ఆధారపడి జీవించే వారిని ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ అయిన బోట్ల ద్వారా 12,440 కుటుంబాలను గుర్తించారు. మత్స్యకార కుటుంబాలలో పెన్షన్, ఇతరత్రా ప్రభుత్వ పథకాలు పొందని ఆన్‌లైన బోట్ల రిజిస్ట్రేషన్ అయిన మత్స్యకారులను మాత్రమే వేట విరామ భృతికి అర్హులుగా ప్రభుత్వం గుర్తించింది.

అందరికీ భృతి ఇవ్వాలి



అర్హులైన ప్రతి మత్స్యకారుడికి వేట విరామం అందచేయాలి. గత ప్రభుత్వంలో 20 శాతం మందికి మాత్రమే ఇవ్వడంతో ఆ ప్రభుత్వంపై మత్స్యకారులలో వ్యతిరేకత వచ్చింది. ఈ ప్రభుత్వం రూ.20వేలు పెంచటం హర్షణీయమైనా కొర్రీలు పెట్టకుండా అందరికీ ఇచ్చినప్పుడే న్యాయం జరుగుతోంది.

- వాయిళ్ల శ్రీనుబాబు,
మత్స్యకారసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు

టీడీపీలోనే నగదు రూపేణా భృతి



గత కాంగ్రెస్ ప్రభుత్వంలో వేట విరామం భృతి కింద కేవలం బియ్యం మాత్రమే ఇచ్చేవారు. టీడీపీ ప్రభుత్వంలోనే వేటవిరామం కింద నగదు ఇవ్వడం ప్రారంబించారు. రూ.20 వేలు కూడా టీడీపీ ప్రభుత్వమే పెంచింది. అయితే ఆ భృతిని అర్హులైన ప్రతి మత్స్యకారుడికి అందజేస్తే జీవనోపాధికి సరిపోతుంది.

- బుచ్చింగారి బాబు,
మత్స్యకారుడు, ఇస్కపల్లి



పడవలను ఒడ్డుకు చేర్చుకుని వలలను జాగ్రత్త పరుచుకుంటున్న మత్స్యకారులు

రీసర్వే చేసి ఇస్తేనే న్యాయం



రీసర్వే చేయకుండా గత ప్రభుత్వం రూపొందించిన జాబితా ప్రకారం భృతి ఇవ్వాలనుకోవ డం సరికాదు. గత వైసీపీ ప్రభుత్వంలో నాయకుల అనుచరులకు తప్ప మిగతావారికి భృతి ఇవ్వలేదు. రీసర్వే చేసి అర్హులందరికీ ఇవ్వాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. పాత జాబితా ప్రకారం ఇస్తే అర్హులకు అన్యాయం జరిగే అవకాశాలు ఉన్నాయి.

- సోమయ్యగారి రమణ,
రామచంద్రాపురం

తీర ప్రాంతం : 104 కి.మీ | మండలాలు : ఉలవపాడు, కావలి రూరల్, అల్లూరు, బోగోలు, కొడవలూరు, విడవలూరు, టీపీగూడూరు, ఇందుకూరుపేట, ముత్తుకూరు | వేట నిషేధ సమయం : ఏప్రిల్ 14 నుంచి జూన్ 14 వరకు | మత్స్యకార కుటుంబాలు : 18వేలు | గుర్తించినవి : 12,440 | జిల్లాకు అందే నిధులు : రూ.24.88 కోట్లు

'ఆరోగ్యశ్రీ'లో 'ఆసరా' అందనంటోంది!

ఆర్నెళ్లుగా రోగులకు అందని నగదు

జిల్లాలో రూ.6 కోట్ల వరకు బకాయిలు

మే నుంచి అందజేస్తామంటున్న అధికారులు



నెల్లూరు (వైద్యం), ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ వైద్యసేవ పథకం ద్వారా శస్త్రచికిత్సలు చేయించుకుని ఇంట్లో విశ్రాంతి తీసుకుంటూ వైద్యసేవలు పొందుతున్న వ్యాధి గ్రస్థులకు 'ఆసరా' అందనంటోంది. వారు నెలలుగా బకాయిలు పేరుకుపోవడంతో బాధితులు గగ్గోలు పెడుతున్నారు. 2019 డిసెంబరు 1వ తేదీన అప్పటి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి వైఎస్సార్ ఆరోగ్య ఆసరా పథకాన్ని ప్రవేశపెట్టారు. ప్రతి ఏడాది 24 వేలకుపైగా ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులలో శస్త్రచికిత్సలు జరుగుతుంటాయి. శస్త్రచికిత్సల అనంతరం విశాంత్రి సమయంలో వైద్య చికిత్సలలో మందులతోపాటు ఇతర ఆదాయ వనరుల కింద నెలకు సరాసరి రూ.5వేల వరకు ఆర్థికసాయం అందుతుంది. అలాగే, కాళ్లు, చేతులు విరిగిన వారు మూడు నెలలు ఇంట్లోనే విశ్రాంతి తీసుకోవాల్సి ఉంటుంది. అలాంటి వారికి వైఎస్సార్ ఆరోగ్య ఆసరా పథకం ద్వారా రూ.15 వేల వంతున అందిస్తున్నారు. కేన్సర్ రోగులకు మెడికల్ మేనేజ్‌మెంట్ కింద 180 రోజులకు రూ.30వేలు, క్రిటికల్ చర్మవ్యాధులకు ఏడాదికి రూ.60వేల వంతన ఆసరా పథకం నిధులు రోగులకు అందిస్తున్నారు. ఈ లెక్కన గతేడాది అక్టోబరు నుంచి 6 నెలలకుగాను రోగులకు రూ.6 కోట్ల వరకు బకాయిలు చెల్లించాల్సి ఉంది. ఎన్డీఏ కూటమి రాష్ట్రంలో అధికారం చేపట్టాక మొదటి నాలుగు నెలలు ఆసరా కింద బాధితులను ఆదుకుంది. ఆ తర్వాత నిధులు విడుదల చేయకపోవటంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జిల్లావ్యాప్తంగా 132 నెట్‌వర్క్ ఆసుపత్రులు ఉండగా ఇందులో 35 ప్రైవేట్ నెట్‌వర్క్ ఆసుపత్రులు, 31 డెంటల్ ఆసుపత్రులు, 52 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 10 సామాజిక ఆసుపత్రులు, కావలి, కందుకూరు ఏరియా ఆసుపత్రులు, ఆత్మకూరు జిల్లా ఆసుపత్రితోపాటు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఉన్నాయి. ఇందులో ఆరోగ్యశ్రీ కింద జరుగుతున్న రోగులకు ఆసరా అందని ద్రాక్షలా మిగులుతోంది.

త్వరలో నిధులు వస్తాయి



ఆరోగ్యశ్రీ రోగులు డిశ్చార్జ్ అయిన వెంటనే ఆసరా నిధులు వారి బ్యాంకు ఖాతాలో జమ అయ్యేవి. అయితే ఇటీవల ఆ నిధులు రాక పోవటంతో రోగుల నుంచి కూడా ఒత్తిడి ఎక్కువైంది. రాష్ట్ర ప్రభుత్వం కూడా రోగులకు ఆసరా కింద నగదు అందించేందుకు కసరత్తు చేస్తోంది. వచ్చే నెల మే నుంచి రోగులకు డబ్బులు అందించే వీలు ఉంటుంది. 6 నెలల బకాయిలు కూడా అప్పుడే అందజేస్తారు.

- డాక్టర్ సుధీర్‌కుమార్,
ఎన్టీఆర్ వైద్యసేవ పథకం
జిల్లా కో ఆర్డినేటర్

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	117
స్కిన్ చికెన్	210
స్కిన్‌లెస్	232

కోడిగుడ్ల ధర (100): 420

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9033
వెండి కిలో ధర	రూ. 98,000
వెండి ఒక గ్రాము	రూ.101.00

తగ్గిన మిర్చి ధర : ఆందోళనలో రైతులు

అనంతసాగరం ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మిర్చి ధర తగ్గుముఖం పట్టడంతో రైతులు లబోదిబోమంటున్నారు. మనుము రూ.170లు పలుకుతుండడంతో అన్నదాతలు నష్టపోతున్నారు. గత నెలలో రూ.250ల వరకు ధర పలుకగా వ్యాపారులు అవసరాలకు అనుగుణంగా ధరను తగ్గిస్తుండంతో, రైతులు పెట్టిన పెట్టుబడులు రాక ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని సంజీవనగరం, గౌరవరం, అగ్రహారం, బొమ్మవరం తదితర గ్రామాల్లో మిరప సాగు చేపట్టారు. కొన్ని చోట్ల వైరస్ సోకి పంట దెబ్బతినగా, వేలకు వేలు ఖర్చు పెట్టి పంటను కాపాడుకుంటే నేడు దిగుబడికి ధర లేదని రైతులు వాపోతున్నారు.

న్యూస్ బాక్స్

అక్రమ కేసులకు భయపడం

కావలిటౌన్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి) అధికార పార్టీ బెదిరింపులకు, అక్రమ కేసులకు భయపడబోమని అవసరమైతే జైలుకెళ్లేందుకు సిద్ధమని మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం జర్నలిస్ట్ క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. పట్టణంలో జరిగిన మనీ స్కామ్‌లో సూత్రధారిని పట్టుకున్నా, ఇంతవరకు అతీగతీ లేదని ఆ కేసు ఇక హుష్‌కాకేనా ? అని ప్రశ్నించారు. తాను భూకబ్జాలు చేసినట్లు ప్రచారం చేస్తున్నారని, ఆ భూములెక్కడున్నాయో చూపించి స్వాధీనం చేసుకోవాలని తెలిపారు. ఈ విషయాన్ని పదేపదే చెబుతున్నా ఎందుకు స్వాధీనం చేసుకోలేదని ప్రశ్నించారు. చంద్రబాబు చేసిన మోసం తెలుసుకుని ప్రజలు నేడు చింతిస్తున్నారన్నారు. సమావేశంలో పలువురు వైసీపీ నేతలు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

కావలి,ఏప్రిల్13 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు గుడ్డ సంచులనే వాడదామని జేవీవీ కావలి శాఖ గౌరవాధ్యక్షుడు డాక్టర్ బెజవాడ రవికుమార్, అధ్యక్షుడు తోట వెంకటేశ్వర్లు తెలిపారు. జేవీవీ ఆధ్వర్యంలో దాత రాజశేఖర్ సహకారంతో ఆదివారం రైతుబజారు వద్ద వినియోగదారులకు గుడ్డ సంచులు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ క్యాన్సర్‌కు కారకమైన ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించి, గుడ్డ సంచులనే ప్రతి ఒక్కరూ వాడుకోవాలన్నారు. కార్యక్రమంలో జేవీవీ నేతలు గాది రెడ్డి హరినాథ్, కోశాధికారి టీ. సుబ్బరాయశర్మ, జీ కల్యాణి, కే. నారాయణ, కే. హరినారపరెడ్డి, ఎస్‌కే ఖాదర్ బాష, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

అనివేటి మండపం నిర్మాణానికి విరాళం

కందుకూరు, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): గ్రామదేవత అంకమ్మ ఆలయ అనివేటి మండపం నిర్మాణం కోసం చెరుకూరి రమేష్‌బాబు -అనిత దంపతులు రూ. 10 లక్షలు విరాళాన్ని ఆదివారం కమిటీ సభ్యులకు అందజేశారు. గుత్తా వెంకటనరసింహం, దివి ప్రణీత్‌చౌదరిల జ్ఞాపకార్థం ఈ మొత్తాన్ని అందజేస్తున్నట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు వై. వెంకటరెడ్డి, ఏ.మాధవరావు, జీ. శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సామాన్యుడి నడ్డి విరుస్తున్న నిత్యావసరాలు

బిట్రగుంట, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలు సామాన్యుడి నడ్డి విరుస్తున్నాయని సీపీఎం మండల పార్టీ సీనియర్ నేత తుమ్మల వెంకయ్య అన్నారు.బోగోలు మండలం ఇబ్రహీంపేటలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలకు సామాన్యుడి ఆర్థిక పరిస్థితిపై అవగాహన లేదా ? అని ప్రశ్నించారు. పెరిగిన నిత్యావసర వస్తువులతోపాటు పెట్రోల్, డీజిల్ ధరలు వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల సీఐటీయూ కార్యదర్శి చల్లా నరహరి, రైతు నాయకులు పీ.శ్రీనివాసులు, సీఐటీయూ నేత షేక్.అన్వర్‌బాషా, మండల ఉపాధ్యాయ సంఘాధిపతి ఎన్.రామయ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు తెలుసుకునేందుకే 'పల్లెకు పోదాం'

బిట్రగుంట, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సమస్యలు తెలుకునేందుకే 'పల్లెకు పోదాం' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని బీజేపీ మండల అధ్యక్షుడు వీరాల శ్రీనివాస్ యాదవ్ అన్నారు. బోగోలు మండలం ఎస్‌జీవీ కండ్రికలో ఆదివారం బీజేపీ నేతలు ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బెల్లంకొండ మాల్యాద్రి పాల్గొని మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల ఆర్థికాభివృద్ధికి కేంద్రం ప్రవేశ పెట్టిన పథకాలను వివరించారు. అనంతరం స్థానిక సమస్యలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు గోపికృష్ణ యాదవ్, గుర్రం వెంకటేశ్వర్లు, పసులేటి సూర్యం పాల్గొన్నారు.

అగ్నిమాపకశాఖ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

కావలి రూరల్, ఏప్రిల్13(ఆంధ్రజ్యోతి): అగ్నిమాపక శాఖ సేవలు ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జి ఫైర్ ఆఫీసర్ జీ. ప్రభాకర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణంలో సోమవారం నుంచి ఈనెల 20వ వరకు అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. అపార్టుమెంట్‌వాసులు, విద్యాలయాలు, బస్టాండ్, రైల్వేస్టేషన్, పెట్రోల్ బంక్ తదితర ప్రాంతాల్లో నిర్వహించే ఈ అవగాహన వారోత్సవాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే టోల్‌ఫ్రీ నెంబరు 101, 112లతోపాటు ఫైర్‌స్టేషన్ నెంబరు 08626-243101, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ నెంబరు 99637 34286కి ఫోన్ చేయాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దుత్తలూరు(ఉదయగిరి), ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్రవాడ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఆర్డీఎస్ పనులు జరుగుతున్నాయి. దీంతో సోమవారం ఉదయం 9.30 నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ వెంకటసుబ్బయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నిర్మాణం పూర్తయి రెండేళ్లు

● ప్రారంభానికి నోచని వసతిగృహం ● అగచాట్లు పడుతున్న ఆదర్శ పాఠశాల విద్యార్థినులు



తిమ్మారెడ్డిపాలెం ఏపీ మోడల్ స్కూల్లో పూర్తయిన బాలికల వసతి గృహం

లింగసముద్రం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : గ్రామ ప్రాంతాల్లోని విద్యార్థినులకు ఆంగ్ల మాధ్యమంలో విద్యా బోధన అందించి, వారిని ఉన్నత స్థానాలకు చేర్చేందుకు కేంద్రం ఏర్పాటు చేసిన ఆదర్శ పాఠశాలలకు అనుబంధంగా వసతి గృహాలు నిర్మించారు. ఇందులో భాగంగా మండలంలోని తిమ్మారెడ్డిపాలెంలోని ఆదర్శ పాఠశాల ఆవరణలో ఆర్ఎంఎస్ఏ పథకం కింద రూ.28.81 లక్షలతో బాలికల కోసం వసతి గృహాన్ని నిర్మించారు. ఈ భవనం 2023 జూన్‌లోనే నిర్మాణ పూర్తయింది. కానీ ప్రారంభానికి నోచుకోలేదు.ఈ వసతిగృహంలో సిబ్బందిని నియమించలేదు. వంట పాత్రలు పంపించలేదు. బాలికల కోసం మంచాలు కూడా ఏర్పాటు చేయలేదు.ఈ కారణాలతో ఈ వసతి గృహాన్ని ప్రారంభించలేదు.దీంతో బాలికలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

● పెరగని బాలికల సంఖ్య

వసతి గృహం ప్రారంభం కాకపోవడంతో ఆదర్శ పాఠశాలలో విద్యార్థినుల సంఖ్య పెరగడం లేదు.ప్రస్తుతం పాఠశాలలో ఆరు నుంచి సీనియర్ ఇంటర్ వరకు 260 మంది బాలికలు చదువుతున్నారు.అయితే వీరిలో ఎక్కువగా లింగసముద్రం, ఎర్రారెడ్డిపాలెం, పెంట్రాల, ఆర్ఆర్ పాలెం, మొగిలిచెర్ల, గంగపాలెం, మాలకొండరాయునిపాలెం, విశ్వనాధపురం తదితర గ్రామాలకు చెందిన వారు ఉన్నారు. వీరంతా సుమారు 5 నుంచి 15 కి.మీ దూరం నుంచి వస్తుంటారు. బస్సులు, సైకిళ్ల, ఇతర వాహనాలలో వచ్చి చదువుతుంటారు.అయితే ఈ వసతి గృహాన్ని ప్రారంభిస్తే ఈ పాఠశాలలో చేరే విద్యార్థినుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని విద్యార్థినుల తల్లిదండ్రులు అంటున్నారు.

అంబేడ్కర్‌కు నేతల నివాళులు



కందుకూరు : అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాల ఉద్యోగుల సంఘం నేతలు తదితరులు

కందుకూరు, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ జయంతి సందర్భంగా దళితనేత కట్టా వెంకటనారాయణ జ్ఞాపకార్థం పట్టణంలో రెండువారాలుగా నిర్వహిస్తున్న నివాళుల కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం మాల ఉద్యోగుల సంఘం, వివిధ దళితసంఘాల నేతలు అంబేడ్కర్‌కు ఘనంగా నివాళులు నిర్వహించారు. కార్యక్రమంలో మాల ఉద్యోగుల సంఘం, మాలసంఘాల జేఏసీ అధ్యక్షుడు టీ. అశోక్, జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు పాలేటి కోటేశ్వరరావు, మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు కొప్పోలు ఏడుకొండలు, వివిధ సంఘాల నాయకులు కట్టా సుచరిత, వై. మల్లికార్జున, వై. జనార్దన్, బీ. గోపినాథ్ తదితరులు పాల్గొన్నారు.

● స్మృతివనాన్ని పీ-4కి అప్పగించవద్దు

విజయవాడ స్వరాజ్య మైదానంలో ఏర్పాటుచేసిన అంబేడ్కర్ స్మృతివనాన్ని పీ4 పద్ధతిలో కార్పొరేట్ వ్యక్తులకు అప్పగించాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా కలెక్టరు లక్ష్మీషా ప్రకటించటం దురదృష్టకరమని బ్యాంకు అధికారుల సంఘం మాజీ నేత, దళితసంఘాల రాష్ట్ర గౌరవాధ్యక్షుడు పాలేటి కోటేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పీ-4 పద్ధతిలో కార్పొరేట్ వ్యక్తులకు అప్పగిస్తే అది వ్యాపారకేంద్రంగా మారుతుందని పేర్కొన్నారు.

● **బిట్రగుంట, (ఆంధ్రజ్యోతి):** బోగోలు పాత దళితవాడలోని రీడింగ్‌రూమ్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద సోమవారం జరిగే జయంతి ఉత్సవాలకు భారీ ఏర్పాట్లు చేశారు. కడనూతల దళితవాడ ప్రాథమిక పాఠశాల వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహాన్ని రంగులతో ముస్తాబు చేశారు. రామస్వామిపాలెం జైభీం అంబేడ్కర్ క్రీడామైదానంలో విద్యుత్ దీపాలంకరణ చేశారు. అంబేడ్కర్ సందర్భంగా మూడురోజులపాటు మండలస్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నారు.

ఊరూరా ఉత్సాహంగా మట్టల ఆదివారం



కందుకూరులో జరిగిన మట్టల ఆదివారం కార్యక్రమంలో పాల్గొన్న క్రైస్తవులు



బిట్రగుంట : ఈత మట్టలతో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు



ఉదయగిరి : ఈతమట్టలతో ర్యాలీగా చర్చికి వెళ్తున్న క్రైస్తవులు

కందుకూరు, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలో క్రైస్తవులు మట్టల ఆదివారం కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. వివిధ చర్చిల్లో ఈ కార్యక్రమాన్ని తమ సాంప్రదాయ పద్ధతిలో నిర్వహించారు. సంతోష్‌నగర్‌లోని విలియంకేరి తెలుగుబాప్టిస్ట్ టౌన్‌చర్చి ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ జరిపారు. చిన్నారులు, పెద్దలు మట్టలను చేతపట్టుకుని ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో పాస్టర్ ఏ. ప్రతాప్, చైర్మన్ చదలవాడ నాగభూషణం, సెక్రటరీ సహజానందం, జయరావు, కోటేశ్వరరావు, పీటర్, నాగరాజు, సింగయ్య, మెర్సీమహిత తదితరులు పాల్గొన్నారు.

● **బిట్రగుంట (ఆంధ్రజ్యోతి):** బోగోలు మండలంలోని పలు క్రైస్తవ మందిరాల్లో ఆదివారం ఉదయం మట్టలాదివారపు వేడుకలు జరిగాయి. సండేస్కూల్ పిల్లలు ఈత, టెంకాయి, క్రోటన్ మట్టలకు పూలను గుచ్చి పురవీధులలో యూదులరాజ హోసన్న దావీదు తనయ్య హోసన్న అంటుపాటలు పాడుతూ ర్యాలీ నిర్వహించారు. బోగోలో పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు రెవ. డా శ్యాంసన్‌బాబు సండేస్కూల్ విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అలాగే హోలీ ఫ్యామిలీ చర్చి ఫాదర్ బీ.పాల్, కడనూతలో పాస్టర్ రెవ. సీహెచ్.నాగరాజు సంఘస్తులతో ర్యాలీ చేశారు. విశ్వనాథరావుపేట, రామస్వామిపాలెం, తిప్ప బాడన్‌పేట, చెన్నారెడ్డిపాలెం, తాళ్ళూరు తదితర గ్రామాలో మట్టలాదివారపు ర్యాలీ, ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి.

● **అనంతసాగరం (ఆంధ్రజ్యోతి):** స్థానిక సెంటనరి తెలుగు బాపిస్టు, సోమశిలలోని క్రీస్తు సంఘం చర్చిలో ఆదివారం మట్టల పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా యేసు ప్రభు చేసిన మహిమలు వివరిస్తూ వీధుల్లో సువార్త గీతాలు ఆలపించారు. కార్యక్రమంలో పాస్టర్ రాజ్‌కుమార్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

● **ఉదయగిరి, (ఆంధ్రజ్యోతి):** ఈస్టర్ పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం పట్టణంలో పలు చర్చిల క్రైస్తవులు ఈతమట్టల పండుగను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఈస్టర్‌కు ముందు ఏసుప్రభువు జెరూసలెంలో ప్రవేశించిన సందర్భంగా అక్కడి ప్రజలు ఆయనకు తాటి, ఈతమట్టలతో స్వాగతం పలికారని, ఈ రోజు ఈతమట్టల పండుగ జరుపుకోవడం ఆనవాయితీ అన్నారు. అనంతరం చర్చిలో పాస్టర్లు ఆదివారం మట్టల ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో క్రైస్తవ మతపెద్దలు ప్రసాదరావు, బకీరు జాషువా, సుధీర్‌కుమార్, జక్కరయ్య తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా చెన్నకేశవుడి కల్యాణం



కల్యాణానికి సిద్ధమైన శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి

వింజమూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఎర్రబెల్లిపాలెంలో వెలసి ఉన్న శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వామి కల్యాణ మహోత్సవం ఆదివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. బాణసంచాల వేడుకల మధ్య స్వామివారిని శివాలయం దగ్గర ఉన్న మండపంపైకి తీసుకువచ్చి వేదమంత్రోచ్చరణలతో కల్యాణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. సేవా కార్యక్రమాల్లో ఎర్రబెల్లిపాలెం యూత్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనంతరం స్వామివారిని గ్రామోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమాలను ఆలయ ధర్మకర్త గణపం సుదర్శన్‌రెడ్డి, ఈవో శాంతయ్య తదితరుల పర్యవేక్షణలో నిర్వహించారు.

సీతారామపురం మండలంలో అభివృద్ధి పనులకు భూమి పూజ

సీతారామపురం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) :మండలంలోని పలు గ్రామాల్లో రూ.35లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణానికి ఎంపీపీ చింతంరెడ్డి పద్మావతి ఆదివారం భూమి పూజ చేశారు. ఆమె మాట్లాడుతూ జనరల్ ఫండ్ నిధులతో సంజీ వరెడ్డి నగర్‌లో రూ. 10 లక్షలు, బాలాయపల్లిలో రూ. 10 లక్షలు, బెడుసుపల్లిలో రూ.5లక్షలు, మారంరెడ్డిపల్లిలో రూ.5 లక్షలు, నాగరాజుపల్లిలో రూ.5 లక్షలతో సీసీ రోడ్లు, అరుగులు, తాగునీటి పథకాల నిర్మాణాలు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైసీపీ కన్వీనర్ చింతంరెడ్డి సుబ్బారెడ్డి, అయ్యవారిపల్లి సర్పంచి దుర్గాప్రసాద్, బాలినేని మాబయ్య, ఎల్ బ్రహ్మయ్య, సతీష్ కుమార్, రేనాటి రమణయ్య, టీ. శ్రీనివాసులు, రాకేష్, పాలకొలను వెంకటరెడ్డి పాల్గొన్నారు.



బాలాయపల్లిలో సిమెంట్‌రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ చింతంరెడ్డి పద్మావతి

వక్ఫ్ చట్ట సవరణ రద్దు చేయాలి

అనంతసాగరం ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక నేషనల్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం వక్ఫ్ సవరణ చట్టం రద్దు చేయాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. లైకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా చట్టంతో అనర్థాలు ఉన్నాయని, ప్రతి ఒక్కరూ ఖండించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు, ముస్లిం మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా గురుకులం ఎంట్రెన్స్

సంగం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక డాక్టర్ బీఆర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో 5వ తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరం ప్రవేశానికి ఆదివారం జరిగిన పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 10గంటలకు జరిగిన 5వ తరగతి పరీక్షకు 184 మందికిగాను 81 మంది పరీక్షకు హాజరయ్యారు. అదేవిధంగా మధ్యాహ్నం జరిగిన ఇంటర్ ప్రథమ సంవత్సర ప్రవేశ పరీక్షకు 282 మంది దరఖాస్తు చేసుకోగా 205 మంది పరీక్షకు హాజరయ్యారు.

ఆర్థిక సాయం

వింజమూరు, (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ పరిధిలోని బీబీకేఆర్ ఎస్టీ కాలనీకి చెందిన రావూరి కిషోర్ విద్యుత్‌షాక్‌కు తీవ్రంగా గాయపడ్డాడు. వైద్యం ఖర్చులకు కూడా డబ్బులు లేక మంచానికే పరిమితమ య్యాడు. సమాచారం తెలుసుకున్న గడ్డం పకీరయ్య అతడి ఇంటికి వెళ్లి పరామర్శించి రూ.10వేలు ఆర్థిక సాయాన్ని ఆదివారం అందజేశారు.

సొంత ఆలోచనలతో మార్గం ఏర్పరచుకోవాలి



ఎమ్మెల్యే కృష్ణారెడ్డి చేతుల మీదుగా ట్రోఫీలు అందుకున్న వశిష్ట విద్యార్థినులు పూజిత చౌదరి, లక్ష్మీహరిత

కావలిటౌన్, ఏప్రిల్13: విద్యార్థులు సొంత ఆలోచనలతో మార్గం ఏర్పరచుకోవాలని ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఆదివారం ఆయన అభినందించారు. వుల్లారెడ్డినగర్‌లోని శ్రీవశిష్ట కళాశాలలో జరిగిన అభినందన సభలో ఆయన పాల్గొని ర్యాంకర్లకు ట్రోఫీలందించారు. అనంతరం మాట్లాడుతూ కావలి విద్యార్థులు జిల్లా, రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించడం గర్వకారణమన్నారు. కార్యక్రమానికి ప్రిన్సిపాల్ అల్తాఫ్ అధ్యక్షత వహించగా, కరస్పాండెంట్ సురేంద్రరెడ్డి, సామశిల ప్రాజెక్ట్ కమిటీ మాజీ చైర్మన్ మధుబాబునాయుడు, ఎమ్మెస్సార్ కళాశాల కరస్పాండెంట్ రాజ్‌కుమార్‌చౌదరి, అధ్యాపకులు, తల్లితండ్రులు పాల్గొన్నారు. అలాగే శ్రీశ్రీనివాస కళాశాల ర్యాంకర్లను కూడా ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ బట్టేపాటి అశోక్ కుమార్, డైరెక్టర్ మాలకొండయ్య, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చెంచురామయ్య స్ఫూర్తితో ముందుకు..



కలిగిరి : పవిత్ర స్కూల్ వార్షికోత్సవాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

ఉదయగిరి, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే పొన్నెబోయిన చెంచురామయ్య స్ఫూర్తితో నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ తెలిపారు. ఆదివారం సానిక చెం చురామయ్య అతిథి గృహంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పీ. చెంచలబాబుయాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన చెంచురామయ్య 23వ వర్ధంతి కార్యక్రమంలో ఎమ్మెల్యే కాకర్ల సురేష్, ప్రవీణ దంపతులు పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ ప్రాంతంలో సాగు, తాగునీటి కష్టాలు తీర్చాలని అసెంబ్లీలో పాలికేక వేసిన వ్యక్తి చెంచు రామయ్య అన్నారు. నియోజకవర్గంలో గండిపాళెం, నక్కలగండి, మర్రివూట్ల రిజర్వాయర్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారన్నారు. నియోజకవర్గంలోని పలు మండలాలకు చెందిన టీడీపీ నాయకులు చెంచురామయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్ బయ్యన్న, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మన్నేటి వెంకటరెడ్డి, టీడీపీ నాయకులు రియాజ్, బొజ్జా నరసింహులు, నల్లిపోగు రాజా, బొజ్జా శ్రీనివాసులు, సందానీ, శ్రీకుర్తి రవీంద్రబాబు, తుమ్మల కిరణ్, ఉడతా సుమన్ యాదవ్, శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

● విద్యార్థులకు నైపుణ్యం తప్పనిసరి

కలిగిరి, ఏప్రిల్13(ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి చిన్నతనం నుంచి విద్యతోపాటు అన్ని రంగాల్లోనూ నైపుణ్యం సాధిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. స్థానిక పవిత్ర ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో ఆదివారం జరిగిన 17వ వార్షికోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఓ లక్ష్యాన్ని ఎంచుకొని ఉన్నతస్థితిలో నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే దంపతులతోపాటు పవిత్ర విద్యాసంస్థల చైర్మన్ ఎండ్లూరి వెంకటేష్, జడ్పీటీసీ మాల్యాద్రిరెడ్డి, ఎంపీపీ శిరీష, టీడీపీ కన్వీనర్ బీ. క్రిష్ణారెడ్డి, మేనేజ్‌మెంటు ఎండ్లూరి రమణయ్య, మాదాల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వాశిలిలో అభయాంజనేయ విగ్రహ ప్రతిష్ఠ



సంగం : రాజరాజేశ్వరిదేవి ఆలయంలో జరిగిన హోమంలో పాల్గొన్న భక్తులు

ఆత్మకూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వాశిలి గ్రామంలోని తూర్పు ఎస్సీ కాలనీలో నూతనంగా నిర్మించిన అభయాంజేయ స్వామి ఆలయంలో ఆదివారం విగ్రహ ప్రతిష్ఠ గావించి పూజలు నిర్వహించారు. విగ్రహ ప్రతిష్ఠకు విచ్చేసిన భక్తులకు నిత్య అన్నదాత, సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కంచి పరమేశ్వరరెడ్డి తన సొంత నిధులతో అన్నప్రసాద వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, స్థానికులు కంచి పరమేశ్వరరెడ్డిని సన్మానించారు.

● రాజరాజేశ్వరిదేవికి పౌర్ణమి పూజలు

సంగం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక తిరుమనకొండలో వెలసి ఉన్న శ్రీరాజరాజేశ్వరిదేవి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పీఠాధిపతి రాజరాజేశ్వరానందస్వామి ఆధ్వర్యంలో శ్రీ రాజరాజేశ్వరిదేవి సమేత కాశీ విశ్వేశ్వరస్వామికి అభిషేకాలు నిర్వహించి పూలతో అలంకరించారు. అనంతరం లలిత సహస్రనామ, హోమం తదితర పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

● నాగారపమ్మదేవికి..

సంగం మండలంలోని కోలగట్లలో వెలసి ఉన్న నాగారపమ్మదేవి ఆలయంలో ఆదివారం పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా క్షీర, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి అనంతరం మూలవిరాట్‌కు పూలతో అలంకరించారు. మహిళలు పొంగళ్లు పొంగించి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

● సీతారాములకు ఏకాంతసేవ

బిట్రగుంట, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): బోగోలు యాదవపాలెం కోదండరామాలయంలో సీతారాముల కల్యాణం అనంతరం ఆదివారం రాత్రి ఏకాంత సేవ జరిగింది. పర్వతనేని యానాదినాయుడు (వాసు)- శ్రీవాణి దంపతులు ఉభయ కర్తలుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమానికి భక్తులు వేలాదిగా తరలివచ్చారు.

● వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ

దుత్తలూరు(ఉదయగిరి), ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెడ్లదిన్నెలో నూతనంగా నిర్మించిన శ్రీకోదండరామస్వామి ఆలయంలో ఆదివారం శ్రీసీతారామలక్ష్మణ విగ్రహాల ప్రతిష్ఠను వైభవంగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ శాస్త్రోక్తంగా విగ్రహ ప్రతిష్ఠ, కలశ, శిఖర ప్రతిష్ఠ, కుంభాబిషేకాలు, హోమాలు, ప్రత్యేక పూజలు తదితర కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు ముఖ్యఅతిథులుగా హాజరైన ఎమ్మెల్యే కాకర్ల సురేష్, ప్రవీణ దంపతులకు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం వారు విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొని స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిర్వాహకులు భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఉండేలా గురవారెడ్డి, మన్నేటి వెంకటరెడ్డి, మల్లంపాటి గురవయ్యానాయుడు, శ్రీకుర్తి రవీంద్రబాబు, చీదర్ల మల్లికార్జున, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అన్న ప్రసాద వితరణలో పరమేశ్వరరెడ్డి

రేపు సామాజిక తనిఖీ ప్రజా వేదిక

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో మంగళవారం సామాజిక తనిఖీ బహిరంగ ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఆదివారం ఎంపీడీవో వేణుగోపాల్‌రావు తెలిపారు. ఆయన మాట్లాడుతూ 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనులకు సంబంధించి ఆడిట్ బృందం గ్రామాల్లో విచారణ చేపట్టడం జరిగిందన్నారు. అందులో భాగంగా ప్రజావేదికలో నివేదికలు చదివి వినిపించడం జరుగుతుందన్నారు. కావున ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు, ఉపాధి సిబ్బంది హాజరు కావాలని ఆయన కోరారు.

చలివేంద్రం ప్రారంభం

దుత్తలూరు(ఉదయగిరి), ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): దుత్తలూరు సెంటర్‌లోని పోలీస్‌స్టేషన్ సమీపంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆదివారం పారిశ్రామికవేత్త నంబూరి రోశిరెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఎండకు ప్రయాణికులు, ప్రజలు, వాహనదారులు తాగునీటికి ఇబ్బందులు పడకుండా ఉండేందుకు ఈ చలివేంద్రాన్ని ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు లెక్కల వెంగళరెడ్డి, బీజేపీ, టీడీపీ నాయకులు రామయ్య, చుండి హరిగోపాల్‌రెడ్డి, చిన్నపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.